RNI No. TELTEL/2013/51365

# తెలుగు రేఖ

విద్య, వైద్య, రాజకీయ, సామాజిక, న్యాయ, సమగ్ర సమాచార మాస పత్రిక

సంపుటి : 01 | సంచిక : 01 | జూన్ - 2025 | పేజీలు : 52 | వెల- 10/-



# ప్రజా వైద్యులు

## డా. పాములపర్తి రామారావు...

# 2023-25 PLACEMENTS




## CHOOSE 1st PRIORITY IN DOST

- Dedicated Proved Management
- Well Experienced staff
- Well equipped Labs
- Regular NSS & NCC Programme
- Hostel Facility with Health Food
- Placement Service through TASK
- Sports & Cultural Activities
- Coaching for competitive exams (Banks & Groups)

## ADMISSIONS ARE IN PROGRESS

## COURSES OFFERED

### B.Sc.

Mathematics, Statistics, Data Science
Mathematics, Physics, Computer Science
Agriculture, Botany, Chemistry
Food Science, Zoology, Chemistry
Food & Nutrition, Botany, Zoology

### B.Com.

Computer Application (C.A)(E/M)

### BBA

Health Care Management (HCM)
Bachelor of Business Administration

Upload skills download champions...

# JAAGRUTHI

(Affiliated to Kakatiya University) Day & Residential

# WOMEN'S DEGREE COLLEGE

**BHEEMARAM, HANUMAKONDA.**

7013598396, 9652000931, 9030332218, 9963723862, 7997008880, 7893662957, 9059977855, 9963197573

# తెలుగు రేఖ

విద్య, వైద్య, రాజకీయ, సామాజిక, న్యాయ, సమగ్ర సమాచార మాస పత్రిక


సంపుటి : 1 | సంచిక : 01 | పేజీలు : 52 | జూన్ - 2025 | వెల : 10/-



**ఎడిటర్ & పబ్లిషర్**
ఎల్ది రవీందర్
9963197573

**ప్రింటర్**
జి.శ్రీనివాస్

**అసోసియేట్ ఎడిటర్**
ఎల్ది రాజు
7893662957

**తెలంగాణ స్టేట్ బ్యూరో చీఫ్**
ఎల్ది మహేందర్
9652000931

**మేనేజింగ్ ఎడిటర్**
తాళ్ళపల్లి తిరుపతి
9959995782

**టెక్నికల్ ఎడిటర్**
దొంగల వేణు
8179121500

**లీగల్ అడ్వయిజర్**
ఆరెపల్లి త్రివేణి B.A.,LL.B.
అడ్వకేట్, 9515810018

**కంటెంట్ మేనేజ్మెంట్ & డి.టి.పి.**
ఫ్యామ్జిక్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ .
www.famgic.com
8985044995


## లోపలి పేజీల్లో...


ప్రజావైద్యులు డా.పాములపర్తి రామారావు....05

మనమంతా టీమిండియా....07

ఎన్నికలప్పుడే రాజకీయం..తర్వాత అభివృద్ధే లక్ష్యం....11

ఇంటికి రూ.5 లక్షల ఘనత మాదే....15

కోల్డ్‌స్టోరేజీలు నిర్మిస్తాం :మంత్రి ఉత్తమ్....20

సౌరశక్తి వినియోగంతో ఆర్థికాభివృద్ధి : మంత్రి కోమటిరెడ్డి....25

గిఫ్ట్‌డీడ్ ప్రాముఖ్యత ఏమిటి?....28

లైఫ్ 3.0 కొత్తకొత్తగా ఉన్నది..!....30

మన మనసుకూ రీఛార్జ్ అవసరమే!....35

పేరెంట్స్ నో చెప్పడం నేర్చుకోవాలి..!....38

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత....40

సైబర్‌కాండ్రియా నెట్ వైద్యం....44

చింత చిగురా మజాకా....46

కిన్నెరసాని..చూసొద్దాం రండి....48

ఉత్తమ నటుడు అల్లు అర్జున్....49



Owner, Publisher & Editor: Eldi Ravinder, Published from: 9-10/7, Krishna Nagar, Vil: Bommakal, Mdl& Dist: Karimnagar-505001, Telangana. Printed By: Gandal Srinivas, 8-82/11/1, Auto Nagar, Vil: Bommakal, Mdl& Dist: Karimnagar-505001, Telangana.
RNI No. TELTEL/2013/51365

## సంపాదకీయం

# చీకటి వెలుగులు

ప్రపంచవ్యాప్తంగా ఎన్నో ఆలయాలు ఉన్నాయి. ఎన్నో మతాలు ఉన్నాయి. ఎన్నో ఆరాధనా పద్ధతులు ఉన్నాయి. ఆలయాల తొలి ఆనవాళ్లు క్రీస్తుపూర్వం పన్నెండువేల ఏళ్లనాటివి. దాదాపు అన్ని మతాలూ దైవభక్తిని ప్రబోధించేవే! జ్ఞానమార్గాన్ని బోధించిన మతాలు లేకపోలేదు గాని, జనాలను భక్తిపారవశ్యం ఆకట్టుకున్నంతగా జ్ఞానం ఆకట్టుకున్న దాఖలాలు తక్కువ. భాషలు పుట్టి, లిపులు ఏర్పడి, సమాచారాన్ని శిలల మీద, మట్టి పలకల మీద, లోహపు రేకుల మీద, ఆకుల మీద నిక్షిప్తం చేయడం మొదలుపెట్టిన తర్వాత గాని ప్రపంచంలో జ్ఞానవ్యాప్తి మొదలు కాలేదు. మనుషులకు అక్షరజ్ఞానం అబ్బిన తర్వాత తమకు తెలిసిన సమాచారాన్ని తమకు దొరికిన సాధనాలను ఉపయోగించుకుంటూ లిఖితపూర్వకంగా నిక్షిప్తం చేయడం మొదలుపెట్టారు. చరిత్రలో తొలినాటి రచనల ఆనవాళ్లు క్రీస్తుపూర్వం నాలుగో సహస్రాబ్ది నాటివి.

మానవాళి జ్ఞానయానానికి అవి తొలి మైలురాళ్లు. భక్తిపారవశ్యం ఒకవైపు, జ్ఞానయానం మరోవైపు మానవాళి మనుగడను ఆది నుంచి నిర్దేశిస్తూనే ఉన్నాయి. సామాజిక, తాత్త్విక, శాస్త్ర, సాంకేతిక పురోగతికి ఎందరో జ్ఞానులు బాటలు వేశారు. లోకమంతటా తమ జ్ఞానకాంతులను ప్రసరించారు. వినువీథిలో ఒకవైపు సూర్యుడు సహా అసంఖ్యాక నక్షత్రాలు నిరంతరం వెలుగులను వెదజల్లుతున్నా, మరోవైపు చీకటి నిండిన కృష్ణబిలాలు కూడా ఉన్నాయి. అలాగే ఈ లోకంలో ఒకవైపు జ్ఞానులు ప్రసరించిన జ్ఞానకాంతులు ఉన్నా, మరోవైపు మౌఢ్యాంధకారం కూడా అంతే గాఢంగా ఉంది. మానవాళిలో మౌఢ్య నిర్మూలనమనేది ఇప్పటికీ నెరవేరని కలగానే మిగిలింది. 'మతములన్నియు మాసిపోవును/ జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును' అని గురజాడ ఆకాంక్షించారు. ఇప్పటి పరిస్థితులను గమనిస్తే, ఆయన ఆకాంక్ష నెరవేరడానికి ఇంకెన్ని యుగాలు పడుతుందో చెప్పడం కష్టం.

ఆరాధించే వాటికి ఆలయాలను నిర్మించుకోవడం అనాది సంస్కృతి. దేవాలయాలను, ప్రార్థనాలయాలను నిర్మించుకున్న మనుషులు అక్కడితో ఆగిపోలేదు. ఆరాధ్య నటీనటులకు, నాయకులకు సైతం ఆలయాలను నిర్మించే స్థాయికి పరిణామం చెందారు. ప్రపంచంలో మౌఢ్యం శ్రుతిమించి మితిమీరిన కాలాల్లో సమాజాన్ని సంస్కరించడానికి ఎందరో సంస్కర్తలు ప్రయత్నించారు. జ్ఞానకాంతులతోనే మౌఢ్యాంధకారం పటాపంచలవుతుందని గ్రహించి, జ్ఞానవ్యాప్తికి కృషి చేశారు. ఒక తరం నుంచి మరో తరానికి జ్ఞానసంపదను అందించడానికి గ్రంథాలయాలను నెలకొల్పారు.

ప్రపంచంలోని తొలి గ్రంథాలయం క్రీస్తుపూర్వం మూడో సహస్రాబ్దిలో ఏర్పడింది. ఇప్పటి సిరియాలోని టెల్ మార్దిక్ గ్రామంలో ఉందది. 'ది రాయల్ లైబ్రరీ ఆఫ్ ఎబ్లా' అనే ఈ గ్రంథాలయం తొలి జ్ఞాననిధి. ఇందులో ఇరవైవేల మట్టిపలకలపై ఉన్న రాతలు చెక్కుచెదరకుండా ఉన్నాయి. ఇది ద్విభాషా గ్రంథాలయం కావడం ఇంకో విశేషం. సుమేరియన్, ఎబ్లా?యెట్ భాషలలో చిత్రలిపిలో రాసిన రాతలు ఆనాటి సామాజిక, వాణిజ్య, విద్యాపరమైన పరిస్థితులకు సాక్షీభూతంగా నిలిచి ఉన్నాయి. ఈ మట్టిపలకల్లో కొన్ని ఇప్పుడు సిరియాలోని డెమాస్కస్, అలెప్పో తదితర నగరాల్లోని మ్యూజియంలలో ఉన్నాయి. ప్రాచీనకాలంలో మన ఉపఖండ భూభాగంలోనూ నలంద, తక్షశిల విశ్వవిద్యాలయాల్లో గ్రంథాలయాలు ఉండేవి. ఇప్పుడు వాటి శిథిలావశేషాలు తప్ప ఆనాటి జ్ఞానసంపద ఏదీ మిగిలి లేదు. పురాతన గ్రంథాలయాలు ఏర్పడిన కాలంలోనే ప్రపంచవ్యాప్తంగా మూఢాచారాలు కూడా విస్తృతంగా ఉండేవి.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక అనేక మార్పులు జరిగాయి. ఎంతో అభివృద్ధి జరిగింది. ప్రజల్లో అక్షరాస్యత పెరిగింది. పత్రికలు, అధునాతన ప్రసార మాధ్యమాలు విస్తృతంగా అందుబాటులోకి వచ్చాయి. అయినా, జనాల్లో మౌఢ్యం పూర్తిగా అంతరించలేదు. ఇప్పటికీ మన దేశంలో గ్రంథాలయాల కంటే దేవాలయాలు, ప్రార్థనాలయాలే ఎక్కువ. వైజ్ఞానికాభివృద్ధి ఫలితంగా అందివచ్చిన సాంకేతికత సాధనాలను కూడా వ్యర్థవినోదానికి వినియోగించుకోవడంలో మన జనాలు అపార ప్రజ్ఞాధురీణులు. మౌఢ్య ప్రాబల్యం ఎంతగా పెరుగుతున్నా, జ్ఞానారాధకులు అంతరించిపోలేదు. అందుకు నిదర్శనమే కేరళలోని కాసర్‌గోడ్ జిల్లా కంబళూరులో వెలసిన పుస్తకాలయం. పుస్తకమే ఇందులోని దేవత. పుస్తకాలే ప్రసాదం. 'జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును' అనే ఆకాంక్షను వెలిగించడానికి ఇదొక ఆశాదీపం.

**ఎడిటర్**



# ప్రజా వైద్యులు

## డా. పాములపర్తి రామారావు...

ఈ పేరు ఆయుర్వేద వైద్యరంగంలో చారిత్రాత్మకంగా నిలిచిపోతుంది అని నిస్సందేహంగా చెప్పవచ్చు. ఎందుకో తెలియాలంటే ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణులు డా. పాములపర్తి రామారావు చరిత్ర తెలుసుకోవాల్సిందే!. ప్రజా వైద్యులుగా ప్రసిద్ధి చెందిన డా. పాములపర్తి రామారావు ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంలో ని మట్టెవాడలో జన్మించారు. ఆయన తండ్రి సదాశివరావు బహుముఖ ప్రజ్ఞాశాలి, తనను భారతదేశపు



మరో సోక్రటీస్ గా పోల్చుకోవచ్చు. రచయిత, అభ్యుదయ వాది, సంగీత సాహిత్య రంగాలలో ఖ్యాతి గడించిన వ్యక్తి. మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు యొక్క సహోదరుడు, అత్యంత ఆత్మీయులు. సదాశివరావు ఆయుర్వేద వైద్య విధానాలపై ఎన్నో పుస్తకాలు రాశారు. తన తండ్రి కాకతీయ వార పత్రికను నడిపిస్తూ స్వాతంత్ర్య ఉద్యమం సమయంలో చేసిన అక్షర ఉద్యమం వలన రామారావులో సేవగుణం చిన్ననాటి నుండే అలవాటుగా మారింది. కేరళలో 1984 సంవత్సరంలో యూనివర్సిటీ ఆఫ్ త్రివేంద్రంలో ఎండీ ఆయుర్వేదం చదివిన రామారావు 1987 నుండి మెడికల్ ఆఫీసర్ గా భద్రాచలంలో, తదితర ప్రాంతాలలో విధులు నిర్వహించారు. రామారావు కు ఒక కొడుకు ఆధిత్య, కూతురు అర్చన, ఆయన సతీమణి కొన్నాళ్ళ క్రిందట స్వర్గస్తులయినారు. అనంత లక్ష్మీ ఆయుర్వేద కళాశాలలో లెక్చరర్ గా నియమకమయ్యాక సమర్దవంతంగా విధులు నిర్వహిస్తూనే అర్చన ఆయుర్వేద వైద్యశాలను ఏర్పాటు చేసి ఉచిత వైద్య సేవలు అందించడం ప్రారంభించారు. వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపల్ గా రిటైర్ అయ్యారు. ప్రొఫెసర్ డా. పాములపర్తి రామారావు. ఇక అప్పటి నుండి తన పూర్తి సమయాన్ని ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు నిశ్చయించుకున్న ఆయన ఇప్పటి వరకు కూడా ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందిస్తూనే ఉన్నారు.

**ప్రజల గుండెల్లో చెరగని కీర్తి ప్రతిష్టలు ఆయన సొంతం...**



సేవలు పొందిన వారి మన్ననలు పొందడమే కాదు తన ఖ్యాతి రాష్ట్రాలు, దేశం ఎల్లలు దాటింది. నేటికీ తెలంగాణలోని వివిధ జిల్లాల నుండి కాకుండా ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, మహారాష్ట్ర, ఛత్తీస్గఢ్, తదితర రాష్ట్రాలు, అమెరికా, దుబాయి ఇతర దేశాల నుండి కూడా డా. పాములపర్తి రామారావు వద్దకు చికిత్స కోసం రోగులు వస్తుంటారు. నడుము నొప్పి, కీళ్ల నొప్పులు, కంటి సంబధిత వ్యాదులు, వెన్ను పూసలో డిస్క్ జారడం, మెడ నొప్పులు వంటి వివిధ రోగాలకు డా. పాములపర్తి రామారావు తన వైద్య నైపుణ్యాలతో నయం చేస్తుంటారు. ఆసుపత్రి అంటేనే బెంబేలు ఎత్తిపోయే ఈ రోజుల్లో కార్పొరేట్ పోటీ ప్రపంచంలో ఎలాంటి హంగులు ఆర్భాటాలు లేకుండా వరంగల్ జిల్లాలోని మట్టెవాడలో గల తన ఇంటినే ఆసుపత్రిగా మలిచి, వేల మందికి ఉచిత వైద్య సేవలు అందిస్తున్న డా. పాములపర్తి రామారావు కు ఎన్నో అవార్డులు వరించాయి. ప్రజల్లో కీర్తిని సంపాదించారు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్లో స్థానం దక్కించుకున్నారు. అప్పటి వరంగల్ జిల్లా కలెక్టర్ కిషన్ ప్రభుత్వం తరపున అభినంధించి, సత్కరించారు.

**గత 30 ఏళ్ళుగా అలుపెరుగని ఉచిత వైద్య సేవలు...**




వెన్నుపూస, డిస్క్ సమస్యలకు స్వయంగా తెరపీని కనుగొన్న ఆయన గత 30 సంవత్సరాల నుండి ఎంతో మందికి ఉపశమనం కల్పించారు. తన అపాయింట్మెంట్ కోసం రోజుల తరబడి పడిగాపులు కాస్తరంటేనే అర్థం చేసుకోవచ్చు డా. పాములపర్తి రామారావు పేరు ఆయుర్వేద వైద్యరంగంలో చారిత్రాత్మకంగా నిలిచిపోతుంది అని. తన వైద్యసేవలు పొంది లబ్ది పొందిన వారు ఏకంగా తన రుణం తీర్చుకునేంధుకుగాను మట్టెవాడలోని తన ఇంటి ముందు ప్రజా వైద్యుడు డా. పాములపర్తి రామారావు యొక్క కాంస్య విగ్రహం ఏర్పాటు చేశారు. తన పెన్షన్ డబ్బులను, ఎవరైనా సహృదయంతో దక్షిణగా ఇచ్చిన వాటిని సిబ్బంది వేత్తనాలకు, హసన్పర్తి దగ్గర గల ఎర్రగట్టుగుట్టలో ఏర్పాటు చేసిన అర్చన ఆయుర్వేద క్లినిక్ సిబ్బందికి, రెంటు కు కేటాయిస్తారు.

**ప్రాణం సహకరించేంత వరకు సేవ చేస్తాను...**

డా. పాములపర్తి రామారావు 'ఆనందమయ జీవితం', ఆయుర్వేదం– ఒక పరిచయం, జీవన విదానం మారాలి వంటి పుస్తకాలు వ్రాశారు. తన చేతి వ్రేళ్ళనే వైద్య సాదనాలుగా మాలచుకొని తాను కనుగొన్న మసాజ్ తెరపీతో, తాను నేర్చుకున్న ఆయుర్వేద వైద్య విద్యతో ఇప్పటికీ ఎప్పటికీ తన ప్రాణం సహకరించే వరకు ప్రజలకు ఉచిత వైద్యసేవలు అందిస్తానని అంటున్నారు.

నిస్వార్థంతో ఈ రోజుల్లో ఈ కార్పొరేట్ కాసుల ప్రపంచంలో డబ్బులు ఆశించకుండా ఉన్నవారు లేనివారు అని బేధాలు లేకుండా అన్ని మతాల వారిని, ఏ రాష్ట్రం, ఏ దేశం వారైనా సరే తనను నమ్మి వచ్చిన వారికి తనకు తెలిసిన ఆయుర్వేద వైద్య మెలకువలతో రోగులకు ఉచిత వైద్యసేవలు అందిస్తోన్న ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణులు, ప్రజా వైద్యుడు డా. పాములపర్తి రామారావు సేవలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా గుర్తించి పద్మ అవార్డుతో, సేవా పురస్కారాలతో సత్కరించి, సహకారం అంధించి, వచ్చే రోగులకు సరిపడ ఆసుపత్రి నిర్మాణానికి ఉచితంగా స్థలం కేటాయించాలని, ధాతలు కూడా ముందుకు వస్తే ఇంకా మెరుగైన వసతులతో, సౌకర్యాలతో ఉచితంగా డా. పాములపర్తి రామారావు వైద్యసేవలను అనేక వ్యాదులతో బాధపడుతున్న మరింత రోగులకు చేర్చవచ్చని ప్రజలు కోరుతున్నారు.

**పాములపర్తి సందేశం:**

నా ప్రియమైన ప్రజలారా! ప్రస్తుతం మన దేశంలో వైద్యరంగం పూర్తిగా వ్యాపారమైపోయింది. అనవసరపు పరీక్షలు, మందులు, ఆపరేషన్లు చేయడం సర్వసాధారణమైపోయింది. పవిత్రమైన ఈ వైద్య వృత్తిని వ్యాపారమయం చేస్తున్న వైద్యులను ఇతర సిబ్బందిని పట్టించుకునే నాధుడే లేడు!. ఒక అత్యవసర వైద్య సేవలు తప్ప మిగిలిన అన్ని రకాల రోగాలకు ఉచితంగా వైద్యం పొందడానికి, అపాయింట్మెంట్ తీసుకోవడానికి నన్ను సంప్రదించాలని మనవి చేస్తున్నాను.

**–డా. పాములపర్తి రామారావు,**
వరంగల్.






# మనమంతా టీమిండియా

కేంద్ర రాష్ట్రాలు కలసికట్టుగా సాగాలి: మోదీ అప్పుడు ఏ లక్ష్యమూ అసాధ్యం కాదు నీతి ఆయోగ్ భేటీలో సీఎంలకు పిలుపు రాష్ట్రానికో ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రం ప్రగతి వేగం పెంచుదామన్న ప్రధాని కేంద్రం, రాష్ట్రాలను 'టీమిండియా'గా ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు. అవి కలసికట్టుగా పని చేస్తే ఏ అభివృద్ధి లక్ష్యమూ అసాధ్యం కాబోదని ధీమా వెలిబుచ్చారు. ఢిల్లీలో జరిగిన నీతి ఆయోగ్ పాలక మండలి 10వ భేటీకి ఆయన సారథ్యం వహించారు. వికసిత భారత్?2047 థీమ్‌తో భేటీ సాగింది. 31 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులు, ప్రతినిధులు భేటీలో పాల్గన్నట్టు నీతి ఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రమణ్యం వెల్లడించారు. పశ్చిమబెంగాల్, బిహార్, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాలు పాల్గనలేదని తెలిపారు. ఆపరేషన్ సిందూర్ అనంతరం ముఖ్యమంత్రులతో మోదీ సమావేశమవడం ఇదే తొలిసారి. ప్రతి రాష్ట్రంలో కనీసం ఒక ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రం ఏర్పాటయ్యేలా కృషి చేయాలని ఈ సందర్భంగా ప్రధాని సూచించారు. పహల్గాం




ఉగ్ర దాడి లక్ష్యాల్లో జమ్మూకశీ?మర్‌లో పర్యాటకాన్ని దెబ్బ తీయడం కూడా ఉన్న నేపథ్యంలో ఈ సూచన ప్రాధాన్యం సంతరించుకుంది. "ప్రతి గ్రామం, ప్రతి మున్సిపాలిటీ, ప్రతి నగరం, ప్రతి రాష్ట్రమూ ప్రగతి సాధించడమే మన లక్ష్యం కావాలి. అప్పుడు దేశమంతా దానంతటదే వృద్ధి చెందుతుంది. గడువు లోపలే వికసిత భారత్ లక్ష్యాన్ని చేరుకుంటాం. ఆ దిశగా అభివృద్ధి పనుల వేగం మరింత పెంచుదాం. 140 కోట్ల పైచిలుకు భారతీయుల ఆకాంక్షలను నెరవేరుద్దాం" అని రాష్ట్రాలకు ప్రధాని పిలుపునిచ్చారు. భారత్‌లో పట్టణీకరణ శరవేగంగా సాగుతోందని గుర్తు చేశారు. కనుక నగరాలను సుస్థిరాభివృద్ధి, ఇన్నోవేషన్ల కలబోతగా, భవిష్యత్ అవసరాలకు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండేలా తీర్చిదిద్దుకోవాల్సిన అవసరం చాలా ఉందన్నారు. "మహిళా శక్తికి మరింత ప్రాధాన్యమివ్వాలి. అప్పుడే మనమంతా ఆశించిన విధంగా దేశప్రగతి సాధ్యపడుతుంది. శ్రామిక శక్తిలో మహిళలను మరింతగా భాగస్వాములను చేయాలి. అందుకు అనుగుణంగా చట్టాలు, విధానాలను

రూపొందించుకోవాలి'' అని మోదీ చెప్పారు.కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు 50 శాతం: సీఎంలుకేంద్ర పన్నుల్లో రాష్ట్రాల వాటాను 50 శాతానికి పెంచాలని తమిళనాడు, పంజాబ్ ముఖ్యమంత్రులు ఎం.కె.స్టాలిన్, భగవంత్ మాన్ డిమాండ్ చేశారు. "రాష్ట్రాలకు 41 శాతం వాటా ఇస్తామని మాటిచ్చారు. కానీ 33.16 శాతమే ఇస్తున్నారు. తమిళనాడు దేశంలోకెల్లా అత్యంత పట్టణీకరణ చెందిన రాష్ట్రం. అమృత్ 2.0 పథకం కింద రాష్ట్రానికి ప్రత్యేక పట్టణీకరణ మిషన్‌ను మంజూరు చేయాలని ఎప్పటినుంచో కోరుతున్నాం. నమామి గంగ తరహాలో తమిళనాడులోని కావేరీ, వైగే తదితర నదుల ప్రక్షాళనకు ప్రాజెక్టులను కేంద్రం మంజూరు చేయాలి" అని స్టాలిన్ కోరారు. ఆ ప్రాజెక్టులకు పేర్లను ఇంగ్లిష్లోనే పెట్టాలన్నారు. పంజాబ్‌లో పాకిస్తాన్‌ను ఆనుకుని ఉండే ఆరు సరిహద్దు జిల్లాలకు ప్రత్యేక పారిశ్రామిక ప్యాకేజీ అందించాలని కేంద్రానికి మాన్ విజ్ఞప్తి చేశారు. సరిహద్దు ప్రాంతాల రైతులకు ఇస్తున్న ఎకరాకు రూ.10 వేల పరిహారాన్ని రూ.30 వేలకు పెంచాలన్నారు. సిక్కిం, పశ్చిమబెంగాల్‌లోని సిలిగురిలను కలుపుతూ ప్రపంచస్థాయి జాతీయ రహదారి నిర్మించాల్సిన అవసరం చాలా ఉందని సిక్కిం సీఎం ప్రేంసింగ్ తమాంగ్ అన్నారు.విధాన అడ్డంకులు తొలగించాలన్నారు: సీఈఓ భేటీ వివరాలను నీతి ఆయోగ్ సీఈఓ సుబ్రమణ్యం మీడియాకు వెల్లడించారు. "వ్యవసాయం, విద్య, వైద్య రంగాలపై మరింతగా దృష్టి సారించాలని రాష్ట్రాలకు ప్రధాని సూచించారు. పెట్టుబడులను మరింతగా ఆకర్షించాలని, తద్వారా ఇతోధికంగా ఉపాధి అవకాశాలను సృష్టించాలని, అందుకోసం విధానపరమైన అడ్డంకులను తొలగించుకోవాలని హితవు పలికారు" అని చెప్పారు. భేటీలో పాల్గన్న సీఎంలు, నేతలు



ఆపరేషన్ సిందూర్‌ను ముక్తకంఠంతో సమరి?థంచారన్నారు. జైరాంతో కాంగ్రెస్‌కే చేటు: బీజేపీ నీతి ఆయోగ్ ఓ 'అయోగ్య' (అసమర్థ) సంస్థ అన్న కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ విమర్శలపై బీజేపీ మండిపడింది. కాంగ్రెస్‌కే చేటు చేసే వివాదాలను సృష్టించడం ఆయన నైజమని ఎద్దేవా చేసింది. కాంగ్రెస్‌ను జైరాం భూస్థాపితం చేయడం ఖాయమని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి షానవాజ్ హుస్సేన్ జోస్యం చెప్పారు.నవ్వుల్ పువ్వుల్ ఆయోగ్ భేటీలో సరదా సన్నివేశాలు ప్రధాని, ముఖ్యమంత్రుల నడుమ పలు సరదా సన్నివేశాలకు నీతి ఆయోగ్ భేటీ వేదికైంది. సమావేశం ముగిశాక రేవంత్‌రెడ్డి, స్టాలిన్ తదితరులతో మోదీ సరదా సంభాషణలు జరిపారు. నవ్వుతూ, వారిని నవి?వస్తూ కని?పంచారు. భగవంత్ మాన్ (పంజాబ్), హేమంత్ సోరెన్ (జార్ఖండ్), కొన్రాడ్ సంగ్మా (నాగాలాండ్) తదితరులు మోదీతో చాలాసేపటిదాకా కరచాలనం చేస్తూ కన్పించారు. వారితో ప్రధాని సరదాగా మాట్లాడారు. ఈ సందర్భంగా నేతలంతా తేనీరు సేవిస్తూ ఉల్లాసంగా గడిపారు.



# మెట్రో రెండో దశకు అనుమతులివ్వండి



మెట్రో రెండో దశకు అనుమతులివ్వాలని ప్రధాని నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో పదేళ్ల అధికారంలో ఉన్న గత ప్రభుత్వం విస్తరణ చేపట్టలేదని ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. ఢిల్లీలో ప్రధాని మోదీని సీఎం రేవంత్‌రెడ్డి కలిసి పలు అంశాలపై వినతి పత్రాలను అందజేశారు. హైదరాబాద్‌లో మెట్రో మొదటి దశలో భాగంగా రూ.22 వేల కోట్లతో 69 కిలోమీటర్ల మేర నిర్మించారని వివరించారు. రెండోదశ విస్తరణకు ప్రతిపాదనలను ఇప్పటికే సమర్పించామని గుర్తుచేశారు. రెండో దశలో భాగంగా.. రూ.24,269 కోట్లతో 76.4 కిలోమీటర్లలో ఐదు కారిడార్లను నిర్మించనున్నట్లు తెలిపారు. ఇది కేంద్ర, రాష్ట్రాల సమన్వయంతో చేపట్టాల్సిన ప్రాజెక్టని చెప్పారు. కేంద్రం వాటా కింద 18?(రూ.4,230 కోట్లు), రాష్ట్ర వాటాగా 30?(రూ. 7,313 కోట్లు), మిగిలిన 48?(రూ. 11,693 కోట్లు) రుణంగా తీసుకోనున్నట్లు వివరించారు. హైదరాబాద్ మెట్రో రెండో దశకు సంబంధించి గతేడాది నవంబరు 4న కేంద్ర గృహ, పట్టణ శాఖకు ప్రతిపాదనలు సమర్పించామన్నారు. వాటిపై కేంద్రం కొన్ని ప్రశ్నలను లేవనెత్తగా.. సమాధానాలిచ్చామన్నారు.

**రీజినల్ రింగ్ రోడ్డు విషయంలో..**

హైదరాబాద్ చుట్టూ రెండు జాతీయ రహదారులతో రీజినల్ రింగు రోడ్డు(ఆర్‌ఆర్‌ఆర్)ను ప్రతిపాదించామని సీఎం రేవంత్ గుర్తుచేశారు. ఉత్తర భాగం(సంగారెడ్డి- నర్సాపూర్- తూప్రాన్- గజ్వేల్- భువనగిరి-చౌటుప్పల్), దక్షిణ భాగం (చౌటుప్పల్- అమన్‌గల్- షాద్‌నగర్- సంగారెడ్డి) మీదుగా ఆర్‌ఆర్‌ఆర్ నిర్మించనున్నట్లు వివరించారు. ఉత్తర భాగానికి సంబంధించి 2022లో భూసేకరణ ప్రారంభమైందని.. ఇందులో 50? వ్యయాన్ని రాష్ట్రమే భరిస్తుందని చెప్పారు. 90? భూముల ప్రతిపాదనలను జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్ఏఐ)కు పంపగా, టెండర్లను పిలిచిందని, దీనికి సంబంధించి ఆర్థిక, క్యాబినెట్ ఆమోదం తెలపాలని విజ్ఞప్తి చేశారు. ఉత్తర భాగంతోపాటే దక్షిణ భాగాన్ని సైతం ఏకకాలంలో చేపట్టాలని భావిస్తున్నామని తెలిపారు. ఐటీ, ఫార్మా, లాజిస్టిక్స్ వృద్ధితో హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందుతోందని చెప్పారు. ప్రస్తుతమున్న ఓఆర్‌ఆర్ రాబోయే ఐదేళ్లలో సరిపోదన్నారు. ఉత్తర భాగం తర్వాత దక్షిణ భాగం నిర్మాణం చేపడితే భూ సేకరణ, నిర్మాణ వ్యయం భారీగా పెరిగే ప్రమాదముందని, అందుకే రెండు భాగాలను కలిపి ఒకేసారి పూర్తి చేస్తేనే ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. దక్షిణ భాగానికి సంబంధించి భూ సేకరణకు అయ్యే వ్యయంలో 50? భరించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందన్నారు.


**డ్రైపోర్టుకు గ్రీన్‌ఫీల్డ్ హైవే**

రీజినల్ రింగు రోడ్డుకు సమాంతరంగా 370 కిలోమీటర్ల పరిధిలో రైల్వే లైన్‌ను ప్రతిపాదించామని ప్రధానికి సీఎం రేవంత్ వివరించారు. బందరు పోర్టు నుంచి హైదరాబాద్ డ్రైపోర్ట్ వరకు గ్రీన్‌ఫీల్డ్ హైవేను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దేశంలో 35? ఔషధాలను తెలంగాణ ఉత్పత్తి చేస్తోందని గుర్తుచేశారు. "డ్రైపోర్ట్ గ్రీన్‌ఫీల్డ్ హైవేతో సరుకు రవాణా ఖర్చును తగ్గించవచ్చు. తయారీ రంగానికి ప్రోత్సాహకంగా ఉంటుంది. కొత్త ఉద్యోగాలను సృష్టిస్తుంది" అని వివరించారు. సెమీ కండక్టర్ రంగానికి మద్దతు ఇవ్వాలని కోరారు. ఇండియా సెమీకండక్టర్ మిషన్‌కు తెలంగాణ పూర్తి మద్దతు ఇస్తోందన్నారు. హైదరాబాద్‌లో ఏఎండీ, క్వాల్ కామ్, ఎన్వీఐడీఐఏ వంటి ఆర్‌అండ్ డీ కేంద్రాలున్నాయని తెలిపారు. హైదరాబాద్‌లో పరిశ్రమలకు అనుకూలమైన స్థలాలు, మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. తెలంగాణ ఐఎ?సఎమ్ ప్రాజెక్టుకు ఆమోదం తెలపాలని విజ్ఞప్తి చేశారు. తద్వారా పెట్టుబడిదారులకు నమ్మకాన్ని కలిగించి ఉద్యోగాలు సృష్టించవచ్చని.. 2030 నాటికి ఎలకా?ట్రనిక్స్ ఉత్పత్తిలో 500 బిలియన్ డాలర్లకు చేరుకోవాలనే లక్ష్యానికి ఇది తోడ్పడుతుందని అభిప్రాయపడ్డారు.

**రక్షణ రంగ ప్రాజెక్టులపై..**

హైదరాబాద్‌లో ప్రభుత్వ, ప్రభుత్వ-ప్రైవేటు సంయుక్త భాగస్వామ్యం(పీపీపీ)లో ఎంఎ?సఎంఈల్లో ఉన్న రక్షణ రంగ ప్రాజెక్టులకు మద్దతు ఇవ్వాలని ప్రధాని మోదీని సీఎం రేవంత్ కోరారు. హైదరాబాద్‌లో డీఆర్డీవో, డిఫెన్సు పీఎ?సయూలు ఉన్నత స్థాయిలో పని చేస్తున్నాయని గుర్తుచేశారు. హైదరాబాద్-బెంగళూరు డిఫెన్స్ కారిడార్‌ను మంజూరు చేయాలన్నారు. యూపీ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ప్రోత్సాహం ఉందని, తెలంగాణకు లేదని రేవంత్ తెలిపారు. ఆయా రాష్ట్రాలతో సమానంగా తెలంగాణకు కేంద్రం మద్దతు ఇవ్వాలన్నారు. రక్షణ రంగ పరికరాల తయారీలో ముందున్న హైదరాబాద్‌లో డిఫెన్సు ఎక్స్‌పోను నిర్వహించాలని కోరారు.

# ముష్కరులకు దీటుగా బదులిచ్చాం: ప్రధాని మోదీ



'పహల్గామ్‌లో ఉగ్రదాడికి పాల్పడి, భారతీయులను విభజించాలని కోరుకున్న ముష్కరులకు భారత్ తగిన సమాధానం ఇచ్చిందని' ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈ దాడి తర్వాత భారతీయులు మునుపెన్నడూ లేనంతగా ఐక్యతను వ్యక్తం చేశారని అన్నారు. పహల్గామ్‌లో ఉగ్రవాదులు చేసింది కేవలం భారతీయులపై దాడి మాత్రమే కాదు. ఇది మానవత్వంపై జరిగిన దాడి. మన సోదర స్ఫూర్తిపై దాడి. అయితే ఆపరేషన్ సిందూర్ ద్వారా మనం వారికి బలమైన ప్రతిస్పందన చూపామని ప్రధాని మోదీ బాగ్డోగ్రాలో వర్చువల్‌గా జరిగిన ఒక కార్యక్రమంలో పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు సిక్కిం ప్రజాస్వామ్య ప్రయాణంలో స్వర్ణోత్సవం అని అన్నారు. తాను రాష్ట్ర ప్రజల సమక్షంలో ఉంటూ, 50 వసంతాల విజయవంతమైన ప్రయాణాన్ని చూడాలనుకున్నానని, అయితే ఢిల్లీ నుండి బాగ్డోగ్రా చేరుకోగానే, అక్కడి వాతావరణం తనను మరింత ముందుకు వెళ్లకుండా ఆపివేసిందని, ఫలితంగా సిక్కిం ప్రజలను వ్యక్తిగతంగా కలిసే అవకాశం దక్కలేదని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

సిక్కిం 50వ వార్షికోత్సవ వేడుకల కార్యక్రమాన్ని చిరస్మరణీయంగా మలచేందుకు ముఖ్యమంత్రి ఎంతో కృషిచేశారని ప్రధాని అన్నారు. సిక్కిం 50వ వార్షికోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ ప్రధాని అభినందనలు తెలిపారు. 50 ఏళ్ల క్రితం సిక్కిం తనకు తానుగా ప్రజాస్వామ్య భవిష్యత్తును నిర్ణయించుకుందని, నాడు సిక్కిం ప్రజలు భారతదేశంతో కనెక్ట్ కావాలని కోరుకున్నారన్నారు. ఈ రోజు సిక్కింలోని ప్రతి కుటుంబం అభివృద్ధి పథంలో ఉందని ప్రధాని పేర్కొన్నారు. 50 ఏళ్లలో సిక్కిం 100శాతం సేంద్రీయ రాష్ట్రంగా మారిందని, సంస్కృతి, వారసత్వ సంపదకు చిహ్నంగా ఉద్భవించిందని ప్రధాని అన్నారు.

2014లో తాము అధికారంలోకి వచ్చిన తర్వాత 'సబ్ కా సాత్, సబ్ కా వికాస్' అని చెప్పామని, ఈ స్ఫూర్తితో తమ ప్రభుత్వం ఈశాన్య ప్రాంతాన్ని అభివృద్ధికి కేంద్రంగా మార్చిందని మోదీ పేర్కొన్నారు. నేడు సిక్కిం అభివృద్ధికి సంబంధించిన పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరిగాయని, ఇది నవ భారత అభివృద్ధిలో ఒక కొత్త అధ్యాయంగా మారనున్నదని ప్రధాని మోదీ అన్నారు.



# ఎన్నికలప్పుడే రాజకీయం.. తర్వాత అభివృద్ధే లక్ష్యం

'ఎన్నికలు వచ్చినప్పుడే రాజకీయాలు.. ఎన్నికలయ్యాక అభివృద్ధి చేయడమే లక్ష్యం.. కేంద్రం సహకారాన్ని తీసుకుంటాం.. ఎవరు ఏమనుకున్నా సరే.. మోదీని ఒక్కసారి కాదు 50 సార్లు అయినా కలుస్తాం..రాష్ట్రానికి రావాల్సిన నిధులు తెచ్చుకుంటాం..కావాల్సిన అనుమతులు తీసుకుంటాం.. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించుకున్నప్పుడే, కలిసి మెలసి పనిచేసినప్పుడే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుంది.

చెరువు మీద అలిగి కడుక్కోకుంటే ఎలా?..దిగిపోయిన ఆయన (కేసీఆర్) చెరువు మీద అలిగి ఫామ్ హౌస్‌లో పడుకుంటే ఏమైంది?.. ప్రజలు ఇంటికి పంపే పరిస్థితి వచ్చింది.. నేను అలాంటి తప్పులు చేయను.. ఎవరు ఏమనుకున్నా పర్వాలేదు..' అని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలో రూ.494 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులన ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జహీరా బాద్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు.

ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా మారుస్తాం

'రాష్ట్ర ప్రజలు మాపై విశ్వాసంతో ఓట్లేసి గెలిపించారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు అమలు చేస్తూ పారదర్శక పాలన అందించడం ద్వారా వారి విశ్వాసాన్ని కాపాడుకుంటాం. ఐటీ, ఫార్మా, ఇతర పరిశ్రమలు రావడం ద్వారా ఆదాయం పెరుగుతుంది. ఈ ఆదాయాన్ని పేదలకు పంచాలనే లక్ష్యంతో మేం పని చేస్తున్నాం. ప్రజలు మాకు అండగా నిలిస్తే తెలంగాణను దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చి దిద్దుతాం. ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా మారుస్తాం. హైదరాబాద్ నగరాన్ని న్యూయార్క్, టోక్యో వంటి నగరాలతో పోటీ పడే విధంగా అభివృద్ధి చేస్తాం. ఫ్యూచర్ సిటీ, ఆర్ఆర్ఆర్, మెట్రో, ఫార్మాసిటీ అన్నిటినీ అభివృద్ధి చేసి ప్రజలకు అంకితం ఇచ్చే వరకు నిద్రపోను..' అని రేవంత్ అన్నారు.

**అదానీ, అంబానీలతో పోటీ పడేలా ఆడబిడ్డలకు అవకాశాలు**

'రాష్ట్రంలో మహిళలకు ఉచితబస్సు పథకం కోసం ఇప్పటికే రూ.5,500 కోట్లు ఖర్చు చేశాం. మహిళా సంఘాల ద్వారా 600 బస్సులు కొనుగోలు చేసి ఆర్టీసీకి అద్దెకు ఇచ్చాం. వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తికి విద్యుత్ శాఖతో ఒప్పందాల ద్వారా తెలంగాణ మహిళలు అదానీ, అంబానీలతో పోటీ పడే స్థాయిలో అవకాశాలు కల్పిస్తున్నాం. అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో ప్రభుత్వ పాఠశాలల నిర్వహణను మహిళలకే అప్పగించాం. మహిళా సంఘాలకు పెట్రోల్ బంకులు ఇచ్చాం.

ఇందిరమ్మను ఆదర్శంగా తీసుకుని.. సోనియాగాంధీ నాయకత్వంలో ఆడబిడ్డలను ఆర్థికంగా నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నాం. రాబోయే రోజుల్లో రూ.21 వేల కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు ఇచ్చి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం..' అని సీఎం చెప్పారు.




**యువత నమ్మకాన్ని నిలబెట్టుకుంటున్నాం..**

'తెలంగాణ ఉద్యమంలో ముందున్న లక్షలాది మంది యువతకు గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగాలు రాలేదు. కేసీఆర్ పదేళ్ల పాలనలో ఆయన కుటుంబంలో నలుగురికి మాత్రం ఉద్యోగాలు వచ్చాయి. నేను సీఎంగా బాధ్యతలు తీసుకున్నాక 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశాం. ప్రైవేటు రంగంలో లక్ష ఉద్యోగాలు ఇచ్చి యువతలో మాపై ఉన్న విశ్వాసాన్ని, నమ్మకాన్ని నిలబెట్టుకునే ప్రయత్నం చేస్తున్నాం. ఈ 15 నెలల్లోనే రూ.3 లక్షల కోట్ల విదేశీ పెట్టుబడులు రాష్ట్రానికి తెచ్చి పారిశ్రామికంగా అభివృద్ధి చేసే ప్రయత్నం చేస్తున్నాం.

వీటన్నింటికీ ప్రజల ఆశీర్వాదం ఉండాలి. ప్రజలు ఆశ్వీర్వదిస్తేనే రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడం సాధ్యమవుతుంది. ప్రజల ఆశీర్వాదంతోనే రాష్ట్రంలో 25.55 లక్షల మంది రైతు కుటుంబాలకు రూ.20,617 కోట్ల రుణమాఫీ చేశాం. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. రైతుబరోసా ఆర్థిక సాయాన్ని రూ.12 వేలకు పెంచాం. భూమిలేని నిరుపేదలకు రూ.12 వేల ఆర్థిక సాయం అందిస్తున్నాం. సన్న ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తున్నాం..' అని ముఖ్యమంత్రి తెలిపారు.

**ప్రతిపక్ష నేత అసెంబ్లీకి రావాలి**

'రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషికి ప్రతిపక్షాల సహకారం కూడా కావాలి. ప్రతిపక్ష నాయకుడికి విజ్ఞప్తి చేస్తున్నా.. రండి.. అసెంబ్లీకి వచ్చి మాట్లాడండి..40 ఏళ్ల రాజకీయ అనుభవంతో సూచనలు ఇవ్వండి.. ఎక్కడైనా తప్పులు చేస్తే సరిదిద్దుకుంటాం.. అలా కాకుండా అధికారంలో ఉంటేనే అసెంబ్లీకి వస్తా.. లేకపోతే ఫాంహౌస్‌లో పడుకుంటానంటే ప్రజలే విచక్షణతో నిర్ణయం తీసుకుంటారు.

**నేను 20 ఏళ్లు ప్రజల గొంతుకై నిలిచా**

నేను ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా, జెడ్పీటీసీగా, ఎంపీగా.. ఇలా 20 ఏళ్లు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఏ ఒక్కరోజూ సెలవు తీసుకోలేదు. ప్రజల సమస్యలకు గొంతుకనై పనిచేశా. నేను 20 ఏళ్లుగా ప్రజల పక్షాన పనిచేశాను కాబట్టే ప్రజలు నాకు సీఎంగా అవకాశం కల్పించారు. నా వద్దకు చిన్నోడు వచి?చనా.. పెద్దోడు వచి?చనా.. ఉన్నోడు వచి?చనా.. పేదోడు వచ్చినా.. అందరినీ కలిసి.. చేతనైన సాయం చేస్తున్నా..' అని రేవంత్ చెప్పారు. సభలో మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, ఎంపీ సురేష్ షెట్కార్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.





# తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఏమాత్రం తగ్గనివ్వం...

దేశంలో అద్భుత రాష్ట్రంగా నిలబెడతాం పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని త్వరితగతిన పూర్తి చేసి నీళ్లు ఇవ్వాలనేది ప్రజా ప్రభుత్వం ఆలోచన అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. రంగారెడ్డి జిల్లా కల్వకుర్తి నియోజకవర్గం తలకోనపల్లి మండలం ఖానాపురం గ్రామంలో పలు విద్యుత్తు సబ్ స్టేషన్ లకు శంకుస్థాపన అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగించారు. పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కింద పెండింగ్లో ఉన్న రిజర్వాయర్ల కు భూ సేకరణకు సంబంధించిన నిధులను వెంటనే విడుదల చేస్తామని తెలిపారు. ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాకు ఏనాడైనా నీళ్లు తీసుకువచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వాలే అని గుర్తు చేశారు. జూరాల, కోయిల్ సాగర్, నెట్టెంపాడు, శ్రీశైలం ఎత్తిపోతల నేడు పాలమూరు రంగారెడ్డి అన్ని కాంగ్రెస్ హయాంలో ప్రారంభించి పూర్తి చేసినవే అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలకు 70 వేల కోట్లు ఖర్చు చేస్తుంది, కేవలం రైతుల సంక్షేమం కోసం 45 వేల కోట్లు వెచ్చిస్తుందని డిప్యూటీ సీఎం తెలిపారు.

కెసిఆర్ హయాంలో ఇల్లు లేక, కరెంటు, సబ్ స్టేషన్లు , తిండి లేక పేద, మధ్యతరగతి వర్గాలు ఇబ్బందులను ఎదుర్కొన్నాయని వివరించారు. పరాదు కేసీఆర్ హయాంలో మాట్లాడే హక్కు కూడా లేదు, ఇబ్బందులను స్వేచ్ఛగా ఒకరికి చెప్పుకునే పరిస్థితి లేదు అడిగిన మాట్లాడిన అరెస్టులు, సభ పెట్టి చెబుదామంటే హౌస్ అరెస్టులు చేశారని ఆనాటి సంఘటనలను డిప్యూటీ సీఎం వివరించారు. ఆ దయ్యాలన్నిటిని వదిలించుకొని ప్రజలు ప్రజా ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారని గత ప్రభుత్వం లక్షల కోట్లు అప్పు చేసిన మేం ప్రణాళిక బద్ధంగా ముందుకు పోతున్నామని డిప్యూటీ సీఎం తెలిపారు. మాది పాలకుల కోసం దోపిడీ చేసే ప్రభుత్వం కాదని రూపాయి రూపాయి కూడా పెట్టి సంపద సృష్టిస్తాం ప్రజలకు పంచుతాం అన్నారు. కెసిఆర్ ఇక మీ ఆటలు సాగవు రాష్ట్ర ప్రజలకు అంత అర్థమయింది ధనిక రాష్ట్రాన్ని చేతిలో పెడితే అప్పుల పాలు చేసి నేడు ప్రతినెల మీరు చేసిన అప్పులకు 6500 కోట్లు చెల్లించాల్సిన దుస్థితి నెలకొందని డిప్యూటీ సీఎం తెలిపారు. అప్పుల భారం లేకపోతే ప్రజా ప్రభుత్వం మరెన్నో బ్రహ్మాండాలు చేసేది అన్నారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఏమాత్రం తగ్గనివ్వం, దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని అద్భుత రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం అని డిప్యూటీ సీఎం ధీమా వ్యక్తం చేశారు. కాళ్లల్లో కట్టెలు పెడితే ఆగిపోయే ప్రభుత్వం మాది కాదు



అన్నారు. కెసిఆర్ ఆయన కుటుంబం అదిరింపులు బెదిరింపులకు ఎవరు భయపడరని తెలిపారు. లక్ష కోట్లు ఖర్చుపెట్టి కాళేశ్వరం నుంచి, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల నుంచి పది సంవత్సరాల్లో ఒక్క నది నుంచి చుక్కనీరు రైతుల పొలాలకు తీసుకురాలేదని అన్నారు. రాష్ట్ర రైతాంగం పై కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రత్యేక ప్రేమ ఉందని డిప్యూటీ సీఎం తెలిపారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను కొనసాగిస్తూనే కొత్తగా సన్నధాన్యానికి క్వింటాకు మద్దతు ధర 500 చొప్పున చెల్లిస్తున్నాం పది సంవత్సరాల్లో కెసిఆర్ ప్రభుత్వం రైతులకు బోనస్ ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. సన్నధాన్యం బోనస్ కింద రాష్ట్ర ప్రభుత్వం 1800 కోట్లు ఖర్చు చేస్తుందని తెలిపారు. రైతుల ఇన్సూరెన్స్ కోసం 1,589 కోట్లు ఖర్చు చేస్తున్నాం 10 సంవత్సరాల్లో కెసిఆర్ ఈ పని ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో 29 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు 24 గంటల పాటు ఉచితంగా కరెంటు సరఫరా చేస్తున్నాం ఇందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం రైతుల పక్షాన ప్రతి సంవత్సరం 11,496 కోట్లు విద్యుత్ సంస్థలకు చెల్లిస్తుందని వివరించారు. భూమిలేని నిరుపేదల కోసం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పేరిట ప్రతి సంవత్సరం 12,000 వారి ఖాతాలో జమ చేస్తున్నాం ఇందుకు గాను ప్రభుత్వం 600 కోట్లు ఖర్చు చేస్తుందని తెలిపారు. రైతు భరోసా కింద 2000 అదనంగా పెంచి ప్రతి సంవత్సరం 17,530 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం ఖర్చు చేస్తుందని తెలిపారు. గత పాలకులు 10 సంవత్సరాల్లో లక్ష రూపాయల రుణమాఫీని ఒకేసారి చేయలేక 25 వేలు నాలుగు దఫాలుగా చెల్లిస్తే అది వడ్డీలకే సరిపోయిందని ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల కాలంలోనే 22 వేల కోట్లు రైతు రుణమాఫీ కింద రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసిందని వివరించారు. మరి పది సంవత్సరాల్లో కెసిఆర్ ఎందుకు రైతులకు ఒకేసారి రుణమాఫీ చేయలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేస్తుందో లబ్ధిదారులందరికీ తెలుసునని డిప్యూటీ సీఎం అన్నారు. ఫామ్ హౌస్ లో పడుకొని నష్టం జరిగిందని అంటున్నారు నష్టం నీకు జరిగింది కేసీఆర్, కవిత చెప్పిన దెయ్యాలకు జరిగిందని డిప్యూటీ సీఎం అన్నారు. 11,496 కోట్లు చేయిత పథకం కింద ప్రతినెల పెన్షన్ల కోసం ఖర్చు చేస్తున్నాం, ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఉచిత ప్రయాణం కోసం మహాలక్ష్మి పథకం కింద 3600 కోట్లు ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లించిందని తెలిపారు. మూసేస్తారు అనుకున్న ఆర్టీసీ ఈ పథకం మూలంగా లాభం లోకి వచ్చి అత్యంత ఆరోగ్యంగా ముందుకు వెళుతుందని తెలిపారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు పథకం మూలంగా ప్రస్తుతం గ్రామాల్లో 85 నుంచి 90 శాతం మంది కరెంటు బిల్లు చెల్లించే అవసరం లేకుండా పోయిందన్నారు వారి పక్షాన ప్రభుత్వమే 2,400 కోట్లు విద్యుత్ సంస్థలకు చెల్లిస్తుందని వివరించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని ఐదు లక్షల నుంచి 10 లక్షల పెంచాం ఫలితంగా 90 లక్షల కుటుంబాలకు రద్దు చేకూరింది ఈ పథకానికి 1000 కోట్లు ఖర్చు పెడుతున్నామని డిప్యూటీ సీఎం వివరించారు.

ఇల్లు లేని ప్రతి నిరుపేదకు ఇల్లు నిర్మించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. ప్రతి సంవత్సరం ఐదు లక్షల ఇళ్ల నిర్మాణానికి ఒక్కో సంవత్సరం 22,500 కోట్లు ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ఖర్చు చేస్తున్నామని డిప్యూటీ సీఎం తెలిపారు. రాష్ట్రంలో 90 లక్షల కుటుంబాలకు ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నాము, దేశంలో ఒకే ఒక రాష్ట్రం అది తెలంగాణ ఈ పథకాన్ని అమలు చేస్తుందని అన్నారు. 500లకే గ్యాస్ సిలిండర్ పథకానికి 720 కోట్లు వెచ్చిస్తున్నామని వివరించారు. మరో 44 యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలలకు త్వరలో జీవో జారీ చేస్తున్నామని తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ ను 25 ఎకరాల్లో 200 కోట్ల ఖర్చుతో నిర్మిస్తున్నట్లు డిప్యూటీ సీఎం వివరించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మన పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని 40 శాతం డైట్ చార్జీలు 25% కాస్మోటిక్ చార్జీలు పెంచాం అన్నారు.




# 'ఇంటి'కి రూ.5 లక్షల ఘనత మాదే

దేశంలో ఎక్కడా లేనివిధంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ. 5 లక్షలు ఇస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదేనని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ఖమ్మం కలెక్టరేట్‌లో ప్రభుత్వ పథకాలపై డిప్యూటీ సీఎం, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు సమీక్షించారు.

ఉమ్మడి జిల్లాస్థాయి సమీక్షలో ధాన్యం కొనుగోళ్లు, ఇందిరమ్మ ఇళ్లు, భూభారతి, వర్షాకాల ఆరోగ్య కార్యాచరణ, వ్యవసాయ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకానికి రూ. 22,500కోట్లు మంజూరు చేశామని.. ఏకకాలంలో 3,500 ఇళ్లు మంజూరు చేశామన్నారు. లబ్ధిదారుల ఎంపికలో అనర్హులు ఉన్నట్లు తేలితే బాధ్యులైన గెజిటెడ్ అధికారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వానాకాలం సీజన్ వచ్చినందున నకిలీ విత్తనాలు మార్కెట్‌లోకి రాకుండా చర్యలు చేపట్టడంతోపాటు ఎప్పటికప్పుడు రైతులకు అవగాహన కల్పించాలని భట్టి సూచించారు. సాదాబైనామా దరఖాస్తుల్లో కొన్ని ప్రభుత్వ భూములకు సంబంధించి ఉన్న వాటిని తక్షణమే తిరస్కరించాలన్నారు. కోర్టు స్టే తొలగిన వెంటనే అర్హత ఉన్న సాదా బైనామా దరఖాస్తులను పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. వచ్చే నెల 3 నుంచి 20 వరకు అన్ని రెవెన్యూ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని అధికారులకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు టోకెన్ ద్వారా ఉచితంగా ఇసుక సరఫరా చేయాలని చెప్పారు. ఈ సమీక్షలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్లు ముజమ్మిల్‌ఖాన్, జితేష్ వి.పాటిల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**లబ్ధిదారుల ఎంపికలో ఎమ్మెల్యేలకు ప్రాధాన్యత తగ్గించాలి: కూనంనేని**

ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో ఎమ్మెల్యేలకు ప్రాధాన్యత తగ్గించాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సూచించారు. తద్వారా అర్హులెవరికీ అన్యాయం జరగదన్నారు. అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తూనే ఇందిరమ్మ కమిటీలు, అధికారుల పనితీరు పారదర్శకంగా ఉండేలా చూడాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు. దివంగత వై.ఎస్. రాజశేఖరరెడ్డి హయాం తర్వాత ఇప్పుడే ఇళ్లు మంజూరు చేస్తున్నందున అర్హులు నష్టపోకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఇసుక కొరత లేకుండా పర్యవేక్షించాలన్నారు.

# ఇసుక దోపిడీ సహించం: సీఎం రేవంత్




'ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల అమలులో జిల్లా కలెక్టర్లు కీలక పాత్ర పోషించాలి. మరింత ప్రో యాక్టివ్‌గా (చురుగ్గా) ఉండాలి. ఇందిరమ్మ ఇళ్ల పేరిట ఇసుక దోపిడీ జరగకుండా చూడాలి. లబ్ధిదారులకు టోకెన్ జారీ చేసి ఉచితంగా సరఫరా చేయాలి. ఇళ్ల నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. చేసిన మంచి పనిని చెప్పుకోకపోవడం వల్లే చిన్న సంఘటనలు కూడా విస్తృత ప్రచారంలోకి వస్తున్నాయి. అనారోగ్యంతో రైతు చనిపోతే ధాన్యం కొనుగోలులో జాప్యం వల్లనే అని దుష్ప్రచారం జరుగుతోంది. కలెక్టర్లు ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలు వివరాలను వెల్లడించాలి. వైఫల్యాలు ఉంటే సరిదిద్దుకోవాలి.

కొన్ని రాజకీయ ప్రేరేపిత సంఘటనలూ జరుగుతున్నాయి. తప్పుడు ప్రచారం చేస్తే వివరణ ఇవ్వండి. చిన్న చిన్న సమస్యలు ఉంటే తక్షణమే పరిష్కరించండి..' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. సీఎంవో నుంచి ధాన్యం కొనుగోళ్లు, ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతి, వ్యవసాయ శాఖ తదితర అంశాలపై.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎస్ కె.రామకృష్ణారావులతో కలిసి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయా అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు.

**పరిహారం ప్రతిపాదనలు పంపండి**

'పౌరసరఫరాల శాఖ గతసారి కంటే దాదాపు 22 లక్షల మెట్రిక్ టన్నులు (ఎల్ఎంటీ) అధికంగా ధాన్యాన్ని, అదీ తక్కువ సమయంలోనే కొనుగోలు చేయడం అభినందనీయం. 10.50 లక్షల మంది రైతుల దగ్గర్నుంచి 64 ఎల్ఎంటీలకు పైగా ధాన్యం కొనుగోలు చేశాం. గతంలో ఎన్నడూ లేని విధంగా కొనుగోలు చేయడమే కాకుండా రైతులకు 48 గంటల్లో చెల్లింపులు పూర్తి చేశాం.

ఇప్పటివరకు రూ.12,184 కోట్లు చెల్లించాం. 90 శాతానికి పైగా రైతులు ధాన్యాన్ని విక్రయించి సంతోషంగా ఉన్నప్పటికీ, రాష్ట్రానికి రుతుపవనాలు ముందే రావడంతో కల్లాల వద్ద ధాన్యం తడిసిపోయి కొంతమంది రైతులు ఇబ్బందుల్లో ఉన్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు ఎకరానికి 10 వేల పరిహారం అందించేందుకు ప్రతిపాదనలు పంపాలి.

**రైస్ మిల్లులను నిరంతరం పర్యవేక్షించాలి**

ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం మెరుగ్గా పనిచేస్తున్నప్పటికీ అసత్య ప్రచారాలు బలంగా జరుగుతున్నాయి. వీటిని తిప్పికొట్టాలి. జిల్లాల్లో వచ్చే ప్రభుత్వ వ్యతిరేక వార్తలకు సంబంధించిన వాస్తవాలను ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్లపై ఉంది. గత 3 సంవత్సరాల ధాన్యం కొనుగోలు వివరాలను కలెక్టర్లు వెల్లడించాలి. రైస్ మిల్లులను నిరంతరం పర్యవేక్షించాలి. రైతులకు అన్యాయం చేయాలని మిల్లర్లు చూస్తే వెంటనే చర్యలు తీసుకోవాలి..' అని ముఖ్యమంత్రి ఆదేశించారు.

**జూన్ 1 నాటికి నివేదిక ఇవ్వాలి**

'వర్షాలు ముందే వచ్చినందున వ్యవసాయ శాఖ ప్రణాళికలలో మార్పులు చేసుకోవాలి. రైతులకు అవసరమైన విత్తనాలు, యూరియా అందుబాటులో ఉంచాలి. విత్తనాల, ఎరువుల అక్రమ నిల్వలు ఉంటే కఠిన చర్యలు తీసుకోవాలి. నకిలీ విత్తనాలు అమ్మే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలి. జిల్లా కలెక్టర్లు, ఇన్‌చార్జి మంత్రులు ఈ నెల 29, 30 తేదీలలో క్షేత్రస్థాయిలో వానాకాలం సాగు ఏర్పాట్లు పర్యవేక్షించాలి. నకిలీ విత్తనాలు, ధాన్యం కొనుగోలు, ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతిపై నివేదిక తయారు చేసి జూన్ 1 నాటికి సమర్పించాలి. జూన్ 2న రాష్ట్ర అవతరణ వేడుకలు జిల్లాల్లో ఘనంగా నిర్వహించాలి..' అని రేవంత్ ఆదేశించారు

**పేదలకు చుట్టంలా భూ భారతి చట్టం**

'గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి వ్యవస్థ

ప్రజలను భూతంలా పీడిస్తే, భూ భారతి చట్టం పేదలకు చుట్టంలా పని చేస్తుంది. భూ భారతి చట్టం కోసం తొలుత 4 మండలాలనే పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసుకున్నాం. తర్వాత ప్రతి జిల్లాలో ఒక మండలాన్ని పైలట్‌గా ఎంపిక చేసుకుని రెవెన్యూ సదస్సులు నిర్వహించాం. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన భూ సమస్యల దరఖాస్తులను పరిష్కరించాలి.

పైలట్ మండలాల్లో వచ్చిన అనుభవాలను దృష్టిలో ఉంచుకొని మిగిలిన ప్రాంతాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలి. జూన్ 3 నుంచి జూన్ 20 వరకు భూ భారతి సదస్సులు అన్ని మండలాల్లో నిర్వహించాలి. ఈ సదస్సుల్లో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించడంతో పాటు భూ భారతి చట్టంపై అవగాహన కల్పించాలి..' అని ముఖ్యమంత్రి సూచించారు.

ధరల నియంత్రణ కమిటీలు నియమించండి

'ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుతో ప్రభుత్వ పనితీరు ఏంటో తెలుస్తుంది. కలెక్టర్లు ఈ కీలకమైన పథకం అమలు పర్యవేక్షించాలి. మండల స్థాయిలో ధరల నియంత్రణ కమిటీలను నియమించాలి. మేస్త్రీ చార్జీలు, నిర్మాణ పరికరాల ధరలపై నియంత్రణ ఉండాలి. అడ్డగోలు ధరలతో పేదలను మోసం చేయకుండా జాగ్రత్త వహించాలి. మహిళా సంఘాలు, రాజీవ్ యువ వికాసం ద్వారా ఇటుక, సెంట్రింగ్ యూనిట్ల తయారీ కేంద్రాలు ఏర్పాటు చేయాలి. తక్కువ ధరతో నాణ్యమైన ఇళ్లు నిర్మించేందుకు సాంకేతికంగా అనేక కొత్త పద్ధతులు వచ్చాయి. వీటిని లబ్ధిదారులకు తెలియజేయాలి. మండల కేంద్రాల్లో నిర్మించిన మోడల్ ఇందిరమ్మ ఇళ్లు లబ్ధిదారులు పరిశీలించేలా కార్యక్రమాలు రూపొందించాలి..' అని రేవంత్ చెప్పారు.

**సీజనల్ వ్యాధులతో జాగ్రత్త**

'ఈసారి 15 రోజుల ముందే రుతుపవనాలు వచ్చాయి. ముందుగా వచ్చే వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు, జ్వరాలు ప్రబలే ప్రమాదముంది. వైద్యారోగ్య శాఖ అప్రమత్తంగా ఉండాలి. ప్రధానంగా ఏజెన్సీ ఏరియాలు, అటవీ ప్రాంతాలున్న జిల్లాల కలెక్టర్లు ప్రజారోగ్యంపై దృష్టి సారించాలి. పొరుగు రాష్ట్రాల్లో కోవిడ్ కేసులు కూడా నమోదవుతున్నాయి.

అన్ని జిల్లాల్లోనూ సీజన్‌కు అనుగుణంగా తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి..' అని సీఎం ఆదేశించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ప్రస్తుతం కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని చెప్పారు. ముందస్తు సాగు జరిగేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు.

# భారతీయ సంస్కృతి ప్రపంచానికి ఆదర్శం



భారతదేశ సంస్కృతి, సాంప్రదాయాలు ప్రపంచానికి ఆదర్శమని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. దేశ సంస్కృతిలో సమాఖ్య విధానం, ధర్మం ఉందన్నారు. యువతలో భారతీయ శాస్త్రీయ సంగీతం, సంస్కృతి పట్ల మక్కువ పెంచేందుకు ఏర్పాటు చేసిన సంస్థ ఎస్‌పీఐసీఎంఏసీవై (సొసైటీ ఫర్ ది ప్రమోషన్ ఆఫ్ ఇండియన్ క్లాసికల్ మ్యూజిక్ అండ్ కల్చరల్ అమాంగెస్ట్ యూత్) ఆధ్వర్యంలో హైదరాబాద్ ఐఐటీ హెచ్‌లో 10వ అంతర్జాతీయ సాంస్కృతిక, సంగీత సదస్సు సోమవారం ప్రారంభమైంది.

జూన్ 1 వరకు జరగనున్న ఈ సదస్సులో దేశ విదేశాలకు చెందిన సుమారు 1,500 మంది కళాకారులు, సంగీత విద్వాంసులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొననున్నారు. ఈ సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ మాట్లాడుతూ.. త్రిపుర రాష్ట్ర నృత్యరూపం హోజగిరిని సంరక్షిస్తుండటం, ఈ సదస్సుల్లో ఈ కళారూపాన్ని ప్రదర్శించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు కళల పట్ల అవగాహన పెంచుకోవాలని గవర్నర్ సూచించారు. భారతీయ కళలను, సంస్కృతి, సాంప్రదాయాల పట్ల యువతలో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్న ఎస్‌పీఐసీ ఎంఏసీవై సంస్థను గవర్నర్ అభినందించారు. తొలిరోజు పద్మభూషణ్ అవార్డు గ్రహీతలు రాజా, రాధారెడ్డిల కూచిపూడి కచేరీ అలరించింది. పద్మభూషణ్ డాక్టర్ ఎన్.రాజం హిందూస్తానీ వయోలిన్ కచేరీ, గాయని అంగ్‌శైలి రాగాలు సంగీత ప్రియులను అలరించాయి. కార్యక్రమంలో ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి, స్పిక్‌మకే నేషన

# భూ భారతి చట్టంతో రైతులకు న్యాయం



సిద్దిపేట జిల్లా: భూ లావాదేవీలు పారదర్శకంగా ఉండేలా భూ భారతి చట్టం తెచ్చామని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. 30 సంవత్సరాల క్రితం అమ్మిన భూమి ధరణిలో మళ్లీ పాత యజమాని పేరుతో వచ్చిందని..దీంతో పంచాయతీలు, గొడవలు మొదలయ్యాయని అన్నారు. భూమి రక్షణం కోసం భూ భారతి చట్టం తెచ్చామని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములు కబ్జాకు గురై అన్యాక్రాంతం అయ్యాయని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఇవాళ సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండల కేంద్రంలో భూ భారతిపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కలెక్టర్ మనుచౌదరి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు.

గ్రామాల్లో భూముల పేరు మీద పంచాయతీలు ఉండద్దని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సొంత కుటుంబాల్లోనే భూ పంచాయతీలు అవుతున్నాయని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ భూములను కాపాడుకోవాలని.. వాటిని అభివృద్ధికి వాడుకోవాలని సూచించారు. భూ భారతిలో గౌరవెల్లి , దేవాదుల ఏ ప్రాంతం కిందకు వస్తుందో స్పష్టంగా వివరాలు ఉంటాయని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.


త్వరలోనే గౌరవెల్లి కాల్వల నిర్మాణం పూర్తవుతుందని.. ప్రాజెక్ట్ ద్వారా నీళ్లు అందిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కొంత మంది రైతులకు నష్టం జరిగిన వారిని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ధరణి ద్వారా చాలామంది రైతులకు నష్టం జరిగిందని అన్నారు. అలాంటి తప్పు జరగవద్దనే భూ భారతి వచ్చిందని.. దీనిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. భూ శిస్తు ఉంటే తమ భూమి అనేది తెలుస్తుందని.. కొంతమంది రైతులు తమ దృష్టికి తీసుకువచ్చారని అన్నారు. భూమిపై అవగాహన ఉన్నవారి సలహాలు, సూచనలు కూడా స్వీకరిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా మల్లు రవి



కాంగ్రెస్ అధిష్టానం పలు పీసీసీ కమిటీలను నియమించింది. మొత్తం 70 మంది సభ్యులతో కూడిన కమిటీలను ఏఐసీసీ ప్రకటించింది. ఈ మేరకు ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర మంత్రులకు ప్రత్యేక ఆహ్వానితులుగా అవకాశం కల్పించారు. అత్యధికంగా 22 మందితో రాజకీయ వ్యవహారాల కమిటీని ఏర్పాటు చేశారు. అలాగే 15 మందితో సలహా కమిటీ, ఏడుగురితో డీలిమిటేషన్ కమిటీ, 16 మందితో సంవిధాన్ బచావో ప్రోగ్రాం కమిటీ, ఆరుగురితో క్రమశిక్షణ చర్యల కమిటీని నియమించారు. ఎక్స్ అఫీషియో సభ్యులుగా తెలంగాణకు చెందిన ఏఐసీసీ కార్యదర్శులు, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు, అన్ని ఫ్రంటల్ ఆర్గనైజేషన్ల బాధ్యులకు అవకాశం కల్పించారు. క్రమశిక్షణ చర్యల కమిటీని నాగర్‌కర్నూలు ఎంపీ మల్లు రవి చైర్మన్‌గా, ఎ. శ్యామ్ మోహన్ వైస్ చైర్మన్‌గా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలు వెంటనే అమల్లోకి వస్తాయని వేణుగోపాల్ పేర్కొన్నారు. కొత్తగా వర్కింగ్ ప్రెసిడెంట్లను నియమించకుండానే పార్టీ అధిష్టానం వారికి బాధ్యతలు మాత్రం అప్పగించడం గమనార్హం.

# పదేళ్లు రాష్ట్రాన్ని లూటీ చేశారు: భట్టి విక్రమార్క




గత పదేళ్ల అధికారంలో ఉన్నవారు రాష్ట్రాన్ని లూటీ చేశారని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. వాళ్లే ఇప్పుడు ఫామ్‌హౌస్‌లో నిద్రపోతూ అన్యాయం జరుగుతోందని విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ఖమ్మం జిల్లా వైరాలో ఏర్పాటుచేసిన మెగా జాబ్ మేళాను ఆయన ప్రారంభించి మాట్లాడారు. పదేళ్లలో గ్రూప్?1 పోస్టులు భర్తీచేయకపోవటంతో నిరుద్యోగ యువత వారి తల్లిదండ్రులకు భారంగా మిగిలారని, మరికొందరు ఆవేదనతో రోడ్లపై తిరిగారని తెలిపారు.

తాము అధికారంలోకి రాగానే టీజీపీఎస్సీని ప్రక్షాళన చేసి 56 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చామని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగాలు రాని యువతకు స్వయం ఉపాధి కోసం రూ.9 వేల కోట్లతో రాజీవ్ యువ వికాసం ద్వారా తోడ్పాటు ఇవ్వనున్నామని వెల్లడించారు. ఆర్ఓఎఫ్ఆర్ చట్టం ద్వారా గిరిజనులకు పంపిణీ చేసిన 6.70 లక్షల ఎకరాల భూమిని సాగులోకి తీసుకొచ్చేలా రూ.12,600 కోట్లతో ఇందిరా సౌరగిరి జల వికాసం పథకాన్ని ప్రారంభించినట్లు వివరించారు.

బీఆర్ఎస్ పాలనలో గిరిజనులు అటవీ భూముల్లో పంటలు సాగుచేయకుండా ఇబ్బంది పెట్టారని, మహిళలను కూడా చెట్టుకు కట్టేసి కొట్టిన ఘటనలు ఉన్నాయని విమర్శించారు. కాగా, జాబ్‌మేళాలో 92 కంపెనీలు పాల్గొనగా, సుమారు 8 వేల మంది నిరుద్యోగులు హాజరయ్యారు. ఇందులో 4,448 మందికి వివిధ ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్, సింగరేణి సీఎండీ బలరామ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# మంద కృష్ణకు పద్మశ్రీ ప్రదానం







పద్మ పురస్కారాలు-2025 ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము.. ఆయా రంగాల్లో విశేష సేవలు అందించిన వారికి అవార్డులు ప్రదానం చేశారు. వ్యక్తిగత విభాగంలో తెలుగు రాష్ట్రాల నుంచి మొత్తం ముగ్గురు పద్మశ్రీలు అందుకున్నారు. తెలంగాణ నుంచి ప్రజా వ్యవహారాల రంగంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పీఎస్) వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ, ఏపీ నుంచి సాహిత్యం, విద్యా రంగంలో ప్రొఫెసర్ కేఎల్ కృష్ణ, వాచస్పతి డాక్టర్ వదిరాజ్ రాఘవేంద్రాచార్య పంచముఖి తదితరులు పద్మశ్రీ పురస్కారాలు అందుకున్నారు. మంద కృష్ణ అవార్డు అందుకుంటున్న సమయంలో ఆయన కుమార్తె కృష్ణవేణి ఉద్వేగానికి లోనయ్యారు. కార్యక్రమానికి ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రమంత్రులు అమిత్ షా, జైశంకర్, జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ధర్మేంద్ర ప్రధాన్, ప్రల్హాద్ జోషి, భూపేంద్ర యాదవ్ తదితరులు హాజరయ్యారు.

# కోల్డ్‌స్టోరేజీలు నిర్మిస్తాం: మంత్రి ఉత్తమ్



రాష్ట్రంలో రికార్డుస్థాయిలో ధాన్యం కొనుగోలు చేశామని, రైతుల అవసరాలకు అనుగుణంగా కోల్డ్‌స్టోరేజ్‌లు నిర్మిస్తామని మంత్రి ఎన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. హుజూర్‌నగర్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో నూతన కమిటీతో ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలుతో పాటు పేదలకు సన్నబియ్యం అందిస్తోందన్నారు. ఏడీఏ కార్యాలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అన్ని సీజన్లలో రికార్డుస్థాయిలో ధాన్యం కొనుగోలు చేశామన్నారు. మెరుగైన పాలన కోసం రాష్ట్రంలోని ఇతర వ్యవసాయ మార్కెట్ యార్డులను పరిశీలించి, ఆదర్శమార్కెట్ యార్డుగా తీర్చిదిద్దాలని సూచించారు. సమావేశంలో కలెక్టర్ తేజ్‌సనందలాల్ పవార్, మార్కెట్ కమిటీ చైర్మన రాధికఅరుణ్‌కుమార్, వైస్‌చైర్మన ఆదూరి స్రవంతికిషోర్‌రెడ్డి, మార్కెట్ కార్యదర్శి శ్రీధర్, దొంగరి వెంకటేశ్వర్లు, గూడెపు శ్రీనివాసు, యరగాని నాగన్న, దొంగరి సత్యనారాయణ, మంజూనాయక్, వీరారెడ్డి, కమిటీ డైరెక్టర్లు, అల్లం ప్రభాకర్‌రెడ్డి, ఈడ్పుగంటి సుబ్బారావు, మంజూనాయక్, నాగేశ్వరశర్మ, నవీన్‌కుమార్‌చౌదరి, శ్రీధర్, శివారెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, అజీజ్‌పాషా, శ్రీనివా?సగౌడ్, తన్నీరు మల్లికార్జున్‌రావు, రవినాయక్, సైదులునాయక్ పాల్గొన్నారు.

**దేశం గర్వించదగిన నేత రాజీవ్**

దేశం గర్వించదగిన గొప్ప నాయకుడు రాజీవ్‌గాంధీ అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. రాజీవ్ వర్ధంతి సందర్భంగా హుజూర్‌నగర్‌లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

**యాసంగికి ఎత్తిపోతలను సిద్ధం చేయాలి**

మేళ్లచెర్వు : వచ్చే యాసంగి నాటికి ఎత్తిపోతల పథకాలను పూర్తి చేసి, వినియోగంలోకి తేవాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నూతన ఎత్తిపోతల పథకాలపై చింతలపాలెం మండలకేంద్రంలోని అంజనీ సిమెంట్ ఫ్యాక్టరీ ఆవరణలో ఏర్పాటుచేసిన సమీక్షకు ఆయన హాజరయ్యారు. కొత్త ఎత్తిపోతల పథకాలతో హుజూర్‌నగర్ నియోజకవర్గంలో 71,000 ఎకరాలకు సాగునీరు అందుతుందని, ఇప్పటికే కొంత భూసమీకరణ పూర్తయ్యిందని, జులై చివరి నాటికి పూర్తిస్థాయిలో భూసేకరణ చేయాలన్నారు. న్యాయబద్ధంగా భూపరిహారం అందజేస్తామని, రైతులు సహకరించాలన్నారు. రూ.394 కోట్లతో చేపడుతున్న దొండపాడు–2 ఎత్తిపోతల పథకానికి రాజీవ్‌గాంధీ ఇరిగేషన స్కీమ్‌గా నామకరణం చేశారు. అదేవిధంగా వెల్లటూరులో రూ.1450కోట్లతో చేపట్టే ముక్త్యాల బ్రాంచి కెనాల్‌కు ఇందిరా గాంధీ ఎత్తిపోతల పథకంగా నామకరణం చేశామన్నారు. సమావేశంలో కలెక్టర్ తేజ్‌సనందలాల్ పవర్, ఆర్డీవో శ్రీనివాసులు, ఇరిగేషన సీఈ రమే?షబాబు, ఎస్‌ఈ శివధర్మతేజ, ఈఈలు చారి, హరికిషోర్, తహసీల్దార్ సురేందర్‌రెడ్డి, ఎంపీడీవో భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

**రూ.2 కోట్లతో మట్టపల్లి ఆలయ అభివృద్ధి**

మఠంపల్లి : మఠంపల్లి మండలాన్ని ఊహించనంతగా అభివృద్ధి చేశానని, మట్టపల్లి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ అభివృద్ధికి రూ.2 కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని బక్కమంతులగూడెం సమీపంలో రూ.3.5 కోట్లతో నిర్మించిన సబ్‌స్టేషనను కలెక్టర్ తేజ్‌సనందలాల్ పవార్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. రానున్న రోజుల్లో తెలుగు రాష్ట్రాలకు కేంద్ర బిందువుగా మఠంపల్లి మండలం మారబోతుందన్నారు. ప్రజలకు మెరుగైన విద్యుత సేవలు అందించడం సంతోషకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, ఎస్‌ఈ ఫ్రాంక్లిన, డీఈ వెంకటకృష్ణయ్య, సీనియర్ నాయకులు సాముల శివారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంజూనాయక్, ఆదూరి కిషోర్‌రెడ్డి, ఎల్లారెడ్డి, భాస్కర్‌రెడ్డి, వీరారెడ్డి, అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# పరిశ్రమలు రాష్ట్రం దాటకుండా చూడండి



రాష్ట్ర యువతకు పెద్ద సంఖ్యలో ఉపాధి, రాష్ట్ర ఖజానాకు ఆదాయం సమకూర్చే పరిశ్రమలు రాష్ట్రం దాటకుండా అధికారులు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఆదివారం సాయంత్రం ప్రజా భవన్లో డిప్యూటీ సీఎం అధ్యక్షతన ఇండస్ట్రియల్ ప్రమోషన్ సబ్ కమిటీ సమావేశం జరగా కమిటీ సభ్యులైన మంత్రులు దుద్దిల్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలు హాజరయ్యారు. ఈ సమావేశంలో ఇండస్ట్రియల్ ప్రమోషన్, ఇప్పటికే చేసుకున్న ఎంవోయుల అమలులో ప్రగతి, కొత్త యూనిట్ల స్థాపనకు సంబంధించిన అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఒక పరిశ్రమ స్థాపిస్తే అందుకు అనుబంధంగా పెద్ద సంఖ్యలో పరిశ్రమలు వచ్చే అవకాశం ఉన్న ప్రతిపాదనలపై దృష్టి పెట్టి వాటిని త్వరితగతిన ఆచరణలోకి తీసుకురావాలని డిప్యూటీ సీఎం అధికారులకు సూచించారు. ఇకనుంచి ప్రతి శనివారం ఇండస్ట్రియల్, ఇన్వెస్ట్మెంట్ ప్రమోషన్ సమావేశాన్ని నిర్వహిద్దామని డిప్యూటీ సీఎం అధికారులకు తెలిపారు. ఒక పరిశ్రమ ఏర్పాటుతో అనేక అనుబంధ పరిశ్రమలు రావడం తద్వారా రాష్ట్ర యువతకు వేళల్లో ఉద్యోగాలు, రాష్ట్ర ఖజానాకు పెద్ద సంఖ్యలో ఆదాయం సమకూరే వ్యూహాత్మక ప్రాధాన్యతను అధికారులు దృష్టిలో పెట్టుకొని ఆ రకమైన ప్రతిపాదనలపై కసరత్తు చేయాలని అధికారులకు సబ్ కమిటీ సూచించింది. జహీరాబాద్ నిమ్జ్ ప్రాంతంలో హుండాయ్ గ్లోబల్ ఇన్నోవేషన్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సెంటర్ స్థాపనకు సబ్ కమిటీ ఆమోదం తెలిపింది. 675 ఎకరాల్లో 8528 కోట్ల పెట్టుబడితో ఈ కంపెనీ రాష్ట్రానికి రావడం గొప్ప విజయంగా సబ్ కమిటీ అభిప్రాయపడింది. ఈ రీసర్చ్ సెంటర్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటుతో కొత్తగా 4276 మంది రాష్ట్ర యువతకు ఉపాధి లభిస్తుందని కంపెనీ ప్రతినిధులు సమావేశంలో వివరించారు. రీసెర్చ్ సెంటర్ లో ఆటోమోటివ్ టెస్ట్ ట్రాక్, పైలట్ లైన్, ప్రోటో టైపింగ్ ప్రధాన వ్యవస్థలు ఉంటాయని కంపెనీ ప్రతినిధులు సబ్ కమిటీకి వివరించారు. ప్రస్తుతం ప్రారంభించబోతున్న పరిశ్రమలు రాబోయే కొద్ది సంవత్సరాల్లో పెద్ద సంఖ్యలో ఉపాధి, ఆదాయాన్ని రాష్ట్రానికి సమకూరుస్తాయని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. సమావేశంలో ఇండస్ట్రీస్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సంజయ్ కుమార్, సీఈఓ సెక్రటరీ అజిత్ రెడ్డి, ఎట బిణతితిఇః విష్ణువర్ధన్ రెడ్డి, డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ మల్సూర్, కమర్షియల్ ట్యాక్స్ కమిషనర్ హరిత, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ, ట్రాన్స్కో సీఎండీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



# పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులివ్వండి: పొన్నం



పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు ఇవ్వాలని కేంద్ర పర్యావరణ, అటవీశాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌ను రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. ఈ మేరకు ఢిల్లీలో కేంద్ర మంత్రిని ఆయన కార్యాలయంలో కలిసి విజ్ఞప్తి చేశారు. డీపీఆర్‌ను పరిశీలించి ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వాలని కోరారు. అదేవిధంగా రాష్ట్రానికి సంబంధించిన పలు పెండింగ్ అంశాలు, పర్యావరణ అనుమతులు, అటవీ భూముల క్లియరెన్స్, రోడ్డు విస్తరణ ప్రాజెక్టులపై కేంద్ర ప్రభుత్వం సహకరించాల్సిన అంశాలపై మాట్లాడారు. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలోని గౌరవెల్లి ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వాలని విన్నవించారు. మంత్రి వెంట తెలంగాణ అడ్వకేట్ ఆన్ రికార్డ్ (ఏవోఆర్) శ్రవణ్ కుమార్ ఉన్నారు.

# మూడేళ్లలో ఎస్ఎల్‌బీసీ పూర్తి చేస్తాం



మూడు సంవత్సరాల్లో ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం పనులు పూర్తి చేస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. కనగల్ మండలం జి.యడవల్లిలో రూ.కోటి వ్యయంతో చేపట్టనున్న చెరువు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందన్నారు. రైతాంగం సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టులు, రిజర్వాయర్లను పూర్తి చేసేందుకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రూ.4000 కోట్లతో ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులు చేపట్టామని.. అటువైపు నుంచి సొరంగం కూలిపోవడం వల్ల పనులు ఆగిపోయాయన్నారు. పనులను తిరిగి ప్రారంభించి మూడేళ్లలో పూర్తి చేస్తామని చెప్పారు. జి.యడవల్లి గ్రామంలో రూ.4 కోట్ల వ్యయంతో 80 మందికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామన్నారు. రూ.5 కోట్లతో బీటీ రోడ్లు, రూ.30 లక్షలతో డ్రెయినేజీ మంజూరు చేశామన్నారు. కనగల్ పీహెచ్‌సీలో గ్లూకోమా కంటి పరీక్షల కోసం అధునాతన యంత్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ ఉదయసముద్రం, బ్రాహ్మణ వెల్లెంల తదితర ప్రాజెక్టుల ద్వారా నీరు వృథా కాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జి.యడవల్లి చెరువు తూము గండి వల్ల నీరు వృథా అవుతతోందని తెలుసుకుని మంత్రి ఆదేశాలతో నిధులు మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నెహ్రూ, నల్లగొండ ఆర్డీఓ వై.అశోక్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గడ్డం అనూప్‌రెడ్డి, తహసీల్దార్ పద్మ, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# అధికారులు ఆ ప్రాంతాల అభివృద్ధి కోసం సహకరించాలి



గిరిజన గ్రామాల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి సీతక్క తెలిపారు. ఇవాళ తెలంగాణ సచివాలయంలో మంత్రి సీతక్క అటవీ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. రహదారి సదుపాయం లేకపోతే తమ ప్రాంతాలు ఎలా అభివృద్ధి సాధిస్తాయని అధికారులను మంత్రి సీతక్క ప్రశ్నించారు. మా ప్రాంతం అభివృద్ధి కావద్దా అని నిలదీశారు. హైదరాబాద్ వంటి నగరాల్లో స్కై వేలు, హైవేలు, ఆరు వరుసల రోడ్లు వస్తున్నాయని తెలిపారు. అటవీ అభయారణ్య చట్టాల కారణంగా ములుగు వంటి ప్రాంతాల్లో సింగల్ రోడ్లు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు మంత్రి సీతక్క.

సరైన రహదారులు సదుపాయాలు రాక తాము చీకట్లోనే మగ్గిపోవాలా అని ఆందోళన వ్యక్తం చేశారు మంత్రి సీతక్క. అడవి ప్రాంతాలు, ఆదివాసి ప్రాంతాల్లో అభివృద్ధి జరగనీయకపోతే అంతరాలు పెరుగుతాయని అన్నారు. ఆదివాసీలు ఆదిమానవులలాగానే మిగిలిపోతారని చెప్పుకొచ్చారు. ఆదివాసి ప్రజల కోసం ఏజెన్సీలో బైక్ అంబులెన్స్‌లను అందుబాటులోకి తెచ్చామని గుర్తుచేశారు. వర్షాకాలంలో రోడ్లు లేకపోవడంతో బురదలో కూరుకు పోతున్నాయని వాపోయారు. ఏజెన్సీ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు అటవీశాఖ సహకరించాలని మంత్రి సీతక్క కోరారు.

అటవి చట్టాలను ఉల్లంగించాలని తాము చెప్పడం లేదని మంత్రి సీతక్క అన్నారు. వన్యప్రాణులకు ప్రమాదమని రహదారులు వేయనీయకపోతే ఎలా అని ప్రశ్నించారు. వన్యప్రాణులకు ప్రత్యేక బ్రిడ్జిలు వేయడం ద్వారా వాటిని కాపాడవచ్చని చెప్పారు. ఇతర రాష్ట్రాల్లో ఏ రకంగా అయితే అటవీ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారో ఇక్కడ కూడా అవే నిబంధనలను అమలు చేయాలని కోరారు. ప్రజల సౌకర్యార్థం అటవీ అభయారణ్య చట్టాల్లో కొన్ని సడలింపులు ఉన్నాయని.. వాటిని వర్తింపజేసి ములుగు, ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం వంటి తదితర ప్రాంతాల్లో రోడ్ల సదుపాయం కల్పించాలని సూచించారు. మేడారం జాతర కోసం ప్రత్యామ్నాయ రోడ్ల నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని మంత్రి సీతక్క కోరారు.

## ఫ్లైఓవర్‌పై వాహనదారుడికి ఫిట్స్.. మంత్రి సీతక్క మానవత్వం

ప్రతిపక్షంలో ఉన్నప్పుడే కాదు.. అధికారంలో ఉన్నప్పుడు తన శైలి ఒకటేనని మరోసారి నిరూపించుకున్నారు మంత్రి సీతక్క. గతంలో ఎన్నో సందర్భాల్లో ప్రజలు కష్టాలు పడ్డ సమయంలో సీతక్క ఉదారతను చాటుకున్న సంగతి మనకందరికీ సుపరిచితమే. అయితే అప్పుడు ఆమె ప్రతిపక్షంలో ఉన్నారు. అయితే ఇప్పుడు అధికారంలో ఉండి, మంత్రి పదవిలో ఉన్న సీతక్క.. ఓ వాహనదారుడి పట్ల మానవత్వం చాటుకున్నారు. హైదరాబాద్ నగరంలో నిత్యం ఎంతో రద్దీగా ఉండే పంజాగుట్ట ఫ్లై ఓవర్ మీద ఓ వాహనదారుడు ఫిట్స్ వచ్చి పడిపోతే, అటువైపుగా వెళ్తున్న సీతక్క దానిని గమనించారు. వెంటనే ఆ వాహనదారుడి వద్దకు వెళ్లి తాళం చెవిని చేతిలో పెట్టారు. అంతేకాకుండా ఆ వాహనదారుడు తేరుకునే దాకా అక్కడే ఉండి అతన్ని పర్యవేక్షించారు. అతను తేరుకున్న తర్వాత ధైర్యం చెప్పి ఆస్పత్రికి పంపించారు సీతక్క.

# సేవాదృక్పథంతో విధులు నిర్వహించాలి



లైసెన్స్‌డ్ సర్వేయర్లు సేవాదృక్పథంతో విధులు నిర్వహించాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ సూచించారు. సూర్యాపేట కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పి.రాంబాబుతో కలిసి లైసెన్స్‌డ్ సర్వేయర్లు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న భూముల సర్వే నిజాం కాలం నాటిదని, ఆ సర్వే సహాయంతో లైసెన్స్‌డ్ సర్వేయర్లు అప్డేట్ చేసుకుంటూ కచ్చితమైన మ్యాప్ ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భూభారతి చట్టం రూపొందించిందని, దీని అమలులో భాగంగా రిజిస్ట్రేషన్ చేసేటప్పుడు భూముల మ్యాప్ పాస్‌బుక్‌లో ప్రింట్ ఇవ్వడానికి భూములను సర్వే చేసేందుకు సర్వేయర్ల నుంచి దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా స్వీకరించామన్నారు. జిల్లాలో మొదటి విడత కింద 235 మంది అభ్యర్థులకు మే 26 నుంచి జూలై 26 వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.


**న్యాయబద్ధంగా పరిష్కరించాలి**

అభ్యర్థులంతా భూసమస్యలను న్యాయబద్ధంగా పరిష్కరిస్తూ రైతులతో మంచిగా మెలగాలని కలెక్టర్ సూచించారు. భూములను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, ఎలాంటి గెట్టు తగాదాలు లేకుండా, హద్దులను కాపాడడంతోపాటు సర్వేయర్ల కొరత తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి స్కీం ప్రారంభించిందని తెలిపారు. 235 మందికి ట్రైనింగ్ ఇచ్చి, ఎగ్జామ్ పెట్టి పాసైన వారికి సర్టిఫికెట్ ఇవ్వనున్నట్లు చెప్పారు. అనంతరం సంబంధిత శిక్షణ కిట్లను అభ్యర్థులకు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఏడీ ఎస్ఎల్ఆర్ శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, ప్రకాష్, సర్వేయర్లు శ్రీనివాస్, శ్యామ్, సమీర్, అలెన్ జోసెస్ తదితరులు పాల్గొన్నారు.

# రుణ లక్ష్యం రూ.6,660.15కోట్లు



2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వార్షిక రుణ ప్రణాళికను కలెక్టర్ హనుమంతరావు విడుదల చేశారు. కలెక్టరేట్‌లో జరిగిన బ్యాంకర్ల సమావేశంలో రూ.6,660.15 కోట్ల అంచనాతో రుణ ప్రణాళిక రూపొందించారు. రూ.5,334.80 కోట్లు (80.10%) ప్రాధాన్యత రంగాలకు కేటాయించగా, రూ.1,325.35 కోట్లు ఇతర రంగాలకు కేటాయించారు. వ్యవసాయ రంగానికి రూ.4,284.41కోట్లు (మొత్తం ప్రణాళికలో 64.31%), ఇందులో పంట రుణాలు: రూ. 2,391.28 కోట్లు, వ్యవసాయ టర్మ్ లోన్లు రూ. 1,599.67 కోట్లు ఉన్నాయి. సూక్ష్మ, చిన్న - మధ్య తరహా పరిశ్రమలకు రూ.902.67 కోట్లు, ఇతర ప్రాధాన్యత రంగాలకు రూ. 147.72 కోట్లు కేటాయించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్నందున బ్యాంకు అధికారులు రైతులకు సకాలంలో రుణాలు అందించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్డీఓ నాగిరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యామ్ సుందర్, బీసీ వెల్ఫేర్ అధికారి యాదయ్య, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం రవీందర్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శివరామకృష్ణ, ఆర్బీఐ ఏజీఎం లక్ష్మీశ్రావ్య, నాబార్డ్ ఏజీఎం వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




# సౌరశక్తి వినియోగంతో ఆర్థికాభివృద్ధి

సౌరశక్తి వినియోగంతో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలంలోని అయిటి పాముల గ్రామంలో కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ ఆర్థికసాయంతో స్వబాగ్ ల్యాబ్స్ ద్వారా ఏర్పాటు చేసిన స్వచ్ఛ శక్తి ఆఫ్ గ్రిడ్ కోఆపరేటివ్ సోలార్ బ్యాటరీ యూనిట్లను మంగళవారం కలెక్టర్ ఇలా త్రిపాఠి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సోలార్ ప్యానల్‌తో విద్యుత్‌ను స్టోరేజీ చేసి ఆదాయం సంపాదించేందుకు దేశంలోనే మొదటిసారిగా అయిటిపాములలో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులతో సోలార్ బ్యాటరీ యూనిట్లు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. స్వశక్తితో మహిళలు అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ ద్వారా 50 మంది స్వయం సహాయక మహిళలకు రూ.50 లక్షలు ఇచ్చామని తెలిపారు. త్వరలో ఈ 50 మంది మహిళలకు బ్యాంకు ద్వారా మూడు లక్షల రూపాయల చొప్పున బ్యాంకు రుణాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

**ఒప్పంద పత్రాలు అందజేత**

రాజీవ్ యువ వికాసం కింద నిరుద్యోగ యువతకు ఒక్కొక్కరికి రూ.4 లక్షల చొప్పున జూన్ 2న అందించనున్నట్లు తెలిపారు. రెండు నెలల్లో అయిటిపాముల మాదిరిగానే నల్లగొండ మండలం చర్లపల్లి గ్రామంలో సోలార్ విద్యుత్ యూనిట్లను ఏర్పాటు చేసి గ్రామాన్ని దత్తత తీసుకుంటామన్నారు. అయిటిపాములలో 100 ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఒక్కొక్కరికి రూ.5లక్షలు మంజూరు చేస్తామన్నారు. అనంతరం మహిళలకు రూ.10 లక్షల చెక్కు, స్వచ్ఛ శక్తి కేంద్రం, మహిళా సంఘాల మధ్య కుదిరిన ఒప్పంద పత్రాలను అందజేశారు. ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ మహిళలు సోలార్ ప్యానెల్‌ను సద్వినియోగం చేసుకుని ఆదాయం సమకూర్చుకోవాలన్నారు. సోలార్ విద్యుత్ యూనిట్ల ద్వారా మహిళలకు నెలకు రూ.2 వేలు ఆదాయం లభిస్తుందని తెలిపారు. మంత్రి చొరవతో రూ.100 కోట్లతో అయిటిపాముల లిఫ్ట్ ఇరిగేషన్ మంజూరు చేయించామని, పైపులైను పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. విద్యుత్ యూనిట్లకు కోతుల బెడద లేకుండా సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని స్వబాగ్ ల్యాబ్స్ యజమాన్యాన్ని కోరారు.

**మహిళలు ఇంటి నుంచే ఆదాయం పొందేలా**

కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ మహిళలు ఇంటి నుంచే ఆదాయం పొందేలా సోలార్ విద్యుత్ ఏర్పాటు చేశామన్నారు. సోలార్ విద్యుత్ బ్యాటరీ జీవిత కాలం 10 సంవత్సరాలు పనిచేస్తుందన్నారు. 50 మందితోపాటు గ్రామంలోని మిగతా మహిళలను బ్యాటరీ ఏర్పాటులో భాగస్వాములను చేస్తామన్నారు. స్వలాబ్ ల్యాబ్స్ సీఈఓ సుధాకర్ మాట్లాడుతూ ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి 50 మంది మహిళలకు రూ.50 లక్షలు అందించి ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ బ్యాటరీ దేశంలోనే మొదటిదని తెలిపారు. ఎలక్ట్రిక్ వాహనాలు, విద్యుత్‌కు బదులుగా ఈ బ్యాటరీలను ఉపయోగించుకోవచ్చన్నారు. తామే బ్యాటరీలను కొనుగోలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఎఫ్‌పీఓ చైర్మన్ చెవుగోని సైదమ్మ మాట్లాడుతూ సోలార్ ద్వారా ఉత్పత్తి అయిన విద్యుత్‌కు ప్రభుత్వం యూనిట్‌కు రూ.3 నుంచి 3.50 రూపాయలు ఇస్తుండగా, స్వబాగ్ ల్యాబ్స్ వారు యూనిట్‌కు రూ.16.50 చెల్లిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకటరెడ్డి, ఇన్‌చార్జ్ రెవెన్యూ అదనపు కలెక్టర్ అమిత్ నారాయణ, మండల ప్రత్యేక అధికారి కోటేశ్వర్‌రావు, ఆర్‌డీఓ వై.అశోక్‌రెడ్డి, తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీఓ జ్ఞానప్రకాశ్‌రావు, మాజీ జెడ్పీటీసీలు సుంకరబోయిన నర్సింహ, మాద యాదగిరి, ఎఫ్‌పీఓ చైర్మన్ సైదమ్మ, ఏపీఓ రాంమోహన్ ఉన్నారు.

# ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి



ప్రత్యామ్నాయ పంటల సాగు, ప్రకృతి వ్యవసాయం వైపు రైతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. వరి, పత్తి వంటి సంప్రదాయ పంటలే కాకుండా కూరగాయలు, పండ్ల తోటలు, వాణిజ్య పంటలు, ప్రకృతి వ్యవసాయం చేసేలా రైతులకు అవగాహ కల్పించాలని సూచించారు. రానున్న వానాకాలం సాగు సంసిద్ధంపై కలెక్టరేట్‌లో శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతులు, వ్యవసాయాధికారులతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. రైతులు పండించే వరి, పత్తి వంటి పంటల వల్ల శ్రమ ఎక్కువ, ఆదాయం తక్కువగా ఉంటోందని చెప్పారు. వీటిని దృష్టిలో ఉంచుకుని రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించాలని కంది, కూరగాయలు, పండ్ల తోటలు అధిక ఆదాయం వచ్చే వాణిజ్య పంటల వైపు వారిని మళ్లించాలన్నారు. ఉద్యాన పంటలు, నూతన వంగడాల సాగుకు సంబంధించి ప్రతి రెండు మండలాలను కలిపి ఒక క్లస్టర్ ఏర్పాటు చేసి మార్కెటింగ్‌కు ప్రోత్సాహం కల్పించేలా ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. ఉద్యాన పంటల సాగు ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు ప్రభుత్వం సబ్సిడీ, డ్రిప్ సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి, పద్మారెడ్డి, అంజిరెడ్డి, నవీన్‌రెడ్డి, శ్రీనివాస్, సత్తిరెడ్డి, శ్రీనివాస్‌రావు, గోపాల్‌రెడ్డి, జగన్, రాంరెడ్డి, వీరయ్య, ఎల్లయ్య, డీఏఓ శ్రవణ్‌కుమార్, ఉద్యాన అధికారి అనంతరెడ్డి పాల్గొన్నారు.

# భూముల సర్వేలో సర్వేయర్ల పాత్ర కీలకం




భూముల సర్వేలో సర్వేయర్ల పాత్ర కీలకమైనదని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో లైసెన్స్‌డ్ సర్వేయర్లకు నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. భూములకు సంబంధించి సర్వేయర్లు వివిధ రకాల సర్వే నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వ భూముల సర్వే, అసైన్డ్ భూముల సర్వే, ప్రాజెక్టుల నిర్మాణం సందర్భంగా భూ సేకరణకు సంబంధించి నిర్వహించే సర్వే, ఎఫ్ లైన్ సర్వేల సమయంలో సర్వేయర్లు ముఖ్యపాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. రెవెన్యూకు సంబంధించి గ్రామాలు, మండలాల అంతర్గత సరిహద్దుల నిర్ణయంలో, అంతర్గత సరిహద్దుల వివాదాల పరిష్కారానికి నిర్వహించే సర్వే విషయంలో సర్వేయర్లదే కీలక పాత్ర అన్నారు. అనంతరం 150 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లకు కలెక్టర్ సర్వే సామగ్రి అందజేశారు. సర్వేయర్లకు మహాత్మాగాంధీ యూనివర్సిటీలో శిక్షణ ఇవ్వనున్నట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఇన్‌చార్జ్ ఏడీ సుజాత, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్స్ రమణయ్య, సూపరింటెండెంట్ రాధాకృష్ణ పాల్గొన్నారు.

# వంగూరి హరివిల్లు

1.అత్రముంటే పరుగుల గుర్రం
నిమ్మలముంటే నత్త నడక
జనులపాలిట గడియారం
వల్లమాలిన వెటకారపు వేదిక

2.అసాధ్యమైనది కోరుకొని
అందలేదని భంగపడనేల
చంద్రదర్శనం కావాలని
అమాసనాడు ఆశపడితే ఎలా

3.కరిగినప్పుడే కదా
కనకం అయ్యేది ఆభరణం
కాగినప్పుడే కదా
క్షీరానికి కమ్మని పరిమళం

4.ఎవరో ఏదో అన్నారని
ఎందుకు నీకు కలవరం
రాలిన పండు కాలేదా
ఓ సిద్ధాంతానికి అంకురం

5.కొలువుదీరితే
కన్నుల పండుగ
కొలువు కూలితే
బతుకు బస్టాండేగా

6.కసితో చేసే కృషి
సృష్టించదా అద్భుతం
గురితో గరుత్మంతుడు
సాధించలేదా అమృతం

7.వేదించే వ్యధలకు
ఉపశమనం చూపేవాడు మిత్ర
బాధించే బడలికలకు
విశ్రాంతి కలిగించేది నిద్ర

8.అనారోగ్య సేతువు
మనం తినే తిండి
ఆవేదన హేతువు
'మనం' పడే వత్తిడి

9.మరువలేని
చేదు అనుభూతులు
మదిని తొలిచే
వేదనా భూతాలు

10.అన్నీ అనుకూలంగా
ఉంటే సోమరితనం
అన్నిటిని అనుగుణంగా
మలుచుకుంటే నేర్పరితనం

11.కనపడని కరెంటే
తిప్పేది ఆపేది ఫ్యాన్ ను
కనపడని మనసే
మలిచేది తొలిచేది మ్యాన్ ను

12. పరిమాణమే ప్రమాణమని
భ్రమపడతావేలా
అనంతవటవృక్షానికి మూలం
అల్పమైన బీజమేగా

13.మమకారపు సహకారం
ఓ సంస్కారం
సర్దుబాట్ల సంసారం
ఓ పురస్కారం

14.ఒడుదొడుకుల ప్రహసనం
జనజీవన సౌందర్యం
ఒంకర టింకర ప్రవాహం
నదీజల నాట్యమయూరం

15.ఆశయ సాధనకు
కావాలి ఓర్పు
ఆశయే నీకు
అది నేర్పు

16.ప్రమాదాలు జరుగుతాయని
ప్రయాణాలు ఆపుకుంటారా?
ఓడిపోతామని ఎన్నికల్లో
పోటీ చేయడం మానుకుంటారా

17.ఆపత్కాలంలో ఆప్తులు
చేసేది అసలైన సహాయం
అనారోగ్యంలో తెల్ల రక్త కణాలు
చేసేది సిసలైన సమరం

18.ఆపుకోని కోపమే
అతి పెద్ద లోపం
నిలుపుకోని ధనమే
దురదృష్ట నెపం

19.తోటివారికి నచ్చినట్లు
ఉండేవారు దొడ్డవారు
నోటికి నచ్చినట్లు
భుజించేవారు దొడ్డువారు


20.పదవొస్తే ప్రదర్శించేది
పటారం
ఆపదొస్తే ఆదుకునేది
పటాలం

21.ప్రకృతి మన పాలిట
అక్షయపాత్ర
సాంత్వనమే మనసు పాలిట
ఉపశమన మాత్ర

22.విద్యతో కలుగు
మనోవికాసం
సయోధ్యతో తొలగు
జనవివాదం



-వంగూరి గంగిరెడ్డి
M.A., M.Ed, M.Phil,
విశ్రాంత ఉపాధ్యాయుడు
షాద్ నగర్,
9652286270.




# గిఫ్ట్ డీడ్ ప్రాముఖ్యత ఏమిటి? గిఫ్ట్ డీడ్‌ను ఎలా రద్దు చేయాలి?

గిఫ్ట్ డీడ్ అనేది ఒక ఆస్తి యజమాని తన ఆస్తిని లేదా డబ్బును వేరొకరికి బహుమతిగా ఇవ్వాలనుకున్నప్పుడు ఉపయోగించబడే చట్టపరమైన పత్రం. గిఫ్ట్ డీడ్ ఆస్తి యజమాని ఆస్తిని ఎవరికైనా బహుమతిగా ఇవ్వడానికి అనుమతిస్తుంది. ఆస్తి బదిలీ చట్టం 1882 గిఫ్ట్ డీడ్ను కవర్ చేస్తుంది. ఆస్తి బదిలీ చట్టం, 1882 మరియు ఆదాయపు పన్ను చట్టం, 1961 కింద చట్టబద్ధంగా అధీకృతం చేయబడిన గిఫ్ట్ డీడ్ అనేది ఎటువంటి డబ్బు మార్పిడి లేకుండా కదిలే లేదా స్థిరమైన ఆస్తిని బదిలీ చేయడాన్ని సూచించే చట్టపరమైన పత్రం. గిఫ్ట్ డీడ్ ఆస్తి వారసత్వ కేసులలో వివాదాల అవకాశాలను తగ్గిస్తుంది. గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్లో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ఛార్జీలు ఉంటాయి. బహుమతిగా ఇవ్వబడే వస్తువు ఒక కదిలే లేదా స్థిరమైన ఆస్తి కావచ్చు. గిఫ్ట్ డీడ్ అనేది ఆస్తి యజమాని చేసిన చెల్లుబాటు అయ్యే 'విల్'కి భిన్నంగా ఉన్నందున వారసత్వ విషయాలలో విలువైన పత్రం. వీలునామా వలె కాకుండా, గిఫ్ట్ డీడ్ వెంటనే అమలు చేయబడుతుంది మరియు దానిని అమలు చేయడానికి కోర్టు అవసరం లేదు. అందువల్ల, వీలునామా ద్వారా సెటిల్మెంట్తో పోలిస్తే గిఫ్ట్ డీడ్ సమయాన్ని ఆదా చేస్తుంది. గిఫ్ట్ డీడ్ కింద, ఆస్తిని బహుమతిగా ఇచ్చే వ్యక్తిని దాత అని మరియు స్వీకరించే వ్యక్తిని ' స్వీకర్త'అని పిలుస్తారు.

**గిఫ్ట్ డీడ్ కు అర్హత:**

గిఫ్ట్ డీడ్ ను డాక్యుమెంట్ చేయడానికి, దాత సమర్థుడిగా ఉండాలి. చట్టం ప్రకారం, దాత మైనర్ కాకూడదు. దీనికి విరుద్ధంగా, గ్రహీత మైనర్ కావచ్చు, సహజ సంరక్షకుడు నామినీగా ఉండవచ్చు, విరాళం పొందిన వ్యక్తి వయోజనుడు అయ్యే వరకు ఆస్తిని నిర్వహించే బాధ్యతను వారు పంచుకుంటారు.

గిఫ్ట్ డీడ్ ద్వారా బదిలీ చేయగల ఆస్తులు:

స్థిరమైన ఆస్తులు: భూమి, ఇల్లు, అపార్ట్మెంట్

అస్థిరమైన ఆస్తులు: నగలు, వాహనాలు, పెట్టుబడులు

ఆర్థిక ఆస్తులు: షేర్లు, మ్యూచువల్ ఫండ్లు, బ్యాంక్ డిపాజిట్లు

మేధో సంపత్తి హక్కులు: కాపీరైట్, పేటెంట్స్, ఆస్తి దాతకు చట్టపరమైన యాజమాన్యంలో ఉండాలి మరియు ఏవైనా వివాదాలు లేకుండా ఉండాలి.

**గిఫ్ట్ డీడ్ యొక్క ఉద్దేశ్యం ఏమిటి?**

యాజమాన్యం బదిలీని ప్రారంభించడానికి –బహుమతి దస్తావేజు యొక్క ప్రాథమిక ప్రయోజనం ఆస్తి లేదా ఆస్తి యొక్క యాజమాన్యాన్ని బదిలీ చేయడం. ఈ ఆస్తి కదిలేది లేదా స్థిరమైనది మరియు స్టాక్లు, బాండ్లు, కదిలే ఆస్తి, రియల్ ఎస్టేట్ మరియు ఇతర విలువైన వస్తువులను కలిగి ఉండవచ్చు.

దాతృత్వం కోసం – స్వచ్ఛంద సంస్థలు/డ్రైవ్లు మరియు లాభాపేక్ష లేని సంస్థలు గిఫ్ట్ డీడ్ ద్వారా విరాళాలను స్వీకరించడం సర్వసాధారణం. దాతలు ఒక స్వచ్ఛంద సంస్థ లేదా పేర్కొన్న కారణం కోసం పనిచేస్తున్న ఔటుకి అనుకూలంగా కదిలే లేదా స్థిరమైన ఆస్తిని వదులుకోవడానికి గిఫ్ట్ డీడ్ ను రూపొందించడం ద్వారా ఉద్యమం లేదా కారణానికి మద్దతు ఇవ్వడానికి ఎంచుకుంటారు.

ఎస్టేట్ ప్లానింగ్ ను ప్రారంభించడానికి – గిఫ్ట్ డీడ్ జారీ చేయడం ద్వారా, వ్యక్తులు తమ జీవితకాలంలో ఆస్తులు మరియు ఆస్తులను బదిలీ చేయడం ద్వారా వారి కుటుంబ ఎస్టేట్ ప్లానింగ్కు వ్యూహరచన చేస్తారు. ఇది ఎస్టేట్ పన్నులను ముందుగానే ప్లాన్ చేసుకోవడానికి వీలు కల్పిస్తుంది మరియు వారి ఆస్తులు మరియు ఆస్తులు వారి ఇష్టానుసారంగా పంపిణీ చేయబడిందని నిర్ధారించుకోవచ్చు.

**గిఫ్ట్ డీడ్ ఎలా రూపొందించాలి?**

గిఫ్ట్ డీడ్ ను రూపొందించడానికి మీరు ఈ క్రింది మార్గాన్ని ఉపయోగించవచ్చు:

గిఫ్ట్ డీడ్ ను అమలు చేయాల్సిన స్థలం మరియు తేదీని పేర్కొనాలి.రెండు పార్టీలు చిరునామా, పేరు, పుట్టిన తేదీ మరియు సంతకం వంటి అన్ని సంబంధిత సమాచారాన్ని పేర్కొనాలి. దస్తావేజు చేయబడుతున్న ఆస్తి యొక్క పూర్తి వివరాలను పేర్కొనండి

గిఫ్ట్ డీడ్ లో ఇద్దరు సాక్షులు మరియు వారి సంతకాలు ఉండాలి. మొత్తం చెల్లించిన తర్వాత స్టాంప్ పేపర్స్ పై గిఫ్ట్ డీడ్ ను ముద్రించాలి. అది పూర్తయిన తర్వాత, దానిని

రిజిస్ట్రార్ లేదా సబ్–రిజిస్ట్రార్ కార్యాలయంలో నమోదు చేయాలి.

**గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్:**

ఆస్తి బదిలీ చట్టం 1882 ప్రకారం, రిజిస్టర్ అయితేనే గిఫ్ట్ డీడ్ చెల్లుబాటు అవుతుంది. గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్లో దాత సంతకం మరియు ఇద్దరు సాక్షులు తప్పనిసరి మరియు ఆస్తి వివరాల ధ్రువీకరణ ఉంటుంది. వాస్తవానికి, రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్ చేయబడితేనే గిఫ్ట్ డీడ్ అమలులోకి వస్తుంది. గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్లో స్టాంప్ పేపర్పై అవసరమైన నిబంధనలను లెక్కించడం మరియు అవసరమైన స్టాంప్ డ్యూటీని చెల్లించడం వంటివి ఉంటాయి. గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్ పై స్టాంప్ డ్యూటీ గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్లో ముఖ్యమైన భాగం. ఏప్రిల్ 2017 తర్వాత, ఆదాయపు పన్ను చట్టం, 1961లోని సెక్షన్ 56 ప్రకారం బహుమతులపై పన్ను విధించబడుతుంది. పేర్కొన్న చట్టం ప్రకారం, ఒక వ్యక్తి రూ. 50,000 కంటే ఎక్కువ మొత్తాన్ని బహుమతిగా స్వీకరిస్తే, మొత్తం బహుమతి మొత్తానికి 'ఇతర వనరుల నుండి ఆదాయం' శీర్షిక కింద పన్ను విధించబడుతుంది.

ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 56 ప్రకారం, ఒక వ్యక్తి ఒక స్థిరాస్తిని బహుమతిగా స్వీకరించి, స్టాంప్ డ్యూటీ ఛార్జీలు రూ. 50,000 దాటితే, బహుమతి యొక్క స్టాంప్ డ్యూటీ విలువ పన్ను పరిధిలోకి వస్తుంది మరియు దాత చెల్లించాలి. వివిధ రాష్ట్రాల్లో గిఫ్ట్ డీడ్లపై స్టాంప్ డ్యూటీ వేరు వేరు గా ఉంటుంది.

గిఫ్ట్ డీడ్ ఆస్తిపై పన్ను మినహాయింపులు:

భారతదేశంలోని ఆదాయపు పన్ను చట్టం ప్రకారం, కింది వ్యక్తులలో ఎవరి నుండి ఆస్తి/మొత్తాన్ని స్వీకరించినట్లయితే పన్నులు వర్తించవు. సందేహాస్పద బహుమతి బంధువుల నుండి పొందినట్లయితే, లేదా సంబంధిత వ్యక్తి యొక్క వివాహంపై బహుమతి పొందినట్లయితే లేదా బహుమతిని వీలునామా కింద లేదా వారసత్వం ద్వారా స్వీకరించినట్లయితే, లేదా దాత మరణం గురించి ఆలోచించి బహుమతి పొందినట్లయితే, లేదా ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 10(20) కింద నిర్వచించిన విధంగా, స్థానిక అధికారం నుండి బహుమతి పొందినట్లయితే, లేదా ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 10(23సి) కింద పేర్కొన్న విశ్వవిద్యాలయం, స్వచ్ఛంద సంస్థ. విద్యా సంస్థ. వైద్య సంస్థ. ఆసుపత్రి, ట్రస్ట్ నుండి బహుమతి పొందినట్లయితే లేదా (సెక్షన్ 12ం లేదా 12ంం కింద రిజిస్టర్ చేయబడినది) లేదా వ్యక్తి యొక్క బంధువుకు ప్రయోజనం చేకూర్చడానికి మాత్రమే స్థాపించబడిన ట్రస్ట్ నుండి పూర్తి చేసిన వ్యక్తి బహుమతిని స్వీకరిస్తే.

**గిఫ్ట్ డీడ్ యొక్క ప్రయోజనాలు:**

చట్టపరమైన చెల్లుబాటు: గిఫ్ట్ డీడ్ బదిలీకి అధికారిక రుజువుగా పనిచేస్తుంది. తరువాత తలెత్తే ఏవైనా చట్టపరమైన వివాదాలను పరిష్కరించడంలో సహాయపడుతుంది.

పన్ను ప్రయోజనాలు:

ఇది కొన్ని సందర్భాల్లో, ముఖ్యంగా దగ్గరి బంధువులకు ఆస్తిని బదిలీ చేసేటప్పుడు పన్ను మినహాయింపులను అందిస్తుంది.

తక్షణ ప్రభావం: యాజమాన్యం వెంటనే బదిలీ చేయబడుతుంది, మరణం తర్వాత బదిలీ జరిగే వీలునామాలా కాకుండా.

రద్దు నిబంధన: దాత నిర్దిష్ట చట్టపరమైన పరిస్థితులలో బహుమతి దస్తావేజును రద్దు చేయవచ్చు.

స్పష్టమైన యాజమాన్యం: ఇది దావా పొందిన వ్యక్తి యొక్క యాజమాన్యాన్ని స్పష్టంగా నిర్ధారిస్తుంది, భవిష్యత్తులో దావాలు లేదా వివాదాలను నివారిస్తుంది.

ద్రవ్య మార్పిడి లేదు: ఎటువంటి చెల్లింపు లేకుండా బదిలీ జరుగుతుంది. త్వరితంగా మరియు ఖర్చుతో కూడుకున్నది: అమ్మకంతో పోలిస్తే, గిఫ్ట్ డీడ్ ద్వారా బదిలీ చేయడం వేగంగా ఉంటుంది. మరియు సాధారణంగా తక్కువ ఖర్చులతో కూడుకున్నది.

గిఫ్ట్ డీడ్ను ఎలా రద్దు చేయాలి?:

**1882 ఆస్తి బదిలీ చట్టంలోని సెక్షన్ 126 ప్రకారం, గిఫ్ట్ డీడ్ ను రద్దు చేయడానికి, ఈ క్రింది షరతులను నెరవేర్చాలి:**

**1. పరస్పర ఒప్పందం:**

దాత (దాత) మరియు స్వీకర్త (గ్రహీత) ఇద్దరూ బహుమతి దస్తావేజును రద్దు చేయడానికి అంగీకరించినప్పుడు,ఒప్పందం చెల్లుబాటు కావడానికి తప్పనిసరిగా డాక్యుమెంట్ చేయబడి నమోదు చేయబడాలి.

**2. డీడ్లో రద్దు నిబంధన :**

అసలు గిఫ్ట్ డీడ్ లో రద్దును అనుమతించే నిబంధన ఉంటే, దాత ఆ నిబంధనలో పేర్కొన్న షరతులను నెరవేర్చడం ద్వారా బహుమతిని రద్దు చేయవచ్చు.

**3. మోసం, బలవంతం లేదా అనవసర ప్రభావం :**

మోసపూరిత పరిస్థితులు, బలవంతం లేదా అనవసర ప్రభావంతో దస్తావేజు అమలు చేయబడితే దాత దానిని రద్దు చేయవచ్చు. దాత ఈ ఆరోపణలను కోర్టులో నిరూపించాలి.

**4. షరతుల వైఫల్యం :**

గిఫ్ట్ షరతులతో కూడుకున్నది అయితే (ఉదా. దాత బాధ్యతలను స్వీకరించే వ్యక్తి చూసుకోవాలి) మరియు షరతులు నెరవేర్చబడకపోతే, దాత ఆ దస్తావేజును రద్దు చేయవచ్చు.



**ఆరెపల్లి త్రివేణి** B.A.,LL.B.,
అడ్వకేట్, హనుమకొండ జిల్లా.

# లైఫ్ 3.0

## కొత్త కొత్తగా ఉన్నదీ..!



***అరచేతిలోనే అఖండ విశ్వం చూడొచ్చు!***
***అనారోగ్యానికి గురైతే అరనిమిషంలో వైద్య సాయం పొందొచ్చు!***
***రోజుల సమయం పట్టే పనులు క్షణాల్లోనే పూర్తి చేసుకోవచ్చు!***
***చరిత్రలో మిగిలిపోయిన ఎన్నో మిస్టరీలను ఛేదించవచ్చు!***

'ఇందుగలదు అందులేదను సందేహము వలదు! ఎందెందు వెతికినా అందందే గలదు..' అన్నట్టు మన జీవనశైలిలో ప్రతి అంశంలోకి సాంకేతికత వచ్చి మనల్ని ఆశ్చర్యానికి గురిచేస్తోంది. గిలిగింతలు పెడుతోంది.

పౌరాణికాల్లో విన్నట్టు..
పురాతన కాలంలో జరిగినట్టు..
చందమామ కథల్లో చదివినట్టు..
హాలీవుడ్ సినిమాల్లో చూపించినట్టు..
అలాంటి అద్భుతాలు నిజంగా జరిగితే ఎంత బాగుంటుంది కదూ..!

వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా.. అవన్నీ మన కళ్ల ముందు ఆవిష్కృతమవుతున్న రోజులివి. ఒకప్పుడు శాస్త్రీయ కాల్పనిక రచనలకే పరిమితం. ఇవాళ అవి వాస్తవ రూపం దాల్చుతున్నాయి. మనచుట్టూ వేగంగా విస్తరిస్తున్నాయి. తెల్లారి లేచిందగ్గర్నుంచీ రాత్రి పడుకునేదాకా అడుగడుగునా సాంకేతికత మన వెన్నంటే ఉంటోంది. ఒక వస్తువైనా, సేవ అయినా కృత్రిమ మేధని అదనంగా చేర్చితే దాని విలువ ఎన్నో రేట్లు పెరుగుతోంది. అందుకే.. విద్య నుంచి వైద్యం వరకూ, వ్యాపారం నుంచి వ్యవసాయం వరకూ సాంకేతికత విస్తరిస్తూ మన లైఫ్ స్టైల్‌ని నెక్స్ట్ లెవల్‌కు తీసుకెళ్తున్నాయి.

మన జీవన విధానం గత కొన్ని దశాబ్దాల్లో విపరీతమైన మార్పులను చవిచూసింది. కానీ, మనం ఇప్పుడు నిలుచున్న ఘట్టం? టెక్నాలజీ శిఖరం వైపు దూసుకెళ్తున్న అపూర్వ పయనం. ఈ మార్పులకు ప్రధాన దోహదం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI), మెటావర్స్ వంటి టెక్నాలజీలే. ఇవి కేవలం మన పనితీరును మాత్రమే కాదు, వ్యక్తిగత జీవితం, సమాచారం, ఆరోగ్యం, వినోదం, విద్య, ఉద్యోగ అవకాశాలు వంటి అనేక రంగాలను సమూలంగా మార్చేస్తున్నాయి. AIఒక ఊహ మాత్రమేగా మొదలై, నేడు మానవ జీవితంలో అంతర్భాగమైంది. మెటావర్స్ ఇంటర్నెట్ విప్లవానికి తదుపరి మైలురాయి. ఈ రెండూ కలసి భవిష్యత్తులో మన జీవనశైలిని ఊహించనంత వేగంగా ప్రభావితం చేస్తున్నాయి.

'నీకిష్టమని ఈ కూర వండాను' అని అమ్మ అంటే ఆ మాటకే సగం కడుపు నిండిపోతుంది. ఏదైనా మనకోసం ప్రత్యేకంగా తయారైందంటే దాని విలువే వేరు! అందుకే ఇప్పుడు మన పనులన్నిటినీ పర్సనలైజ్ చేస్తోంది– ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్. ఆ క్రమంలో మన సమయాన్నీ, డబ్బునీ, శక్తినీ ఆదా చేస్తోంది. మన పనుల్ని వేగవంతం, సులభతరం చేస్తోంది.

**మ(రో)ర మనిషి**

అజయ్ ఇంటికి ఇద్దరు ఫ్రెండ్స్ వచ్చారు. "చిట్టీ.. రెండు కాఫీలు పట్రా" అన్నాడు. కొద్ది సేపట్లోనే చిట్టీ కాఫీ కప్పులు తీసుకువచ్చి టేబుల్‌పై పెట్టింది. అంతా బాగానే ఉంది కదా అయితే కాఫీలు తీసుకొచ్చి ఇచ్చింది మాత్రం మనిషి కాదు ఒక రోబో. అవును.. ఇంతకాలం పరిశ్రమలకే పరిమితమైన రోబోలు మన ఇంట్లో పనులు చేసి పెడుతున్నాయి. వంటలు చేసేందుకు కూడా సిద్ధమైపోతున్నాయి.

నార్వేకు చెందిన 1చీ అనే కంపెనీ గత ఏడాది ఆగస్టులోనే నియో బేటా అనే రోబోను







ఇంటి పనుల కోసం విడుదల చేసింది. ఇది సాక్సులు అందివ్వడం, బ్యాగ్లు ఇవ్వడం లాంటి చిన్న చిన్న పనులు చేసేది. అయితే తాజాగా విడుదల చేసిన నియో గామా రోబో ఇంట్లో అన్ని పనులతో పాటు కాఫీ కూడా పెట్టిచ్చే వరకు ఎదిగింది. ఈ రంగంలో నూతన ఆవిష్కరణల కోసం ఏజిలిటీ, ఆప్ట్రానిక్, బోస్టన్ డైనమిక్స్, ఫిగర్, టెస్లా.. తదితర కంపెనీలు పోటీపడుతున్నాయి. ఇప్పటికే ఇంట్లో వాక్యూమ్ క్లీనర్ల రూపంలో ఇంటిని శుభ్రం చేస్తున్న యంత్రాల గురించి తెలిసిందే.

వీటి పనితీరుని ఏఐ ఆధారంగా కోడ్ రూపొందించి తయారు చేస్తారు. పూర్తి అటానమీ ఉన్నా వారి యజమాని కమాండ్స్ మేరకు పనిచేస్తాయి. తమ చుట్టుపక్కల ఉన్నవారిని, వస్తువులను దృష్టిలో పెట్టుకొని పనిచేస్తాయి. అందువల్ల వాడేవారికి ఎలాంటి ప్రమాదం ఉండదు. దీన్ని ఇంటిలో అచ్చం మనలాగే పనులను చేయగలిగేలా రూపొందించారు. ఇది కృత్రిమ మేధస్సు ఆధారంగా పనిచేస్తూ అచ్చం మనుషుల మాదిరిగానే పనులను చేస్తుంది. ఈ రోబో మానవుల వలే తిరగడం, వంగడం, వస్తువులను పట్టుకోవడం లాంటివి చేస్తుంది కూడా.

అమెరికాకు చెందిన ఫిగర్ కంపెనీ నిర్మించిన హెలిక్స్ రోబోలను Vision-Language-Action (VLA) నమూనాలో తయారు చేశారు. దీంతో మన కమాండ్ చేసిన వెంటనే ఇంట్లోని వస్తువులను అందిస్తుంది. కొన్ని వస్తువులను ఉంచి మనకు ఏది కావాలో చెబితే దాన్నే అందివ్వడం దీని ప్రత్యేకత. ఈ కంపెనీ నుంచే మనతో మాట్లాడే మర మనుషులు కూడా రానున్నట్లు సమాచారం. హ్యుమనాయిడ్ రోబోలకు రానున్న కాలంలో విపరీతమైన డిమాండ్ ఉంది. వీటి మార్కెట్ లక్షల కోట్ల డాలర్లకు చేరుకుంటుందని టెస్లా అధినేత ఎలాన్ మస్క్ అంచనా వేశారు.

వృద్ధులకు ఇళ్లలోనూ ఆస్పత్రుల్లోనూ ఆత్మీయ సహాయకుని పాత్ర పోషించే రోబోలకు ఇప్పుడు ప్రపంచ దేశాలన్నిటా మంచి గిరాకీ ఉందట.

**వార్తలు చదువుతోంది ఏఐ యాంకర్**

"బ్రహ్మ మిమ్మల్ని పుట్టిస్తే.. మీ మేధస్సు నన్ను పుట్టించింది. ఇక నుంచి నేను వార్తలు చదువుతాను" అంటూ ఏఐ యాంకర్లు చక్కని హావభావాలతో వార్తలు చదివి వినిపిస్తున్నాయి. సమాచారం సేకరించేందుకు, రాసేందుకు, ప్రసారం చేసేందుకు జర్నలిస్టులకు కృత్రిమే మేధ ఎంతో సహాయకారిగా ఉంటోంది. వార్తలు అందించడంలోనూ, చదవడంలోనూ కొత్త అనుభూతికి లోనయ్యే సమయం ఆసన్నమైందంటున్నారు పబ్బాస్ ఐటీ పార్క్ సంస్థకు చెందిన వరంగల్ టెక్ నిపుణుడు పబ్బా భానులక్ష్మణ్. పూర్తిస్థాయి ఏఐతో కూడిన న్యూస్ ప్లాట్‌ఫామ్ 'బ్రేకింగ్ నౌ' అనే యాప్‌ను రూపొందించినట్టు తెలిపారు. ఈ యాప్‌లోని వార్తలను ఏఐ యాంకర్ తెలుగులో స్పష్టంగా చదువుతుందని తెలిపారు.

**ఆరోగ్యమస్తు.. అంటూ దీవిస్తున్న కృత్రిమ మేధ**

వైద్య రంగంలో కృత్రిమ మేధ పాత్ర ఎంతో కీలకంగా మారుతోంది.

♦ సీటీ స్కాన్, ఎంఆర్ఐ, అల్ట్రాసౌండ్ స్కాన్ లాంటివాటిని నిశితంగా పరిశీలించడానికి డాక్టర్లకు చాలా సమయం పడుతుంది. ఏఐ ఆ పనిని సులువుచేయడమే కాదు, కంటికి కనపడని అత్యంత సూక్ష్మమైన తేడాలను కూడా గుర్తించి ఖచ్చితత్వంతో కూడిన రిపోర్టులు కూడా అందిస్తుంది. క్యాన్సర్ లాంటివి రాకముందే హెచ్చరించగలుగుతుంది.

♦ భవిష్యత్‌లో మనల్ని ఎటాక్ చేయబోతున్న వ్యాధిని ముందే గుర్తిస్తుంది. జన్యుక్రమాన్ని విశ్లేషించి అవసరమైన జాగ్రత్తలూ సూచిస్తుంది.

♦ సర్జరీ చేసే సమయంలో వైద్యుల కంటికి కనిపించని అతి సూక్ష్మ రక్తనాళాలను పొరపాటున కత్తిరించే ప్రమాదం ఉంటుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వాడినప్పుడు.. అలాంటి వాటిని గుర్తించి అప్రమత్తం చేస్తుంది. మెదడు సర్జరీల్లో ఏఐ పాత్ర చాలా కీలకయం. చికిత్స సమయం కూడా తగ్గుతుంది.

♦ ఒక కొత్త ఔషధాన్ని కనుగొనడానికి రెండు దశాబ్దాలకు పైగా పట్టేది. ఇప్పుడు ఏఐని వినియోగించి కేవలం రెండేళ్లలోనే కొత్త

మందును కనిపెట్టడానికి వీలవుతున్నది.

♦ పక్షవాతం రోగికి మెదడులో ఏఐతో కూడిన న్యూరోలింక్ అనే చిప్‌ను పెట్టడం వల్ల కాళ్లు చేతులు కదుపుతాడు.

♦ అపోలో ఆసుపత్రుల సంస్థ ఈ ఏడాది ప్రారంభంలోనే మైక్రోసాఫ్ట్ సంస్థతో కలిసి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బేస్డ్ రిస్క్ స్కోర్(ఏఐసీవీడీ) విధానాన్ని ఆవిష్కరించింది. దీనితో రాబోయే పదేళ్ళలో మనకి హృద్రోగ సమస్య వస్తుందా రాదా అని తేల్చేయొచ్చట! మెటావర్స్ సాంకేతికతతో రోగి తన గుండె ఆరోగ్యాన్ని తానే నేరుగా చూసేలా 'డీప్ ఎక్స్' అని మరో టెక్నాలజీని తీసుకొచ్చింది.

**ఆన్‌లైన్‌లో ఉచిత వైద్యసాయం**

♦ అనుకోకుండా ఒక వ్యక్తి జారి పడ్డారు. మోకాలుకు గట్టి దెబ్బ తగిలింది. ఆసుపత్రికి తీసుకెళ్లే పరిస్థితి లేదు.. మరెలా? ఇలాంటి పరిస్థితుల్లో స్మార్ట్‌ఫోన్‌లో గాయం ఫొటోను తీసి వైద్య. ఏఐకి అప్‌లోడ్ చేస్తే చాలు. దీనిలోని ఏఐ వ్యవస్థలు ఇమేజ్‌ను విశ్లేషించి ఎలా శుభ్రం చేయాలో, ఎలా కనిపెట్టుకోవాలో చెబుతాయి. ఎప్పుడు ఆసుపత్రికి తీసుకెళ్లాలో కూడా సూచిస్తాయి.

♦ ఏదో జబ్బు చేసింది. పరీక్షల రిపోర్టు వచ్చింది. కానీ అదేంటో అర్థం కావటం లేదు. ఎటూ తేల్చుకోలేక పోతున్నారనుకోండి. రిపోర్టును ఫొటో తీసి అప్‌లోడ్ చేస్తే చాలు.. మనకు తెలిసిన భారతీయ భాషల్లో తేలికగా అది అర్థమయ్యేలా వివరిస్తుంది.

ఇలా వైద్య పరంగా సహాయం తీసుకోవడానికి ముంబైకి చెందిన ఫ్రాక్టల్ సంస్థ రూపొందించిన వైద్య.ఏఐ (https://vaidya.ai)ని ఉచితంగానే వాడుకోవచ్చు. ఇది వెబ్‌సైట్, యాప్‌లో అందుబాటులో ఉంది. ప్రధాన భారతీయ భాషల్లో ఇంటరాక్ట్ కావొచ్చు. మందులు, ఫుడ్ లేబుళ్లు, పోషకాలు వంటి రకరకాల సమాచారాన్ని తేలికగా అర్థమయ్యేలా, సమంజసమైన పద్ధతిలో అందిస్తుంది. స్కాన్, ఎక్స్ రే, పరీక్షల



రిపోర్టులను అర్థం చేసుకోవటానికి తోడ్పడుతుంది. తెలుసుకున్న సమాచారం ఆధారంగా డాక్టర్‌తో మరింత బాగా చర్చించేలా దోహదం చేస్తుంది. డాక్టర్లు ఇచ్చే సూచనలను తేలికగా పాటించటంలో తోడుంటుంది.

**'సాగు'తున్న ఆధునిక వ్యవసాయం**

వ్యవసాయ కూలీలు దొరకడం లేదని కొందరు రైతులు వాపోతుంటారు. వ్యవసాయ కూలీలు దొరకడం లేదని కొందరు రైతులు వాపోతుంటారు. దీనికి కూడా పరిష్కారం చూపిస్తోంది ఏఐ. మనిషి అవసరం లేకుండా యంత్రాలు భూమిని చదును చేస్తున్నాయి.. దున్నుతున్నాయి.. నాట్లు వేస్తున్నాయి.. నీళు పెడుతున్నాయి. కలుపు తీస్తున్నాయి.. ఎరువులు వేస్తున్నాయి.. పంట ఎదుగుదలను పరిశీలిస్తున్నాయి.. చీడపీడలను గుర్తిస్తున్నాయి.. క్రిమిసంహారకాలు చల్లుతున్నాయి.. కోతలు కోస్తున్నాయి.. ఇప్పటికే అమెరికా, చైనా, జపాన్, ఇజ్రాయెల్ వంటి దేశాల్లో వ్యవసాయంలో కొత్త టెక్నాలజీ వాడుతున్నారు. కంప్యూటర్ అంటే ఏమిటో తెలియని రైతుకీ ఆధునిక సాంకేతిక సేవల్ని అందించడం ఏఐతో సాధ్యమైంది. మన దేశంలోనూ ఏఐ టెక్నాలజీతో అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఈ మేరకు హైదరాబాద్‌లోని జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ(ఎన్ఐఆర్డీ)లోని 'సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్'కు ఏఐ ఆధారిత ప్రాజెక్టుల రూపకల్పన, అమలు, విస్తరణ బాధ్యతలను అప్పగించింది.

అభివృద్ధి చెందిన పలు దేశాల్లో అన్ని రంగాల్లో కృత్రిమ మేధను వాడుతున్నారు. ప్రకృతి విపత్తులపై రైతులను ముందుగానే అప్రమత్తం చేయడం.. కాలానికి తగిన పంటల సాగు, ఎరువులు, పురుగు మందుల వాడకంలోనూ ఈ సాంకేతికతను వినియోగిస్తున్నారు. అల్గరిదం వాడకం వల్ల కచ్చితమైన విశ్లేషణ లభిస్తుంది. మెషిన్ లెర్నింగ్‌తో పంటల నుంచి కలుపు మొక్కలను తొలగించడానికి ఆకుల పరిమాణం, ఆకారం, రంగును కంప్యూటర్ విజన్ విశ్లేషిస్తుంది, అవసరమయ్యే సలహాలిస్తుంది. ఆస్ట్రేలియా లాంటి దేశాల్లో విశాలమైన మైదానాల్లో మేతకు వెళ్లే పశువులకు వాటి చెవుల వెనకాల అగ్గిపెట్టె సైజు పరికరం

అమర్చి ఉంటుంది. సౌరశక్తితో పనిచేసే ఆ పరికరం ఆధారంగా పశువు ఎక్కడ ఉంది, ఏ పరిస్థితిలో ఉంది, ఎలాంటి మేత తిన్నదీ తదితర సమాచారాన్నంతా యజమాని ఇంటి దగ్గర నుంచే గమనించగలుగుతాడు.

**కాలం చేసిన వాళ్ల పలకరింపులు!**

కాలం చేసిన ఆత్మీయులు పైలోకం నుంచి వచ్చి.. భూలోకంలో జరుగుతున్న పెళ్లిలో సందడి చేసి.. వధూవరులను ఆశీర్వదిస్తే ఎలా ఉంటుంది?! అయిన వారితో కలిసి వారు భోజనం చేస్తే.. ఈ ఊహ ఎంతో ఆనందంగా ఉంది కదూ.. సరిగ్గా అలాంటి ఊహలను నిజంచేస్తోంది ఏఐ. అలాంటి వీడియోలను ఏఐ సహాయంతో రూపొందించి.. వేడుకల్లో ప్రదర్శించి అతిథులను ఆశ్చర్యపరచడం కొత్త ట్రెండ్. ఇంట్లో మొదటి శుభకార్యం చేస్తున్న సమయంలో, కొత్త జంటలు పెళ్లి రోజు వేడుకల్లో, అభిమానించే వ్యక్తుల పుట్టిన రోజు వేడుకల్లోనూ ఈ వీడియోలను ప్రదర్శిస్తూ కుటుంబసభ్యుల హావభావాలను, భావోద్వేగాలను వీడియోలో బంధిస్తున్నారు. ఆయా వ్యక్తుల రూపంతో పాటు, స్వరాన్నీ సాంకేతికత ద్వారా అభివృద్ధి చేసి.. మాట్లాడుతున్నట్టు, ఆశీర్వదిస్తున్నట్లు భావన కల్పిస్తున్నారు. వీటిని వీఆర్ హెడ్‌సెట్‌లో చూడొచ్చు, ప్రత్యేక ఎల్ఈడీ తెరలపై ప్రదర్శిస్తున్నారు.

ఇటీవల ఓ వ్యక్తి పుట్టిన రోజు వేడుకల్లో ఏఐ వీడియో ప్రదర్శించడంతో కొన్నేళ్ల క్రితం చనిపోయిన వాళ్ల నాన్న.. కృత్రిమంగా వీడియోలో ప్రత్యక్షం కావడంతో ఆయన ఆనందానికి అవధుల్లేవు. జీవితంలో మరుపురాని బహుమతి అంటూ కంటతడి పెట్టుకున్నారు.

**ఎలాన్ మస్క్.. ప్రపంచానికే గేమ్ ఛేంజర్!**

ఎలాన్ మస్క్ తన భవిష్యత్ ప్రాజెక్టులు గురించి ఎప్పుడూ ఆసక్తికరమైన ఆలోచనలతో ముందుకు వస్తుంటాడు. ఆయన టెక్నాలజీ, ఇన్నోవేషన్ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చే పనులు చేస్తూ ఉంటారు. స్పేస్ ఎక్స్ ద్వారా అంతరిక్షంలోకి ప్రయాణం, టెస్లా ద్వారా ఎలక్ట్రిక్ కార్ల తయారీ, సోషల్ మీడియాలో ఎక్స్.. ఇలా అనేక రంగాల్లో మస్క్ ఆయన మార్క్ చూపిస్తున్నాడు. ఆయన భవిష్యత్ ప్రాజెక్టులు వింటే ఆశ్చర్యం కలగకమానదు.

మార్స్‌ను 90 రోజుల్లో చేరుకోవచ్చు!

అసాధ్యాలను సుసాధ్యం చేస్తూ అందరినీ ఆశ్చర్యపరిచే అపర కుబేరుడు ఎలాన్ మస్క్ సెన్సేషనల్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. భూమి నుంచి అంగారక గ్రహానికి చేరుకునే సమయాన్ని తగ్గించాలని ఆయన లక్ష్యంగా పెట్టుకున్నారు. సాధారణంగా మార్స్‌కు చేరుకునేందుకు ఆరు నుంచి 9 నెలల సమయం పడుతుంది. అయితే, సరైన సాంకేతికతతో ఈ వ్యవధిని 90 రోజులకు తగ్గించవచ్చని మస్క్ చెబుతున్నారు.

ఫోన్‌కు చార్జింగ్, ఇంటర్నెట్ అవసరం లేదు!

టెస్లా ఫోన్ గురించి ఎలాన్ మస్క్ అధికారికంగా ప్రకటించలేదు, కానీ ఆ ప్రాజెక్టు ఇతర స్మార్ట్‌ఫోన్లకు భిన్నంగా ఉండే అవకాశముంది. టెస్లా స్మార్ట ఫోన్‌కు ఇంటర్నెట్ అవసరం లేదు. స్పేస్‌ఎక్స్ ఉపగ్రహంతో నేరుగా ఇది పనిచేస్తుందట. సోలార్ ఎనర్జీ ద్వారా ఆటోమెటిక్ గా ఛార్జ్ అవుతుంది అనే ప్రచారం జరుగుతోంది. టెస్లా స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేస్తున్నట్లు గతంలో చాలా పుకార్లు వచ్చాయి. వాటిలో ముఖ్యమైనది టెస్లా ఫోన్‌కు విద్యుత్ అవసరం లేకుండా సౌరశక్తితో ఛార్జ్ చేయవచ్చని బాగా ప్రచారం జరిగింది.

**ఏ దేశానికైనా అరగంటలో వెళ్లొచ్చు!**

అమెరికాకు వెళ్లాలంటే దాదాపు 18 గంటలు ఫ్లైట్ లో ట్రావెల్ చేయాలి. ఇక్కడి నుంచి దుబాయ్ కు, అక్కడి నుంచి అమెరికాకు.. యూఎస్ ప్రయాణం అంటేనే పెద్ద పని. అదే అమెరికాకు ఓ సీరియస్ చూసే టైమ్ లోనే వెళ్లిపోతే.. కేవలం 40 నిమిషాల్లో అక్కడ అడుగుపెడితే.. అంటే అన్నారు కానీ, అసలా ఊహే ఎంతో అందంగా ఉందని అనుకుంటున్నారు కదా. ఇదే నిజం చేస్తానంటున్నారు మస్క్. అమెరికా శాన్ ఫ్రాన్సిస్ కో నుంచి ఢిల్లీకి 40 నిమిషాల్లో జనాలను డ్రాప్ చేస్తానంటున్నారు. స్పేస్ ఎక్స్



ద్వారా ప్రయాణ మార్గాన్ని సులభతరం చేయడం, తక్కువ టైమ్ లో ఎక్కువ దూరం ట్రావెల్ చేసేలా ఎలాన్ మస్క్ ఓ ప్రాజెక్ట్ ను తీసుకురాబోతున్నారు.

**ప్రతి విలేజ్‌లో హై-స్పీడ్ ఇంటర్నెట్!**

స్టార్‌లింక్ ద్వారా ఎలాన్ మస్క్ ప్రపంచంలోని ప్రతి మూలకు హై-స్పీడ్ ఇంటర్నెట్ అందించాలనుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాలు, అభివృద్ధి చెందని దేశాల్లో ఇది విప్లవాత్మక మార్పులను తీసుకురాగలదు.

కంప్యూటర్లతో మెదడు అనుసంధానం!

న్యూరాలింక్ ప్రాజెక్ట్ ద్వారా మానవ మెదడుకు డైరెక్ట్‌గా చిప్ కూర్చి, మెదడును కంప్యూటర్లతో అనుసంధానం చేయాలనే ఆలోచన ఉంది. దీనివల్ల న్యూరాలజికల్ డిసార్డర్స్‌కు చికిత్స అందించడంతో పాటు, మనసును కంప్యూటర్ల ద్వారా కంట్రోల్ చేయడం సాధ్యమవుతుంది.

**మార్స్ కాలనీ!**


స్పేస్‌ఎక్స్ ద్వారా ఎలాన్ మస్క్ భవిష్యత్తులో మానవాళిని మార్స్ పై స్థిరపడే ప్రయత్నం చేస్తున్నారు. ఆయన లక్ష్యం 2050 కల్లా మార్స్‌పై ఆటోమేటిక్ కాలనీ స్థాపించడం. ఇది మానవాళి భవిష్యత్ కోసం ఒక కీలకమైన దశగా భావిస్తున్నారు.

ఆప్టిమస్ హ్యూమనాయిడ్ రోబోట్స్

ఎలాన్ మస్క్ టెస్లా ద్వారా ఆప్టిమస్ హ్యూమనాయిడ్ రోబోట్స్‌ను రూపొందిస్తున్నారు. వీటిని భవిష్యత్తులో ఇంటి పనులు, పరిశ్రమలలో సహాయక పనులు చేయడంలో వినియోగిస్తారు. ఈ రోబోట్స్ సాధారణ వ్యక్తుల ధర పరిధిలో ఉండేలా టెస్లా ప్రణాళికలు రూపొందిస్తోంది.

**సినిమా తీయొచ్చు!**

ఒక సినిమా తీయాలంటే 24 శాఖలు పని చేయాలి. కనీసంగా కొన్ని వందల మంది పని చేయాలి. సినిమా పూర్తి చేసేందుకు సాధారణంగా 3 నెలల నుంచి ఏడాదిన్నర వరకు సమయం కూడా పట్టవచ్చు. కానీ




కృత్రిమ మేధ ఎంట్రీ ఇస్తూ కొత్త 'సినిమా' చూపిస్తానంటోంది. మీరు అడగాలేగానీ సినిమా తీసి పెట్టలేనా అంటోంది. అవును నిజమే! సినిమా తీయాలనుకునే వారి అభిరుచులకు తగ్గ ఐడియా ఇస్తుంది. కథ, స్క్రీన్ ప్లే, మాటలు రాస్తుంది. మ్యూజిక్ అందిస్తుంది, పాట పాడుతుంది. గ్రాఫిక్స్, యానిమేషన్ కూడా రూపొందిస్తుంది. అంతేనా.. పాత్రదారులను సైతం మనం అనుకున్నట్టు రూపొందిస్తుంది! కథకు తగ్గట్టు యాక్షన్ చెబుతుంది. ఇంకేముంది ప్రతీ సీన్ మనం అనుకున్నట్టుగా తయారవుతుంది. చివరికి సినిమా విడుదలకు సిద్ధమవుతుంది! టెక్స్ట్ ప్రాంట్ ఇస్తే చాలు ఇవన్నీ సాధ్యమయ్యే రోజులివి. వందల కోట్ల రూపాయలతో తీసే సినిమాను కొన్ని లక్షల రూపాయల్లోనే పూర్తి చేసే రోజులు సమీప భవిష్యత్‌లో వచ్చినా ఆశ్చర్యపోనక్కర్లేదు!

నిప్పు.. విద్యుత్తు.. ఎలాగైతే మానవజాతి అభివృద్ధిని కీలక మలుపులు తిప్పాయో అలాగే కృత్రిమమేధ కూడానంటారు గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్. మనిషీ యంత్రమూ చేయీ చేయీ కలిపి ఆడుతూ పాడుతూ పనిచేసే రోజులు వచ్చేశాయంటారాయన.

కృత్రిమమేధ సాయంతో యంత్రాలు ఇప్పుడు చదవగలవు, రాయగలవు, మాట్లాడగలవు... మనిషి చేసే ఎన్నో పనుల్ని అవి చేయగలుగుతున్నాయి కాబట్టి వాటికి ఆ పనులు అప్పజెప్పి మనుషులు అంతకన్నా పై స్థాయిలో... సృజనాత్మకత, ఎమోషనల్ ఇంటెలిజెన్స్ అవసరమైన పనులు చేసుకోవాలన్నది నిపుణుల సూచన. అంటే, ఇక ముందు ఏఐ అన్ని రంగాల్లోనూ మనకి కుడి భుజంగా మారనుందన్న మాట!



**-స్వామి ముద్దం**
**సీఈవో, బ్రేకింగ్ నౌ న్యూస్ యాప్.**
**మీడియాబాస్ నెట్‌వర్క్.**



# మన మనసుకూ రీఛార్జ్ అవసరమే!...

ఇతరుల కోసం ముందుగా వ్యక్తి గతంలో కొన్నింటిని త్యాగం చేయక తప్పదు. మరి కొన్ని సార్లు వ్యక్తి గతాన్ని విస్మరించడం తప్పనిసరి అవుతుంది. జీవితం ఎవరిదైనా ఒక్కటే.. ఇంకొకరి కోసం అమూల్యమైన దానిని వొదులుకోకూడదు. వ్యక్తిగతంగా ఎవరికి వారు గౌరవించుకోవాలి. మన అవసరాలను పట్టించుకోవాలి. శక్తిని సమకూర్చుకోవాలి. ముందుగా విజేతగా మనల్ని మనం గౌరవించడం నేర్చుకోవాలి. చాలా సార్లు మనం శ్రద్ధ వహించడానికి అవకాశం కలుగుతూ వుంటుంది. కానీ ఆ విషయాన్ని చాలా మటుకు మనం గుర్తించం. మనం చేసే పనుల ఒత్తిడి వలన అంతర్గత గొంతులను నొక్కేస్తున్నాము. కానీ ఏదో ఒక రోజు ఒక్కసారైనా ఎవరికి వారు ప్రశ్నించుకోవాలి. రోజులన్నీ ప్రవాహంలా పనులతో సాగరంలా సాగిపోతున్నపుడు మనం 'రిలీఫ్' అన్న పదాన్ని మరచిపోవడం అవుతుంది. అందుకే శరీరానికి కొంత విశ్రాంతి సమయం కేటాయించాలి.

మనలో ఉన్న శక్తి సన్నగిల్లిపోతుందంటూ అని అనుకుంటే రీఛార్జ్ అవ్వాల్సిన అవసరాన్ని గుర్తుంచుకోవాలి. మనం అలా చేయకపోతే.. చివరి జీవిత దశలో చాలా బాధపడాల్సి వస్తుంది అనే విషయం గుర్తుపెట్టుకోవాలి. మనం అనుకున్న పనిని ఆసక్తిగా చేయకపోతే ఫలితాలు విరుద్ధంగా వస్తాయి. అందుకే శరీరానికి, మనసుకు పూర్తి శక్తి సన్నగిల్లకముందే రీఛార్జ్ చేసుకోవాలి. మనం ఎప్పుడైతే ప్రకృతిని ప్రేమించడం మొదలు పెడుతామో మనలో ఒక కొత్త శక్తి పునాది అవుతుంది. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఈ ప్రకృతిని రక్షించుకోవాలి. లేదంటే పుడమి తన ప్రభంజనంతో జీవనం సాగిస్తున్న సమాజాన్ని ధ్వంసం చేస్తుంది. మన భావాలను, మనల్ని గౌరవించే వారితో, ఆనందాన్ని ఉత్సాహాన్ని ఇచ్చే మిత్రులతో సంతోషంగా ఉంటాము. మన మనసు కూడా కొత్త శక్తిని పుంజుకుంటుంది. ఎవరైనా అనవసర పుకార్లు ప్రచారం చేస్తుంటే మౌనంగా భరించవద్దు. వారి నోటికి అడ్డుకట్ట వేసేందుకు ప్రయత్నించాలి. ఎవరిని కూడా పేరుపెట్టి విమర్శిస్తూ వ్యాఖ్యానిస్తూ అబద్ధాలు చెబుతూ వారిని నొప్పించవద్దు. ఎదుటి వారు చేసిన మాటలపై దృష్టిసారిస్తూ మనం మాట్లాడాలి. నిజంగా ఏమైనా అపార్ధలుంటే వాటిని వెంటనే క్లియర్ చేసుకోవాలి. అప్పుడే వ్యక్తిగత గౌరవం బద్రత లభిస్తుంది. జీవిత అనుభవము ద్వారా ప్రతి ఒక్కరికీ జ్ఞానం అలంకారం అవుతుంది. దీని నుండి ఇతరులకు సహాయపడే తత్వం ఉండాలి. అప్పుడే ఇతరులు వారి యొక్క హృదయంలో సముచిత స్థానం ఇస్తారు... మనకు విలువనిస్తారు...!!



**– పోరండ్ల నరసింహరాములు**
**సీనియర్ అడ్వకేట్, హనుమకొండ జిల్లా.**



# కుప్పలు తెప్పలుగా ప్లాస్టిక్ బాటిల్స్ వినియోగం

అనేక ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ముంబైలో ప్లాస్టిక్ బాటిళ్ల వినియోగం తగ్గడం లేదు. వాటర్ బాటిళ్లు, ఆయిల్ బాటిళ్లు, ఫినాయిల్, బాత్రూంలు శుభ్రంచేసే యాసిడ్, ఇతర రసాయనాల బాటిళ్ల వినియోగం విచ్చల విడిగా జరుగుతోంది. వివిధ అవసరాలకు వాడి పారేస్తున్న ప్లాస్టిక్ బాటిళ్లవల్ల పర్యావరణానికీ హాని జరుగుతోంది. 2023తో పోలిస్తే 2024లో ప్లాస్టిక్ బాటిళ్ల వినియోగం విపరీతంగా పెరిగినట్లు తెలుస్తోంది. 2023లో 67 లక్షల కేజీల ప్లాస్టిక్ బాటిళ్ల వినియోగం జరగ్గా అదే 2024లో ఏకంగా 1,42,23,000 కేజీలకు చేరుకుంది. దీన్ని బట్టి రెట్టింపునకుపైగా ప్లాస్టిక్ వినియోగం జరిగినట్లు స్పష్ట మవుతోంది.

**వన్ టైం యూజ్ బాటిళ్లే ఎక్కువ**

ముంబైలోని వివిధ చెత్త కుండీలలో లభించిన ప్లాస్టిక్ బాటిళ్లను బట్టి ఇందులో అధికంగా ఒకసారి వినియోగించే (వన్ టైం యూజ్) బాటళ్లే అధికంగా ఉన్నాయి. ఆ తర్వాత స్థానంలో వివిధ రకాల ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, తినుబండారాల పార్శిల్ ప్యాకింగులు ఉన్నాయి. ఒకప్పుడు గల్లీలలో, ఫూట్‌పాత్‌లపై, రోడ్ల పక్కన, ఖాళీ మైదానాలలో బీఎంసీ ఏర్పాటుచేసిన కుండీలలో చెత్త అధికంగా కనిపించేది. కానీ ఇప్పుడు అదే చెత్త కుండీలలో ప్లాస్టిక్ బాటిళ్లు, క్యారీ బ్యాగులు అధికంగా కనిపిస్తున్నాయి. ఇలా చెత్త కుండీలలో లభించిన ప్లాస్టిక్ బాటిళ్లను నిర్వీర్యంచేసి మళ్లీ కొత్తగా తయారుచేయడానికి వీలున్న బాటిళ్లను బీఎంసీ పారిశుద్ధ్యం విభాగం సిబ్బంది పోగు చేస్తున్నారు. బాటిళ్లతోపాటు భోజనం చేసే ప్లేట్లు, నీటి గ్లాస్‌లు, స్పూన్లు, పార్శిల్ కంటైనర్లు, స్ట్రాలు, కప్‌లు, సంచులు కూడా ఉన్నాయి. ఇవి కూడా ఏ మాత్రం తగ్గలేదు. 2023లో నిర్వీర్యం చేసి మళ్లీ వినియోగించే వీలున్న 85-90 లక్షల కేజీల ప్లాస్టిక్ సామగ్రి లభించగా అదే 2024లో 96.6 లక్షల కేజీల ప్లాస్టిక్ సామగ్రి లభించింది. అదే 2022లో 67,12,557 కేజీల ప్లాస్టిక్ సామగ్రి లభించింది.

**రోజూ 7, 8 వేల మెట్రిక్ టన్నుల చెత్త**

ముంబైలో ప్రస్తుతం చెత్త నిర్వీర్యం చేసే 48 కేంద్రాలు పని చేస్తున్నాయి. ముంబైలో రోజూ 7?8 వేల మెట్రిక్ టన్నుల చెత్త పోగవుతోంది. పొడి చెత్తలో ప్లాస్టిక్ బాటిళ్లు, ప్లాస్టిక్ వస్తువులు, పేపర్లు, కార్డు బోర్డులు, థర్మకోల్, పుట్ట బాక్స్‌లు, గాజు బాటిళ్లు, పాత దుస్తులు, ఈచెత్త ఉంటున్నాయి. 2024లో 6,15,513 కేజీల ఈచెత్త పోగుచేశారు. ఇందులో థర్మకోల్ కూడా అధికంగా ఉంది. ఇదిలాఉండగా 2005 జూలై 26వ తేదీన ముంబైలో వచ్చిన వరదల్లో 200 మందికి పైగా మంది ప్రాణాలు కోల్పోగా కొన్ని వేల కోట్ల రూపాయల ఆస్తి నష్టం జరిగింది. అప్పట్లో వరదలకు ప్రధాన కారణం ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల వినియోగమేనని తేలింది. దీంతో తేరుకున్న బీఎంసీ 50 మైక్రాన్లకంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల వినియోగంపై నిషేధం విధించింది. ఆ తరువాత 50 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు తయారుచేసే కంపెనీలపై, నిల్వచేసే గోడౌన్లపై, విక్రయించే వ్యాపారులపై వినియోగదారులపై చర్యలు తీసుకోవడం ప్రారంభించింది.





# ఆభరణాల క్రియేటివిటీ వెనుక ఇంట్రస్టింగ్ స్టోరీ ఇదే..!

ఆభరణం అంటే మగువల అందాన్ని పెంచడానికి విభిన్న సృజనాత్మక రూపాల్లో తయారు చేయడమే. ఈ విషయం అందరికీ తెలిసిన విషయమే. అయితే ఇటీవల కాలంలో ఆభరణాల ప్రపంచంలో ఒక కొత్త ధోరణి చెలామణి అవుతోంది. 'థీమ్ ఆధారిత ఆభరణాలు' అనే ఈ ట్రెండ్ ప్రస్తుతం దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకుంటోంది. హైదరాబాద్ నగరంలో కూడా ఇది విస్తృతంగా ఆదరణ పొందుతోంది. ముఖ్యంగా ప్రకృతి, ఋతువుల సౌందర్యానికి ప్రతిగా రూపొందించిన ఆభరణాలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ప్రముఖ ఆభరణ బ్రాండ్లు ఈ కొత్త ధోరణిని స్వీకరించి, ప్రతి ఆభరణంలోనూ ప్రకృతి సౌందర్యాన్ని బంధించే ప్రయత్నం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కొన్ని బ్రాండ్‌లు ప్రత్యేకంగా రూపొందించిన కళాఖండాలు, కశ్మీర్ ఋతువుల మాయాజాలాన్ని ప్రతిబింబిస్తూ మార్కెట్‌లోకి వస్తున్నాయి. అది బంగారమా, వజ్రమా అనే తేడా లేకుండా వ్యాపార విలువతో పాటు ఆభరణంలోని థీమ్‌ను, వైవిధ్యాన్ని, వినూతనత్వాన్ని ఆస్వాదిస్తున్నారు నగరవాసులు.

ఆభరణాల తయారీలోని హస్తకళ వైవిధ్యానికి థీమ్ ఆధారిత జ్యువెలరీ మరింత హంగులను అద్దుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో ట్రెండింగ్‌లో ఉన్న కొన్ని ఆభరణ సౌందర్యాలు. ఋతువుల కవిత్వం తాకిన కళ.. 'ఈ లోయ గుండా నడిచిన ప్రతిసారీ, ఋతువులు తమ పాటలు పాడతాయి' అనే భావనతో ఒక కవిత్వ సృష్టిలాంటి ఆభరణాలు అలరిస్తున్నాయి. చినార్ ఆకుల నృత్యం నుంచి మంచుతో కప్పబడిన పైన్ చెట్ల పరవశం వరకూ ప్రతి ఆభరణం ప్రకృతి గాథను చెబుతోంది. శరదృతువులో చినార్ ఆకులు గాలిలో ఊగే తీరు, తెల్లటి మంచుతో అలంకరించిన దృశ్యాలను ప్రతిబింబించే చెవిపోగులు, లాకెట్లు, రౌండ్ కట్‌లో తెల్ల వజ్రాలతో తయారైన కశ్మీర్ శీతాకాలపు నిర్మలత్వాన్ని ప్రతిబింబిస్తున్నాయి.

**ప్రకృతిని ధరించే సోయగాలు**

ఈ కొత్త థీమ్ ఆధారిత ఆభరణాలు ప్రకృతిని మించిన అందాలుగా అందుబాటులోకి వస్తున్నాయి. ఋతువుల స్వభావాన్ని, కశ్మీర్ వంటి సుందర ప్రదేశాలను ప్రతిబింబించేలా తయారు చేస్తున్న ఆభరణాలు నగరవాసులను ఆకర్షిస్తున్నాయి. అధునాతన సంప్రదాయానికి వినూతనత్వాన్ని జోడిస్తున్న ఈ కళాఖండాలు ప్రస్తుత జీవన శైలి, ఫ్యాషన్ ప్రపంచానికి ప్రకృతితో కూడిన కొత్త పంథాను పరిచయం చేస్తున్నాయి. శీతాకాలపు అందాల్లో మునిగిపోయిన పైన్ చెట్లు, కిరణాలపై మెరిసే వజ్రాలను ప్రతిబింబిస్తూ రూపొందించిన నెక్లెస్‌లు, చెవిపోగులు శీతాకాలపు సౌందర్యానికి నిదర్శనంగా తయారు చేస్తున్నారు. నెమ్మదిగా వెలిసే శీతాకాలం మొదలు వికసించే వసంతానికి మధ్య మార్పును చూపించే ఆభరణాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

**వసంతపు వర్ణ విహారం**

వసంత ఋతువులో కశ్మీర్ లోయను అలంకరించే తులిప్ పువ్వుల కాంతిని పసుపు వజ్రాలు, గులాబీ క్వార్ట్జ రత్నాలతో తయారు చేసినట్టుగా ప్రతిబింబిస్తున్నాయి. తులిప్ పువ్వుల వర్ణాలను దృశ్యాన్ని చేస్తున్నట్లుగా చెవిపోగులు, నెక్లెస్‌లు ప్రతి రూపంలో ప్రకృతి ఉత్సాహాన్ని తీసుకొస్తున్నాయి.

**సృష్టి కథను ఆభరణాల్లో వర్ణిస్తూ..**

'ఇప్పటికీ మిగిలి ఉన్న స్వర్గం' అనే భావన ఆధారంగా రూపొందించిన ఈ కొన్ని కలెక్షన్ కశ్మీర్ లోయల శాశ్వత అందాన్ని మిళితం చేస్తూ అందమైన కథగా చెబుతున్నాయి. బంగారం పై తయారు చేసిన చినార్ ఆకులు, వజ్రాల కాంతిలో మెరిసే తులిప్ పువ్వులు, కాలానికి అర్థం చెప్పకనే చెబుతున్నాయి.

**మై ఎంబ్రేస్ మగువల ఆలోచనలు**

ప్రస్తుత తరుణంలో ఆభరణాలను అందం కోసమే కాకుండా ఒక కళాత్మక జీవనానికి నిదర్శనంగా ధరిస్తున్నారు మగువలు. దీనికి అనుగుణంగానే ఆభరణాల తయారీ కూడా కొత్త పుంతలు తొక్కుతోంది. ఇందులో భాగంగానే జోయా ఆధ్వర్యంలో మై ఎంబ్రేస్ అనే థీమ్‌తో సాధారణంగా మహిళలు జీవితంలో ఎన్ని పాత్రలు పోషించినా, వారి జీవితానికి పరమార్థంగా 'తనను తాను ఆలింగనం చేసుకునేలా' అందమైన జ్యువెలరీ రూపొందించాం. మగువ ఆలోచనలు, ఆనందాలు సార్థకం అయ్యేలా తనకు తాను ప్రాధాన్యత ఇచ్చుకునేలా సృష్టించిన ఈ ఆభరణాలు నగరంలోని జ్యువెల్ లవర్స్‌ను ఆకర్షిస్తున్నాయి.

# పేరెంట్స్ 'నో' చెప్పడం నేర్చుకోవాలి..! హెచ్చరిస్తున్న నిపుణులు

పేరెంటింగ్ నియమాలు తరానికీ తరానికీ మారుతున్నాయి. కొత్త తరం పేరెంటింగ్‌లో చాలా ఫ్లెక్సిబుల్‌గా, ఎంపతీతో ఉంటోంది. పిల్లలతో చాలా దృఢమైన బంధాన్ని కోరుకుంటోంది. పిల్లల ఎమోషనల్ వెల్ బీయింగ్ కోసం ఎటువంటి భయాలూ, బిడియాలూ లేకుండా తాము అనుకున్నది ధైర్యంగా కమ్యూనికేట్ చేయడాన్ని ప్రోత్సహిస్తున్నారు. పిల్లల స్వేచ్ఛను ప్రోత్సహిస్తున్నారు. మొత్తంగా చెప్పాలంటే రోల్‌మోడల్ పేరెంటింగ్ రూల్ పాటించాలనుకుంటున్నారు. యాభై ఏళ్ల కిందట పేరెంటింగ్‌లో క్రమశిక్షణ అనే పదం వీర విహారం చేసేది.

నాన్న ఇంట్లో ఉంటే పిల్లల అల్లరి వినిపించకూడదు, పుస్తకం పట్టుకుని కనిపించాలి. నాన్న ప్రశ్నిస్తే వినయంగా సమాధానం చెప్పాలి.

నాన్న ఎదుట పడాలంటే భయం. ఈ చట్రంలో పెరిగిన తరం, ఆ తర్వాతి తరం ఇప్పుడు పేరెంట్స్ అయ్యారు. ఈ జెన్ జెడ్ పేరెంట్స్ తమ పిల్లల విషయంలో భౌతికపరమైన క్రమశిక్షణ పాటించడం కంటే తల్లిదండ్రుల మాట మీద విశ్వాసం, అర్థం చేసుకోవడం దిశగా ప్రోత్సహిస్తున్నారు. ఎమోషనల్ ఇంటలిజెన్స్‌కి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు.

**ఇంటి నిండా బొమ్మలే!**

జెన్ జెడ్ పేరెంట్స్ తమ బాల్యంలో ఎదురైన సంఘటనలను బేరీజు వేసుకుంటూ ఎలా ఉండాలో, ఎలా ఉండకూడదోననే నియమావళిని రూపొందించుకుంటున్నారు. బాల్యంలో తాము నొచ్చుకున్న సందర్భాలన్నింటినీ గుర్తు చేసుకుంటూ పిల్లల మనసు గాయపరచకూడదనే నియమాన్ని పాటిస్తున్నారు. ఇందులో విపరీతమైన



షాపింగ్ ఒకటి. గత తరం పేరెంట్స్ చేతిలో డబ్బు పరిమితంగా ఉండేది. ఇప్పుడు డబ్బు పుష్కలంగా అందుతోంది. రోజువారీ శ్రామికుల కుటుంబాలు కూడా తమ రాబడిలో ఎక్కువ భాగాన్ని సరదాలకు ఖర్చుపెడుతున్నాయి. అప్పట్లో ఏడాదికో రెండేళ్లకో ఒక బొమ్మ కొనిస్తే ఇప్పుడు ప్రతి ఇంట్లో పాతికముప్పై బొమ్మలకు తక్కువ కాకుండా షెల్ఫ్‌లు నిండిపోతున్నాయి.

పిల్లలు తమ భావోద్వేగాలను వ్యక్తం చేసే క్రమంలో 'నో' చెప్పడాన్ని ప్రోత్సహిస్తున్న జెన్ జెడ్ పేరెంటింగ్ పిల్లలకు తాము కూడా 'నో' చెప్పవచ్చనే సంగతి మర్చిపోతున్నారు. ఇక మగపిల్లలు ఏడవకూడదనే సామాజిక షరతును ప్రశ్నిస్తున్న మనస్తత్వ నిపుణులు 'మగపిల్లలను కూడా ఏడవనివ్వండి' అంటున్నారు. కాలం మారుతున్న క్రమంలో వస్తున్న మార్పులివన్నీ. 'మగపిల్లలను కూడా ఏడవనివ్వాలి, వారిలోని సున్నితత్వాన్ని పరిరక్షించాలి' అని చెబుతున్న న్యూజెనరేషన్ పేరెంటింగ్ దానిని అమలు చేయడంలో మాత్రం తార్కికతను కోల్పోతోందన్నారు ట్రాన్స్‌పర్సనల్ హోలిస్టిక్ కోచ్ అర్పితాగుప్త.

**సంతోష క్షణాలు!**

ఈ తరంలో దాదాపుగా అన్నీ న్యూక్లియర్ ఫ్యామిలీలే. పేరెంట్స్ కూడా తమ బిడ్డ ఆడుకోవడానికి అక్క,చెల్లి, అన్న, తమ్ముడు లేని బాల్యాన్ని మిగిల్చామని అర్థం చేసుకుంటున్నారు. తోబుట్టువులు లేని లోటు తీర్చడం కోసం పిల్లలతో తల్లులే కాదు తండ్రులు కూడా చక్కగా ఆడుకుంటున్నారు. వారిని ఆటల్లో ఎంగేజ్ చేయడానికి తగినంత సమయం కేటాయిస్తున్నారు.

వాళ్లు పెద్దయిన తర్వాత బాల్యాన్ని గుర్తు చేసుకుంటే తల్లిదండ్రులతో ఆడుకున్న తీపి జ్ఞాపకాలు గుర్తు వచ్చే విధంగా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అలాగే పిల్లల మెదళ్లలో విరిసిన ఆలోచనను చక్కగా వ్యక్తం చేయగలిగేటట్లు ప్రోత్సహిస్తున్నారు. పిల్లల ఆలోచనలను, ఆకాంక్షలను కొట్టిపారేయకుండా తగిన ప్రాధాన్యతనిస్తున్నారు. పిల్లల కెరీర్ విషయంలోనూ వారి అభిరుచులను సమాజం గిరిగీతలను పట్టించుకోకుండా స్వాగతిస్తున్నారు.

మొత్తంగా చూస్తే తమ బాల్యంలో తమకు కలలుగానే ఉండిపోయిన అన్నింటినీ తమ పిల్లలకు అందిస్తున్నారు. ఒక్క మాటలో చెపాలంటే పిల్లల బాల్యంలో తామను తాము ప్రతిక్షేపించుకుంటున్నారు. తమకు దక్కని

సంతోషాలను చాలా ఎక్కువగా అందించాలని తపన పడుతున్నారు. ఆదర్శవంతమైన పేరెంటింగ్‌కి ప్రతి రూపాలుగా ఉండాలని అభిలషిస్తున్నారు. ఆచరణలో ఒకింత సమతుల్యత, సమన్వయం అలవరుచుకుంటే జెన్ జెడ్ పేరెంటింగ్ రోల్ మోడల్ పేరెంటింగ్ అవుతుంది.

**ఓ ఆశ్చర్యకరమైన సంఘటన** అది మహారాష్ట్రలో ఓ పర్యాటక ప్రదేశం. నడిరోడ్డు మీద ట్రాఫిక్ స్తంభించియింది. ఏం జరిగిందో చూద్దామని కొందరు తమ వాహనాలు దిగి ముందుకెళ్లారు. అక్కడ ఓ యువకుడు, 30 ఏళ్లుంటాయి, తన కారును చూసుకుంటూ బిగ్గరగా ఏడుస్తున్నాడు. 'ఏమైంది' అని అడిగారెవరో. కారు మీద పడిన గీతలు చూపిస్తూ మళ్లీ భోరుమన్నాడతడు. అది అతడికిష్టమైన కారు, ముచ్చటపడి కొనుక్కున్న కారని చెప్పి వెక్కిళ్లు పెడుతున్నాడు. అతడి తల్లిదండ్రులు కారు లోపల ఉన్నారు. 'మా అబ్బాయి చాలా సున్నితమ నస్కుడండీ. తనకిష్టమైన కారుకి గీతలు పడితే భరించలేక తున్నాడు' అన్నారు వాళ్లు సమర్థింపుగా. మగవాళ్లు ఏడవకూడదని బాల్యంలోనే మైండ్‌ని కండిషన్ చేసే పెంపకం ఒకప్పటిది. ఎమోషన్స్‌నకి లింగభేదం ఉంటుందా అని ఏడుపు వచ్చినప్పుడు అన్ కండిషనల్‌గా ఆ ఎమోషన్‌ని వ్యక్తం చేయవచ్చనే వాదన నేటిది. అయితే పైన చెప్పుకున్న కండిషన్‌లో ఆ కుర్రాడి కారణంగా ఇతరులు ఇబ్బంది పడకుండా ఉండాలంటే ఏం చేయాలి? ట్రాఫిక్‌లో ఇబ్బంది పడుతున్న వాళ్లు కూడా ఎమోషన్స్‌ని ఆపుకోలేక కోపాన్ని ప్రదర్శిస్తే పరిస్థితి విషమిస్తుంది. పరిణతి చెందిన వాళ్లం కొంతమందిమి కలగచేసుకుని 'కారు పక్కకు తీసుకుని, ఎమోషన్ కంట్రోల్ అయిన తర్వాత ప్రయాణాన్ని కొనసాగించండి' అని సర్దిచెప్పి పరిస్థితిని చక్కదిద్దాల్సి వచ్చిందని చెబుతున్నారు అర్పితాగుప్తా, హోలిస్టిక్ కోచ్

## ఓపెన్ జిమ్: కసరత్తు. ఆరోగ్యం మా సొత్తు



జీవనశైలి మారింది. మారుతున్న కాలంతో పాటు జీవనంలో వేగం పెరిగింది. దీంతో అలసట, ఒత్తిడి అధికమైంది. ఆహార పానీయాలు తీసుకోవడంలో కూడా ఎన్నో మార్పులొచ్చాయి. దీంతో ఎన్నో వ్యాధుల బారిన పడాల్సిన పరిస్థితి. వాటిని అధిగమించడానికి వ్యాయామం తప్పనిసరైంది. అందుకు ఓపెన్ జిమ్‌లు ఎంతో ఉపయోగపడుతున్నాయి.

అక్కన్నపేట(హుస్నాబాద్): జిమ్‌లకు వెళ్లి వేలకు వేలు ఖర్చు చేయకుండా గ్రామాల్లోనే ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవతో దాదాపు అన్ని గ్రామాల్లో ఓపెన్ జిమ్‌లను నిర్మించారు. వాటి నిర్మాణానికి సుమారు రూ. 5లక్షలు కేటాయించారు. మండలంలో 31 గ్రామాలు ఉండగా ఇటీవల మరో ఆరు గ్రామాలు ఏర్పడ్డాయి. దీంతో ప్రస్తుతం మొత్తం 37 గ్రామాలు ఉన్నాయి.

అందులో సగానికిపైగా గ్రామాల్లో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేశారు. జిమ్‌లను ఉదయం, సాయంత్రం వినియోగించుకొంటున్నామని, ఆరోగ్యాన్ని కాపాడుకోడానికి ఎంతో ఉపయోగపడుతున్నాయని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిమ్‌ల ఏర్పాటు విషయంలో చొరవ తీసుకొన్న మంత్రి పొన్నంకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని స్థానికులు చెప్పారు.

### కొత్త అనుభూతి

బహిరంగ ప్రదేశాలలో ఏర్పాటు చేసిన జిమ్‌లలో కసరత్తు చేయడం కొత్త అనుభూతిని కలిగిస్తుందని పర్యావరణ వేత్తలు అంటున్నారు. ప్రైవేటు జిమ్‌లకు వెళ్లే స్తోమతలేని పేద, మధ్యతరగతి ప్రజలకు ఈ జిమ్‌లు ఎంతో ఉపయోగపడుతున్నాయి. ప్రతి రోజు వ్యాయామం చేయడంతో ఫిట్‌నెస్‌తో పాటు ఆరోగ్యం కూడా సొంతం చేసుకొంటున్నారు.



# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

నియంత్రణ లేకుండా సహజ వనరులను వినియోగించడం, విచ్చలవిడిగా ప్లాస్టిక్ వాడకం వెరసి నింగి, నీరు, నేల క్రమక్రమంగా కాలుష్య కాసారంగా మారుతున్నాయి. ఫలితంగా భూతాపం పెరుగుతుండటంతో వాతావరణంలో తీవ్రమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. పర్యావరణ ముప్పు ముంచుకొస్తున్నది. గతంతో పోల్చితే భూమి సగటు ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. భూమి సగటు ఉష్ణోగ్రతలు 1.5 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువ పెరిగితే తీవ్రమైన ప్రకృతి వైపరీత్యాలతో పాటు, భూమిపై మనిషి మనుగడకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఎదురవుతుందని ఐపీసీసీ నివేదికలతో పాటు శాస్త్రవేత్తలు నిత్యం మనల్ని హెచ్చరిస్తూనే ఉన్నారు. కానీ పౌరసమాజంలో మాత్రం ఆశించిన స్థాయిలో మార్పు రావడం లేదు. మనం వాడే వస్తువులలో చాలావాటిని రీసైకిల్ చేయవచ్చు. ప్లాస్టిక్, కాగితం, కాంక్రీట్, మానవ, జంతు, పశు, పక్షి వ్యర్థాలు ఇలా దేన్నైనా రీసైకిల్ చేసి వాటిని మరో అవసరానికి వినియోగించవచ్చు. కొన్ని రకాల ప్లాస్టిక్ వస్తువులు భూమిలో కలిసిపోయేందుకు కొన్ని వందల సంవత్సరాల సమయం పడుతుంది. అందుకే ప్లాస్టిక్ రీసైక్లింగ్, ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయాల కోసం విస్తృతస్థాయిలో పరిశోధనలు జరుగుతున్నాయి. ప్లాస్టిక్, ఎలక్ట్రానిక్ వ్యర్థాలను రీసైకిల్ చేయడం వల్ల గాలి, నేల, నీటి కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించవచ్చు.

ముంచుకొస్తున్న పర్యావరణ ముప్పు కారణంగా ఇప్పటికే జంతువులు, పక్షులు క్రమంగా అంతరిస్తున్నాయి. అడవులు తరుగుతున్నాయి. నివాస ప్రాంతాలు పెరుగుతున్నాయి. ఇటీవల అమెరికా మంచులో కూరుకుపోయింది. పాకిస్థాన్ వరదల్లో చిక్కింది. యూరప్ దేశాలను కరువు కాటేస్తున్నది. భారత్‌లోనూ అతివృష్టి, అనావృష్టి నిత్యకృత్యం అయ్యాయి. వీటిని ప్రజలు గుణపాఠంగా తీసుకోవాలి. ఈ భూగ్రహం కేవలం మనుషులది మాత్రమే కాదు, సమస్త జీవరాశులది అనే చైతన్యం తెచ్చుకోవాలి.

ఈ సమష్టి బాధ్యతలో భాగంగా, 'మేరీ లైఫ్ మేరా స్వచ్ఛ షహర్' నినాదంతో రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ (ఆర్ఆర్ఆర్) పేరుతో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మార్చి 20వ తేదీన వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. కార్పొరేషన్ పరిధిలోని ప్రజల వద్ద, ఇండ్లలో నిరుపయోగంగా ఉన్న వస్తువులను సేకరించడం, వాటిలో పనికొచ్చే వాటిని తిరిగి వినియోగించడం, అవసరం లేని వాటిని రీసైక్లింగ్ చేసి మరో అవసరానికి వాడాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్నాం.

**రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ ఉద్దేశం..**

రెడ్యూస్ అంటే చెత్తకుప్పల్లోకి చేరే వ్యర్థాలను తగ్గించుకోవడం. ఈ మేరకు మనం వినియోగిస్తున్న వాటిలో దేన్నైనా అవసరం ఉన్నంతవరకే వాడుకోవడం. దీనివల్ల ఆర్థికంగా లాభం చేకూరడంతోపాటు భూమిని కాపాడటంలో మన వంతు సా యం అందించినట్లవుతుంది. భూమ్మీద ఉన్న వారందరూ రాగల ప్రమాదాన్ని పూర్తిగా నివారించకలేకపోయినా, దాని తీవ్రతను తగ్గించవచ్చు. చెత్త తగ్గాలంటే.. ఒకసారి వాడి పారేసే వస్తువుల కంటే, మళ్లీమళ్లీ వాడుకోగల వస్తువులకు ఎక్కువ ప్రాధాన్యమివ్వాలి. అలాగే మనం వాడిన వాటిని మళ్లీ వాడుకోవటాన్ని (పునర్వినియోగాన్ని) రీయూజ్‌గా చెప్పవచ్చును. ఉదాహరణకు కొంతమంది బట్టలను, వాహనాలను కొద్ది రోజులు వాడి పక్కన పడేస్తారు. కానీ, వాటి అవసరం ఉన్నవాళ్లు ఈ సమాజంలో చాలా మంది ఉన్నారు. అలాగే ఇంట్లో మిగిలిన అన్నం పడేస్తారు. కానీ, ఆ అన్నం బయట చాలా మంది ఆకలి తీరుస్తుంది. పిల్లల చదువుల కోసం పుస్తకాలను కొంటారు. ఆ సంవత్సరం పూర్తవగానే ఆ పుస్తకాలను మూలన పడేయడమో, లేదా పేపర్లు కొనేవాళ్లకు అమ్మడమో చేస్తారు. కానీ, పుస్తకాలు కొనలేని పిల్లలకు వాటిని అందిస్తే ఎంతో మేలు జరుగుతుంది. పేదింటి పిల్లలు పెద్ద చదువులను తక్కువ ఖర్చుతో చదవడానికి పరోక్షంగా మనం సహకారం అందించినట్లు అవుతుంది.

వాడేసిన వస్తువుల రూపం, తీరుతెన్నులను రీసైక్లింగ్ ద్వారా మార్చి మరో అవసరానికి వాడుకోవడం వలన వ్యర్థానికి కొత్త అర్థం చెప్పినట్లు అవుతుంది. ముఖ్యంగా, మనుషుల రోజువారీ జీవితంలో ప్లాస్టిక్ వస్తువుల వినియోగమనేది విడదీయలేని భాగమై పోయింది. దేశంలో ప్రతి నిమిషం దాదాపు 12–15 లక్షల కొత్త




ప్లాస్టిక్ బ్యాగులను వినియోగిస్తున్నారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.

తక్కువ ఖర్చుతో పాటు, సులభంగా అన్ని అవసరాలకు ఉపయోగపడు తుండటంతో ప్లాస్టిక్ బ్యాగులపై ప్రజలు ఎక్కువగా ఆధారపడుతున్నారు. కానీ ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ వస్తువుల వాడకం వలన పర్యావరణ కాలుష్యం పెరగటమేగాక భూమిపైనున్న జీవరాశుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతున్నది. ఇప్పటికే యాభై మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న కవర్లు, వస్తువుల వినియోగంపై నిషేధం ఉంది. కానీ ప్రజల భాగస్వామ్యం, సహకారం లేని కారణంగా పూర్తిస్థాయిలో అమలు కావటం లేదు. వాడేసిన ప్లాస్టిక్‌ను రీ సైకిల్ చేయడం వలన కొత్త ఉత్పత్తి తగ్గుతుంది. మరోవైపు, చెడిపోయిన ఆహార పదార్థాలను సేంద్రియ ఎరువుల తయారీకి ఉపయోగించవచ్చు. ఎలక్ట్రానిక్ పరికరాలు, ఇనుప వస్తువులు మొదలైన వాటిని రీ సైకిల్ చేయడం వలన ఏదో ఒక రూపంలో వాటిని మళ్లీ వినియోగంలోకి తీసుకురాగలం.

**రీయూజ్ వస్తువుల కోసం..**

స్వచ్ఛభారత్ మిషన్–అర్బన్ 2.0లో భాగంగా కార్పొరేషన్ పరిధిలోని 26 వార్డులలో స్థానిక కార్పొరేటర్ల, కాలనీ వాసుల సహకారంతో రెడ్యూస్, రీయూజ్, రీ సైకిల్ (ఆర్ఆర్ఆర్) వస్తువుల సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేశాం. 15 రోజుల పాటు ఈ కేంద్రాలు కొనసాగుతాయి. ప్రజలు తమ సామాజిక బాధ్యతను గుర్తించి ఆర్ఆర్ఆర్‌ను ఆదరించడంతోపాటు ఇందులో భాగస్వామ్యం కావాలి. రీయూజ్ చేసే వస్తువుల కోసం కార్పొరేషన్ పరిధిలో ఔట్‌లెట్లను కూడా ఏర్పాటు చేస్తాం. అవసరం ఉన్న వాళ్లకు ఉచితంగానే వాటిని అందించడం జరుగుతుంది. పర్యావరణ పరిరక్షణ మహాయజ్ఞంలో అందరమూ భాగస్వాములం అవుదాం. భూమిని రక్షించుకుందాం.



# బుల్లెట్ రైలు వస్తోంది..

దేశీయ ప్రయాణికుల రవాణా వ్యవస్థలో వందే భారత్ రైలు ఒక పెద్ద ముందడుగు. సౌకర్యవంత ప్రయాణ అనుభూతికి ఈ రైలు ప్రసిద్ధి. గంటకు గరిష్ఠంగా 180 కిలోమీటర్ల వేగంతో కూడా ప్రయాణించగలదు. దీన్ని మించిన వేగంతో దూసుకుపోయే 'హై స్పీడ్ రైల్' కొద్దిరోజుల్లో పట్టాలెక్కనుంది. భారత ప్రభుత్వ ప్రతిష్టాత్మక ముంబై-అహ్మదాబాద్ హై స్పీడ్ రైల్ (ఎంఏహెచ్ఎస్ఆర్) ప్రాజెక్టు వేగం పుంజుకుంది. 2026 నాటికి పాక్షిక కార్యకలాపాలు ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నారు. అన్నీ అనుకూలిస్తే 2028 నాటికి ప్రాజెక్ట్ పూర్తైతే బుల్లెట్ రైల్ దూసుకెళ్లనుంది. తద్వారా ప్రపంచంలో హై స్పీడ్ రైల్ వ్యవస్థ కలిగిన అతికొద్ది దేశాల సరసన భారత్ నిలవనుంది.

హైస్పీడ్ రైలు ప్రాజెక్టు కోసం 300 కి.మీ. వయాడక్ట్‌లు పూర్తయినట్లు కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ఇటీవల తెలిపారు. ముంబై?అహ్మదాబాద్ కారిడార్ పొడవు 508 కిలోమీటర్లు. బుల్లెట్ రైలు గంటకు 320 కిలోమీటర్ల గరిష్ఠ వేగంతో ప్రయాణించనుంది. ముంబైలో మొదలై సూరత్, వడోదర, అహ్మదాబాద్ స్టాప్స్‌నకు పరిమితమైతే చివరి స్టాప్ అయిన సబర్మతికి 2 గంటల 7 నిమిషాల్లోనే ఈ రైలు చేరనుంది. అన్ని స్టాప్స్‌లోనూ ఆగితే 2 గంటల 58 నిమిషాల సమయం తీసుకుంటుంది. ఈ కారిడార్‌లో 12 స్టేషన్లు ఉన్నాయి. వీటిలో గుజరాత్‌లో ఎనిమిది, మహారాష్ట్రలో నాలుగు ఉన్నాయి. ముంబై స్టేషన్స్ భూగర్భంలో నిర్మిస్తుండగా మిగిలిన థానే, విరార్, బోయిసర్, వాపి, బిలిమోరా, సూరత్, భరూచ్, వడోదర, ఆనంద్, అహ్మదాబాద్, సబర్మతి వద్ద ఎలివేటెడ్ స్టేషన్స్ రానున్నాయి.

### సముద్రగర్భ రైల్ టన్నెల్..

బుల్లెట్ రైలు కారిడార్‌లో 21 కిలోమీటర్ల పొడవైన సముద్రగర్భ రైల్ టన్నెల్ ప్రత్యేక ఆకర్షణ. ఇది ముంబై?థానే మధ్య ఏర్పాటవుతోంది. ఇందులో భారత్‌లోనే మొట్టమొదటి 7 కి.మీ. పొడవైన సముద్రగర్భ సొరంగం కూడా ఉంది. 13.1 మీటర్ల వ్యాసం కలిగిన ఒకే ట్యూబ్ సొరంగంలో రెండు ట్రాక్‌లు ఉంటాయి. ముంబై-అహ్మదాబాద్ హై స్పీడ్ రైల్ ప్రాజెక్టులో 465 కి.మీ. మేర ఎలివేటెడ్ కారిడార్ ఉంటుంది. ప్రధానంగా ఫుల్ స్పాన్ లాంచింగ్ మెథడ్ ఉపయోగించి నిర్మిస్తున్నారు. వయాడక్ట్ నిర్మాణంలో ఉపయోగించే సంప్రదాయ సెగ్మెంటల్ నిర్మాణ సాంకేతికత కంటే ఇది 10 రెట్లు వేగంగా ఉంటుంది. ఈ ప్రత్యేకమైన నిర్మాణ పద్ధతిని దేశంలో మొదటిసారిగా ఉపయోగిస్తున్నారు.

ఈ సాంకేతికతను ఉపయోగించే, నైపుణ్యం సాధించిన ప్రపంచంలోని అతి కొద్ది దేశాలలో భారత్ ఒకటి.

**ట్రయల్ రన్ గుజరాత్‌లో..**

ఈ ప్రాజెక్టును అమలు చేస్తున్న నేషనల్ హై?స్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ ప్రకారం.. 383 కి.మీ. పీయర్ పనులు, 401 కి.మీ. ఫౌండేషన్, 326 కి.మీ. గర్డర్ క్యాస్టింగ్ కూడా పూర్తయ్యాయి. ఇప్పటివరకు రూ.67,486 కోట్లు ఖర్చయ్యాయి. ప్రాజెక్టు పూర్తి అయ్యేసరికి వ్యయం భారీగా పెరిగే అవకాశం ఉంది. 2026లో మొదటి ట్రయల్ రన్ గుజరాత్‌లో 50 కి.మీ.లో నిర్వహించనున్నారు. ఢిల్లీ-వారణాసి, చెన్నై-మైసూరు వంటి కారిడార్లలో హెచ్ఎస్ఆర్ ప్రాజెక్ట్ సాధ్యాసాధ్యాలపై అధ్యయనం జరుగుతోంది.

**ఆటంకాలు దాటుకుని..**

కోవిడ్-19 మహమ్మారి, మహారాష్ట్రలో భూసేకరణ, అనుమతుల జాప్యం.. వంటి కారణాలు బుల్లెట్ రైలు ప్రాజెక్టును రెండున్నరేళ్లు వెనక్కి నెట్టాయి. మౌలిక సదుపాయాలు, రోలింగ్ స్టాక్, సిగ్నలింగ్ వ్యవస్థ ఖరీదు భారం కావడం వంటి సవాళ్లను ఎదుర్కొంది. భారత రైల్వేల సొంత ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ, ప్రభుత్వ అధీనంలో ఉన్న బీఈఎంఎల్‌ను సంయుక్తంగా 280 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే రెండు ప్రోటోటైప్ రైలు సెట్లను (ఒక్కొక్కటి ఎనిమిది కార్లు) రూపొందించి తయారు చేయడానికి కేంద్రం అనుమతి ఇచ్చింది.

ఆర్థిక సహాయంతోపాటు భారత్‌లో సమాచార సేకరణ, పరీక్షల కోసం రెండు షింకన్సెన్ రైళ్లను (జపాన్ బుల్లెట్ రైళ్లు) 2026 నాటికి జపాన్స్ ఇంటర్నేషనల్ కో?ఆపరేషన్స్ ఏజెన్సీ (జికా) ఉచితంగా సరఫరా చేయనుంది. సిగ్నలింగ్ వ్యవస్థకు ప్రత్యామ్నాయాలను అందించేందుకు ఆల్‌స్టమ్?ఎల్‌అండ్‌టీ, డీఆర్ఏ?సీమెన్స్ ?స జాయింట్ వెంచర్లు టెండర్ల కోసం బిడ్డింగ్ చేస్తున్నాయి.

**హెచ్ఎస్ఆర్‌గా పరిగణించాలంటే..**

హై?స్పీడ్‌గా పరిగణించాలంటే రైళ్లు వాటి కోసం ప్రత్యేకంగా కేటాయించిన ట్రాక్‌లపై గంటకు 250 కి.మీ. కంటే ఎక్కువ వేగంతో వెళ్లాలి. సాధారణంగా వీటికి నూతన, ప్రత్యేకంగా రూపొందించిన మార్గాలు అవసరం. కొన్ని హెచ్ఎస్ఆర్ వ్యవస్థలు ప్రస్తుత నెట్‌వర్క్‌లోని కొంత ట్రాక్‌లను ఉపయోగిస్తాయి. అధిక వేగానికి తగ్గట్టుగా ట్రాక్‌లలో మార్పు, సిగ్నలింగ్‌ను మెరుగుపరచడం వంటివి చేయాల్సి ఉంటుంది. కఠిన భద్రతా ప్రమాణాలు, తగినంత విద్యుత్ సరఫరా, శిక్షణ పొందిన ఆపరేటింగ్ సిబ్బంది, మెరుగైన నిర్వహణ తప్పనిసరి.

వాటి అనుభవాల నుంచి..

జపాన్, ఫ్రాన్స్, జర్మనీతో సహా అభివృద్ధి చెందిన దేశాల్లో హై స్పీడ్ రైల్ నెట్‌వర్క్ ఉంది. ప్రపంచంలో అతిపెద్ద హెచ్ఎస్ఆర్ నెట్‌వర్క్ ఉన్న దేశం చైనా. ఇండోనేషియా, ఉజ్బెకిస్తాన్ వంటి మధ్య ఆదాయ దేశాలు సైతం హెచ్ఎస్ఆర్ జాబితాలో ఉన్నాయి. ఇప్పటికే హెచ్ఎస్ఆర్ నెట్‌వర్క్‌లను కలిగి ఉన్న దేశాల్లో పరిస్థితులపై పూర్తిస్థాయిలో మనం అధ్యయనం చేయాలి. అలాగే బుకింగ్స్ సమస్యలు (ఉజ్బెకిస్తాన్ ), భారీ నిర్వహణ వ్యయాలు (చైనా), శబ్ద కాలుష్యం (జపాన్స్ ) వంటి విషయాల్లో ఈ నెట్‌వర్క్‌లు ఎదుర్కొన్న విమర్శలపైనా దృష్టిపెట్టాలి. అప్పుడే మన బుల్లెట్ రైలు బ్రేకులు లేకుండా యమస్పీడుగా దూసుకెళ్తుంది.

**రూ.లక్ష కోట్ల ప్రాజెక్టు**

ముంబై?అహ్మదాబాద్ హై స్పీడ్ రైల్ (ఎంఏహెచ్ఎస్ఆర్) ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.1,08,000 కోట్లు. ఇందులో 81 శాతం నిధులను జపాన్స్ ఇంటర్నేషనల్ కో?ఆపరేషన్స్ ఏజెన్సీ (జికా) ద్వారా జపాన్స్ ప్రభుత్వం సమకూరుస్తోంది. ఈ ప్రాజెక్టులో రైల్వే మంత్రిత్వ శాఖకు 50 శాతం, మహారాష్ట్ర, గుజరాత్‌కు చెరి 25 శాతం వాటా ఉంది. మొత్తం 1,389.5 హెక్టార్ల భూమిని సమీకరించారు.

**బుల్లెట్ రైల్.. ఇతర హైలైట్స్**

- ముంబై-అహ్మదాబాద్ కారిడార్ పొడవు 508 కిలోమీటర్లు.
- బుల్లెట్ రైలు గరిష్ఠ వేగం గంటకు 320 కి.మీ.
- 2028 నాటికి దూసుకెళ్లనున్న బుల్లెట్ రైల్
- పరిమిత స్టాప్స్‌తో 2 గంటల 7 నిమిషాల్లోనే ప్రయాణం
- అన్ని స్టాప్స్‌లో ఆగితే 2 గంటల 58 నిమిషాల సమయం



# సైబర్ కాండ్రియా నెట్ వైద్యం



అన్నింటినీ గూగుల్‌లో వెతకడం అలవాటైపోయిన చాలామంది అనారోగ్య సమస్యలకు వైద్యం, మందులను కూడా నెట్‌లోనే వెతికేస్తున్నారు. అంతటితో ఆగకుండా దాని గురించి లోతుగా చదివి, తమకు ఏదో పెద్ద జబ్బే వచ్చిందని తెగ ఆందోళన పడిపోతున్నారు. వెతికింది జబ్బో కాదో తెలీదు గానీ ఇలా అనవసరంగా వెతకడం మాత్రం పెద్ద జబ్బే. దీనిపేరు సైబర్‌కాండ్రియా లేదా కంప్యూకాండ్రియా. ఇదో విచిత్రమైన వ్యాధి. పిల్లలు, యువతలో ఇప్పుడిది ఎక్కువైపోయింది.

పత్రికలూ లేదా మేగజైన్లలోనూ ఆరోగ్య సమాచారాన్ని చదువుతూ ఆందోళన చెందడాన్ని 'హైపోకాండ్రియా'గా చెబితే.. ఇప్పుడు ఇలా ఇంటర్‌నెట్‌లో చదువుతూ ఆందోళన చెందడాన్ని 'సైబర్' కాండ్రియాగా పేర్కొంటున్నారు. ఈ సమస్య ఉన్నవారు తమ ఆరోగ్య సమస్యల గురించి సమాచారాన్ని ఆన్‌లైన్‌లో వెతికి బాగా లోతుగా చదివి, తమకు ఏదో పెద్ద జబ్బే వచ్చిందని భ్రమ పడుతుంటారు.

ఉదాహరణకు ఓ వ్యక్తికి మామూలుగా తలనొప్పి వచ్చిందనుకోండి. ఆన్‌లైన్‌లో వెతికేటప్పుడు దొరికిన సమాచారంలో దాన్ని 'బ్రెయిన్ ట్యూమర్' తాలూకు ఓ మ్యానిఫెస్టేషన్‌గా చదివాక తనకూ బ్రెయిన్ ట్యూమర్ లేదా బ్రెయిన్ క్యాన్సర్ ఉందేమోనని అనవసరంగా అపోహపడటం, ఆ భయాలతో ఆందోళన పడటం చేస్తుంటారు. ఇలా తమకున్న గోరంత సమస్యను కొండంత చేసుకుంటారు.

వైద్యపరిశోధకులైన డాక్టర్ రయెన్ వైట్, డాక్టర్ ఎరిక్ హోర్విట్జ్ 2009లో నిర్వహించిన ఓ అధ్యయనంలో ఇలా వెతికేవారు కేవలం మామూలు లక్షణాలకే పరిమితం కాకుండా అరుదైన, తీవ్రమైన వ్యాధుల తాలూకు పేజీలనూ ఎక్కువగా క్లిక్ చేసినట్టు తేలింది. వీరిలో స్వల్ప లక్షణాలున్నా పెద్ద వ్యాధి ఉందేమో అని ఆందోళన చెందడం సర్వసాధారణమైందని ఆ అధ్యయనవేత్తలు వెల్లడించారు. సెర్చ్ ఇంజిన్ల లాగ్స్‌ను ఉపయోగించి, 515 మందిపై వీరు ఈ సర్వే నిర్వహించారు.

**పెద్దలూ అతీతులు కారు**

సైబర్ కాండ్రియాకు పెద్దలూ అతీతులు కాదు. ఉదాహరణకు ఓ కొత్త బ్రాండ్ వాషింగ్ పౌడర్ వాడాక ఒంటి మీద

అలర్జీ వచ్చినప్పుడు ఇంటర్నెట్‌లో వెదుకుతారు. ఆ లక్షణాలను బట్టి అది లూపస్ లేదా లైమ్ వ్యాధి అని చెబితే దాని గురించి మరింత భయపడతారు. అవసరం లేని పరీక్షలు చేయించడంతో పాటు అవసరం లేని మందులూ వాడతారు.

ఇది వారి మానసిక, శారీరక ఆరోగ్యం, వ్యాధి నిరోధక శక్తి మీదా దుష్ప్రభావం చూపవచ్చు. ఆరోగ్య భయం ఎక్కువగా ఉన్నవారు ఇంటర్నెట్‌లో ఆరోగ్య సమాచారం కోసం మరింత ఎక్కువ వెతుకుతారు. ఆ తర్వాత అది వారిలో మరింత ఆందోళనకు దారితీస్తుంది. ఇలా ఇదొక విష వలయంలా కొనసాగుతూ ఉంటుంది.

**కొంత మంచి సమాచారమూ**

ఇంటర్‌నెట్‌లో దొరికే ప్రతి విషయమూ చెడ్డది కాదు. మయో క్లినిక్, కిడ్స్ హెల్త్, నేషనల్ ఇన్స్ స్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్ (ఎన్ఐహెచ్) వంటి వెబ్‌సైట్లు అందరికీ అర్థమయ్యే రీతిలో నమ్మదగిన ఆరోగ్య సమాచారాన్ని అందిస్తున్నాయి. అవి మంచి వెబ్‌సైట్లే అయినా అందులోని విషయాన్ని చదివి తప్పుగా అర్థం చేసుకుంటే అదీ ప్రమాదమే. అందుకే ప్రతి అనారోగ్య సమస్య గురించీ ఆన్ లైన్లో ఎక్కువసేపు వెతకడం తగ్గించాలి. అది త్వరగా తగ్గకపోతే ముందుగా తమ పెద్దవారికి చెప్పడం లేదా మంచి డాక్టర్ని సంప్రదించాలి.

సైబర్‌కాండ్రియా ఇప్పుడు కొత్త జనరేషన్‌లో కనిపిస్తున్న సమస్య. చేతిలో ఉన్న స్మార్ట్‌ఫోన్‌తో మనకు ఎంతైనా సమాచారం అందుబాటులో ఉండవచ్చు. కానీ దాన్ని విజ్ఞతతో ఉపయోగించుకోవడం తెలియనప్పుడు ఎదురయ్యే సమస్య ఇది. ఆ విజ్ఞత నేర్పడం తల్లిదండ్రుల బాధ్యత అని గుర్తెరగాలి.

**వైద్యులపైనా నమ్మకం పోవచ్చు!**

సైబర్ కాండ్రియా వల్ల జరిగే మరో ప్రధాన నష్టం ఏంటంటే ఇలా ఇంటర్‌నెట్‌లో వెదకడమన్నది వైద్యులపై ఉన్న నమ్మకాన్ని కూడా దెబ్బతీయవచ్చు. ఆన్ లైన్ లో చదివిన దానికి డాక్టర్ చెప్పిన అంశాలు భిన్నంగా ఉంటే, వైద్యుని మాటనూ నమ్మకపోవచ్చు, డాక్టర్‌ను అనుమానించవచ్చు. కొంతమంది డాక్టర్ దగ్గరకు వెళ్లకుండానే ''నేనే నిర్ధారణ (సెల్ఫ్ డయాగ్నోసిస్) చేసుకున్నా'' అనేలా ప్రవర్తిస్తుంటారు.

ఇది మరింత ప్రమాదకరం. దీనివల్ల ఏమాత్రం ముప్పు కలిగించని ఓ చిన్న సమస్యను పెద్దదిగా భావించడం, పెద్ద సమస్యను చిన్నదిగా భావించడం జరగవచ్చు. నిజానికి ఓ వ్యక్తి తాలూకు పూర్తి వైద్య చరిత్ర (మెడికల్ హిస్టరీ) ఇంటర్‌నెట్‌కు తెలియదు. అలా అది చిన్న జలుబు నుండి క్యాన్సర్ వరకు అన్నింటికీ అందరికీ ఒకే రకమైన పరిష్కారాలు చూపిస్తుంది.

**పిల్లలు, యువతలోనే ఎక్కువ**

సైబర్‌కాండ్రియా సమస్యకు లోనవుతున్న వారిలో ముఖ్యంగా టీనేజ్ పిల్లలతో పాటు కౌమార యువత (అడాలసెంట్ యూత్) ఎక్కువగా ఉంటున్నారు. తమ సమస్యను బయటకు చెప్పుకోలేనప్పుడు వారు ఇంటర్‌నెట్‌నే ఆశ్రయిస్తున్నారు.

పైగా తమకు ఉండే ఉత్సుకతకు తోడుగా ఆ వయసు పిల్లల్లో సహజంగా టెక్నాలజీ వాడకంలో ఉన్న నైపుణ్యాలు వారిని ఇంటర్‌నెట్ వైపునకు మళ్లేలా చేస్తున్నాయి. అయితే అక్కడ లభ్యమయ్యే సమాచారాన్ని ఏమేరకు తీసుకోవాలన్న విజ్ఞతగానీ, విజ్ఞానంగానీ ఆ వయసులో ఉండకపోవడమే వారిని అపార్థాలూ, అపోహల వైపునకు నెడుతోంది.

ఉదాహరణకు, స్కూల్ ముగిసేసరికి తాను అలసిపోతుండటాన్ని ప్రస్తావిస్తూ ఓ బాలిక అదే విషయాన్ని గూగుల్‌ను అడిగింది. నిజానికి అది మామూలు అలసట మాత్రమే. కానీ గూగుల్ తన సమాచారంలో "ల్యూకేమియా లేదా గుండె సమస్యల వల్ల ఇలా జరగవచ్చు" అనే సమాధానం ఇచ్చింది. దాంతో ఆమె చాలా ఆందోళనకు లోనైంది. నిజానికి ఆమె అలసటకు మరెన్నో మామూలు కారణాలు ఉండవచ్చు.

ఉదాహరణకు తగిన నిద్ర లేకపోవడం లేదా మొబైల్ ఎక్కువ సేపు చూడటం వంటివి. కానీ గూగుల్ సమాధానంతో ఆమెలో కొత్తగా గుండె వేగంగా కొట్టుకోవడం, నిద్రలేమి వంటి ఇతర లక్షణాలు కనిపించవచ్చు. వాటి గురించి మళ్లీ వెదికినప్పుడు దొరికే సమాధానాలు ఆ చిన్నారి లేత మెదడును మరింత గందరగోళానికి గురిచేసే ప్రమాదం ఉంది.

**మిడిమిడి జ్ఞానంతో వీడియోలు**

ఇటీవలి కాలంలో ఆరోగ్య సమాచారాలకు మంచి వ్యూవర్‌షిప్ ఉండటంతో వీడియోలు, రీల్స్ తయారు చేసే కొందరు రేటింగ్ కోసం తమ మిడిమిడి జ్ఞానంతో ఆందోళన పెంచే అభూత కల్పనలనూ వైరల్ చేస్తుండటంతో 'సైబర్‌కాండ్రియా'కు లోనయ్యేవారి సంఖ్య పెరుగుతోంది.

సైబర్‌కాండ్రియా నివారణకు

సెర్చ్ ఇంజిన్ కంటే వైద్యులను నమ్మడమే మేలు. ప్రశాంతంగా ఉండటం అలవాటు చేసుకోవాలి. నిజానికి కొన్నిసార్లు ఆందోళన వల్లే శారీరక సమస్యలు కనిపిస్తాయి. ధ్యానం, శ్వాస వ్యాయామాలు (బ్రీతింగ్ ఎక్సర్‌సైజెస్),

నలుగురితో కలిసి వినోదాత్మకమైన కార్యకలాపాల్లో పాల్గొనడం, ఏదైనా పనితో తమను తాము బిజీగా ఉంచుకోవడం వంటివి సైబర్‌కాండ్రియా సమస్యను చాలావరకు నివారిస్తాయి.

– డాక్టర్ ముఖర్జీ, సీనియర్ కార్డియాలజిస్ట్



# చింత చిగురా మజాకా.. కాస్త దట్టిస్తే చాలు ఆహా..!

వేసవి కాలం వచ్చిందంటే చిటారు కొమ్మన కొంచెం పచ్చగా, కొంచెం ఎర్రగా మెరుస్తూ ఊరిస్తూ ఉంటుంది. వగరుగా, వగరుగా, నోటికి పుల్లగా, వెజ్ అయినా నాన్‌వెజ్ అయినా దీన్ని కాస్త దట్టించామంటే అద్భుతమైన టేస్ట్ ఆహా ఏమి రుచి అంటూ లొట్ట లేసుకుంటూ తినేయాల్సిందే. ఇంతకీ ఏమిటది. అదేనండీ తలుచుకుంటేనే నోట్లో నీళ్లు ఊరిపోయే చింత చిగురు. అందుకే చింత చిగురు ఉంటే ఆరోగ్యంపై చింత అవసరం లేదు అంటారు పెద్దలు. మరి చింతచిగురుతో లభించే ఆరోగ్య ప్రయోజనాల గురించి తెలుసుకుందాం.

వేసవి కాలం వచ్చిందంటే దీనికి చాలా డిమాండ్ ఎక్కువ. చాలాసార్లు మటన్ ధరతో పోటీ పడుతూ అత్యంత ఖరీదైన కూరల్లో ఒకటిగా నిలుస్తుంది. చింత చిగురు, రుచి, లభించేపలు పోషకాహారాలు మెండుగా ఉండటంతో అధిక ధర పలుకుతున్నా దీనికి డిమాండ్ బాగుంది. సాధారణంగాచింత చిగురును పప్పుగా, కూరగా , పచ్చడి రూపంలో ఎక్కువగా ఆరగిస్తారు. కానీ చింత చిగురు, రొయ్యలు, చేపల కాంబినేషనే రుచే వేరు. చిగురుతో చేప, రొయ్య, కోడి కూర చింతచిరుగు దట్టిస్తే ఆహార ప్రియులకు పండగే.

**పోషకాల గని**

చింత చిగురులో ఆరోగ్యానికి అవసరమైన పోషకాలు ఉన్నాయి. 100 గ్రాముల చిగురులో 5.8 గ్రాముల ప్రొటీన్లు, 10.06 గ్రాముల పీచు పదార్థం, 100 మిల్లీగ్రాముల కాల్షియం, 140 మిల్లీగ్రాముల పాస్ఫరస్, 26 మిల్లీగ్రాముల మెగ్నీషియం, విటమిన్ 'సి' 3 మిల్లీ గ్రాములు ఉంటాయి. ఇండియన్ జర్నల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కూడా చింత చిగురుతో అనేక ప్రయోజనాలు ఉన్నా యని ప్రకటించింది.

**చింత చిగురుతో ఆరోగ్య ప్రయోజనాలు**

వేసవికాలంలో చింత చిగురు తినడం చెమటకూడా ఎక్కువ పట్టదట. వేసవిలో వేధించే చెమట పొక్కులనుంచి ఉపశమనం లభిస్తుంది. చింత చిగురులోని ఫినాల్స్, యాంటీ ఆక్సిడెంట్లు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి. శరీరంలో ఎర్రరక్త కణాల ఉత్పత్తికి అవసరమైన పోషకాలను అందించి, రక్తాన్ని శుద్ధి చేస్తుంది.

యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి. చిగురును ఉడికించి నీటిని పుక్కిలిస్తే గొంతు నొప్పి, మంట, వాపు, నోటి పూత తగ్గుతాయి. చింత చిగురులో డైటరీ ఫైబర్ పుష్కలంగా ఉంటుందిమలబద్ధకం సమస్య తొలగిపోతుంది.

పైల్స్ నివారణకు ఉపయోగపడుతుంది. వైరల్ ఇన్ఫెక్షన్లతో వచ్చే జ్వరాన్ని తగ్గిస్తుంది. జీర్ణాశయ సంబంధ సమస్యలను తగ్గిస్తుంది. గుండె జబ్బులు రాకుండా చూస్తుంది.

నులి పురుగుల సమస్యతో బాధపడుతున్న చిన్నారులకు చింత చిగురు ఔషధంగా పనిచేస్తుంది. విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉండటంతో రోగ నిరోధక శక్తిగా పనిచేస్తుంది.

ఎముకుల దృఢత్వం, థైరాయిడ్ నివారణకు దోహదపడుతుంది.

షుగర్ వ్యాధిగ్రస్తుల్లో చక్కెర స్థాయిలను తగ్గిస్తుంది.

కీళ్ల వాపుల నివారణ, మలేరియా నుంచి ఉపశమనాన్ని కలిగిస్తుంది. తల్లిపాలను మెరుగుపరుస్తుంది.



# మండే ఎండలు: కిడ్నీలో రాళ్లు, పెరుగుతున్న కేసులు, బీ అలర్ట్!

హైదరాబాద్ తెలంగాణలో వేసవి ముదురుతోంది. ఎండలు ఠారెత్తిస్తున్నాయి. అదే సమయంలో రాష్ట్రవ్యాప్తంగా ఈ సీజన్ల కిడ్నీలలో రాళ్లు ఏర్పడే కేసులు రెండు నుంచి రెండున్నర రెట్లు పెరిగాయని ఏషియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ (ఏఐఎన్యూ) తన నివేదికలో తెలిపింది. డీహైడ్రేషన్, ఆహారపు అలవాట్లు సరిగా లేకపోవడం, విపరీతంగా ఎండల్లో తిరగడం వల్ల రోజుకు సుమారు 300 నుంచి 400 మంది రోగులు కిడ్నీల్లో రాళ్ల సమస్యతో రావడంతో వారికి ఏఐఎన్యూల చికిత్సలు చేస్తున్నారు. వేసవి అంటేనే “స్టోన్ సీజన్” అంటారు. ఈ కాలంలో ముఖ్యంగా కిడ్నీలకు చాలా ప్రమాదం ఉంటుంది. ప్రధానంగా శరీరంలో నీరు ఆవిరి అయిపోవడం, ఉప్పు ఎక్కువగా తినడం, తగినంత నీరు తీసుకోకపోవడం వంటి కారణాల వల్ల వేసవిలో కిడ్నీలలో రాళ్లు ఎక్కువగా ఏర్పడతాయి.

రోజుకు సగటున 300 నుంచి 400 వరకు కిడ్నీల్లో రాళ్ల కేసులు వస్తున్నాయి. ఇటీవలి కాలంలో ఇది బాగా ఎక్కువ. రాష్ట్ర వ్యాప్తంగా శీతాకాలంతో పోలిస్తే ఈ బాధితుల సంఖ్య రెట్టింపు దాటిపోయింది. జంక్ ఫుడ్ తినడం, ఎక్కువగా కదలక పోవడం, తగినంత నీరు తాగకపోవడంతో పిల్లలు, యువతలో ఈ సమస్య ఎక్కువవుతోంది.

10-17 సంవత్సరాల మధ్య పిల్లల్ల రాళ్లు ఎక్కువగా కనిపిస్తున్నాయి. పాఠశాలలో ఉన్నప్పుడు నీళ్లు తాగకపోవడం, స్నాక్స్ ప్యాకెట్లు కొని తినడం, కూల్ డ్రింకులు తాగడం దీనికి కారణం.

పురుషులతో పోలిస్తే మహిళలకు ఈ సమస్య కొంత తక్కువే (సుమారు 40% తక్కువ). కానీ, గర్భవతులుగా ఉన్నప్పుడు ఈ సమస్య వచ్చి, గుర్తించకపోతే ముప్పు ఎక్కువ.

పిల్లల్లో ఈ సమస్య వల్ల దీర్ఘకాలంలో వారి కిడ్నీల ఆరోగ్యంపై ప్రభావం పడుతుంది.

ఈ సందర్భంగా ఏఐఎన్యూకు చెందిన సీనియర్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డాక్టర్ తైఫ్ బెండెగెరి మాట్లాడుతూ, “కిడ్నీలో రాళ్ల కేసులు ఈసారి అసాధారణంగా పెరిగాయి. ముఖ్యంగా పిల్లలు, యువతలో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తోంది. వేడి పెరిగిపోవడం, తగినంత నీరు తాగకపోవడం ఇందుకు ప్రధాన కారణాలు. పాఠశాలకు వెళ్లే పిల్లలు జంక్ ఫుడ్ ఎక్కువగా తినడం వల్ల వారికి ఈ కిడ్నీలో రాళ్ల సమస్య ఎక్కువ అవడం ఆందోళన కలిగిస్తోంది. ఈ రాళ్ల సమస్య కేవలం పెద్దవాళ్లది అనుకోకూడదు. పిల్లల తల్లిదండ్రులతో పాటు పాఠశాలలు కూడా దీనిపై అవగాహన పొందాలి. తగినంత నీళ్లు తాగడం, సరైన ఆహారం తీసుకోవడం, సమస్యను త్వరగా గుర్తించడం వల్ల చాలా తేడా ఉంటుంది. ముఖ్యంగా వేసవి నెలల్ల ఈ జాగ్రత్తలు తప్పక తీసుకోవాలి” అని సూచించారు.

**జాగ్రత్తగా ఉండండిలా**

తగినన్ని నీళ్లు తాగాలి. మూత్రం స్పష్టంగా, లేతరంగులో ఉండేలా చూసుకోవాలి.


ఉప్పు, ప్రాసెస్డ్ ఆహారం, జంతువుల కొవ్వు పదార్థాల వాడకం తగ్గించాలి.

ముఖ్యంగా పిల్లల్లో జంక్ ఫుడ్, ప్యాకేజ్డ్ చిరుతిళ్లు, కూల్ డ్రింకుల వాడకం మానేయాలి.


స్కూల్లో ఉన్నప్పుడు, ఇళ్ల దగ్గర కూడా తగినన్ని నీళ్లు తాగేలా చూడాలి

కుటుంబంలో ఎవరికైనా గతంలో కిడ్నీ రాళు ఏర్పడితే మరింత జాగ్రత్తగా ఉండాలి.

ఎప్పటికప్పుడు కిడ్నీ పరీక్షలు చేయించుకోవడం చాలా అవసరం. ముఖ్యంగా పిల్లలకు కారణం లేకుండా కడుపునొప్పి రావడం, తరచు మూత్ర విసర్జనకు ఇబ్బంది పడడం లాంటి లక్షణాలుంటే వెంటనే వైద్యులకు చూపించాలి. తగినన్ని నీళ్లు తాగడం చాలావరకు ఈ సమస్యను దూరం పెడుతుంది.







# కిన్నెరసాని.. చూసొద్దాం రండి..

వేసవి సెలవులు వచ్చాయి. చిన్నారులు, పెద్దలు, మహిళలు వెళ్లేందుకు కిన్నెరసాని ప్రాంతం ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. పచ్చదనాన్ని పంచే అడవులు, స్వచ్ఛమైన ప్రాణవాయువును అందించే చెట్లు.. చెంగుచెంగున ఎగిరే వన్యప్రాణులు, గలగలా పారే సెలయేర్లు.. పక్షుల కిలకిలారావాలకు కిన్నెరసాని డీర్‌పార్కు చిరునామాగా నిలుస్తోంది. అడుగడుగునా ఆహ్లాదాన్ని పంచే జీవ వైవిధ్యం గల అటవీ అందాలతో మినీ ఊటీగా మారుతోంది కిన్నెరసాని పర్యాటక ప్రాంతం.

కొండకోనలు, పచ్చని చెట్లు, జలాశయం, వన్యప్రాణులతో చూడచక్కని ప్రకృతి అందాలకు నిలయమైన కిన్నెరసానిలో పర్యాటకులను ఆకట్టుకునేలా పచ్చని పొదరిళ్లు, ఎత్తయిన కొండలు, గుట్టలు, జలాశయం, చూడచక్కని ద్వీపాలు కనిపిస్తాయి. పర్యాటకుల ఊహకు ఏమాత్రం తగ్గని రీతిలో ఇక్కడి ప్రకృతి సోయగాలు ప్రతీ ఒక్కరిని అలరిస్తాయి. ఈ సుందర దృశ్యాలను తిలకించేందుకు రాష్ట్ర నలుమూలలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా పర్యాటకులు వస్తుంటారు. ముఖ్యంగా వేసవి సెలవుల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి కూడా ఇక్కడికి వస్తుంటారు.

**పర్యాటకులను ఆకర్షించేలా కాటేజీలు**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలంలోని కిన్నెరసాని పర్యాటక ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 2015లో నీతి ఆయోగ్ పథకం కింద రూ.3.24 కోట్లు, ఎకో టూరిజం అభివృద్ధి కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.7.53 కోట్లు మంజూరు చేశాయి. ఆయా నిధులతో కిన్నెరసానిలో తొమ్మిది కాటేజీలు, అద్దాలమేడ నిర్మాణం చేపడుతున్నారు. కిన్నెరసాని రిజర్వాయర్‌లో పర్యాటకుల కోసం బోటు షికారు ఏర్పాటు చేశారు. ఇక్కడికి వచ్చిన పర్యాటకులు డీర్‌పార్క్‌లోని చుక్కల జింకలు, జలాశయం అందాలను చూసి.. మరోసారి రావడానికి ఉత్సాహం చూపుతుంటారు.

అద్దాలమేడకు ఎంతో ప్రాముఖ్యం

కిన్నెరసాని పర్యాటక ప్రాంతంలో ఒకప్పుడు అద్దాలమేడకు ఎంతో ప్రాముఖ్యత ఉండేది. 1978లో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో అద్దాలమేడతో పాటు పలు కాటేజీలు నిర్మించారు. అయితే ఆ తర్వాత అద్దాలమేడను మావోయిస్టులు ధ్వంసం చేయడంతో కళావిహీనంగా తయారైంది. కాగా, కిన్నెరసానిని పర్యాటకంగా అభివృద్ధి చేయడంలో భాగంగా అద్దాలమేడ పునరుద్ధరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసిన రూ,10.77 కోట్లు ఖర్చు చేశారు. శిథిలావస్థకు చేరిన అద్దాలమేడతో పాటు కాటేజీలను కూల్చి వాటి స్థానంలో కొత్తవి నిర్మించారు. రిజర్వాయర్ చుట్టూ ఎత్తయిన గుట్టపై రెండంతస్తుల్లో 9 కాటేజీలు, అద్దాల మేడ, ఫుడ్ కోర్టు నిర్మించారు.

**కిన్నెరసానికి ఎలా చేరుకోవాలంటే**

ఖమ్మం నుంచి భద్రాద్రి జిల్లా పాల్వంచకు 90 కిలోమీటర్లు ఉంటుంది. ఈ పట్టణానికి చేరుకున్నాక అంబేద్కర్ సెంటర్ నుంచి 12 కిలోమీటర్లు ప్రయాణిస్తే కిన్నెరసాని ప్రాజెక్టు వస్తుంది. అక్కడ ప్రకృతి అందాలతో నిండిన జలాశయం, జింకల పార్కు ఉంటాయి. కిన్నెరసానికి సమీపంలోని మందెరకలపాడు సమీప అటవీ ప్రాంతంలో జలపాతం ఉంది. ఇక్కడ నుంచి తిరిగి భద్రాచలం వెళ్లే మార్గంలో పెద్దమ్మతల్లి ఆలయం ఉంది. కాగా, కిన్నెరసాని చేరడానికి బస్ సౌకర్యం లేక ఆటోలను ఆశ్రయించాల్సిందే. వేసవి సెలవుల్లోనైనా బస్సు సౌకర్యం కల్పిస్తే కిన్నెరసానికి పర్యాటకుల సంఖ్య మరింతగా పెరుగుతుంది. ఇక వరంగల్ జిల్లా లక్నవరంలో ఏర్పాటు చేసినట్లుగా కిన్నెరసానిలో కూడా నీళ్ల మధ్య వంతెన నిర్మించి, ప్రత్యేక హోటళ్లు, వసతి గృహాలను నిర్మిస్తే పర్యాటకులను మరింతగా ఆకట్టుకోవచ్చు.



# ఉత్తమ నటుడు అల్లు అర్జున

పుష్ప-2 సినిమాలో నటనకు గాను అల్లు అర్జున్ ఉత్తమ నటుడిగా గద్దర్ అవార్డుకు ఎంపికయ్యారు. ఉత్తమ నటి అవార్డును నివేదా థామస్ (35 చిన్న కథ కాదు) గెలుచుకున్నారు. ప్రజా వాగ్గేయకారుడు, ఉద్యమకారుడు గద్దర్ పేరుపై ఏర్పాటుచేసిన సినిమా అవార్డులను తొలిసారి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజుతో కలిసి గద్దర్ అవార్డుల జ్యూరీ చైర్‌పర్సన్, నటి జయసుధ అవార్డుల వివరాలను ప్రకటించారు.

మొదటి ఉత్తమ చిత్రంగా కల్కి 2898ఏడీ, రెండో ఉత్తమ చిత్రంగా పొట్టేల్, మూడో ఉత్తమ చిత్రంగా లక్కీ భాస్కర్ అవార్డులు గెలుచుకున్నాయి. మొత్తం 11 కేటగిరీల్లో 1,248 నామినేషన్లు వచ్చినట్లు జయసుధ తెలిపారు. దాదాపు 14 ఏళ్ల తర్వాత తెలుగు సినిమా అవార్డులను ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. వచ్చేనెల 14వ తేదీన విజేతలకు గద్దర్ అవార్డులను ప్రదానం చేయనున్నారు.

రెండు చిత్రాలకు నాలుగేసి అవార్డులు

గద్దర్ అవార్డుల్లో కల్కి 2898ఏడీ, లక్కీ భాస్కర్ సినిమాలు నాలుగు కేటగిరీల్లో అవార్డులు గెలుచుకున్నాయి. ఉత్తమ చిత్రం, ఉత్తమ స్క్రీన్‌ప్లే, ఉత్తమ ఎడిటింగ్, స్పెషల్‌జ్యూరీ అవార్డులు లక్కీ భాస్కర్ చిత్రానికి దక్కాయి. ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకుడు, ఉత్తం ఆర్ట్ డైరెక్టర్, ఉత్తమ కాసూ?టమ్ డిజైనర్ కేటగిరీల్లో కల్కి అవార్డులు గెలుచుకుంది.

రజాకార్ సినిమా చారిత్రక విభాగంలో ఫీచర్ హెరిటేజ్ చిత్రం అవార్డుతోపాటు ఉ త్తమ సంగీత దర్శకుడు, ఉత్తమ మేకప్ ఆర్టిస్ట్ విభాగంలో అవార్డులు దక్కించుకుంది. అన్ని కేటగిరీల్లోనూ 2024కు సంబంధించి గద్దర్ సినిమా అవార్డులను ప్రకటించారు. 14 ఏళ్ల తర్వాత ప్రభుత్వం సినిమా అవార్డులు ఇవ్వబోతోందని దిల్ రాజు తెలిపారు. ఎలాంటి ఒత్తిళ్లు, ప్రలోభాలు లేకుండా స్వేచ్ఛగా ఎంపిక జరిగిందని చెప్పారు.

పారదర్శకంగా స్క్రీనింగ్ చేసి బెస్ట్ ఆఫ్ బెస్ట్‌ను ఎంపిక చేసినట్లు జయసుధ వివరించారు. 2014, జూన్ నుంచి 2023, డిసెంబర్ వరకు విడుదలైన ఉత్తమ చిత్రాలకు త్వరలో అవార్డులు ఇవ్వనున్నట్లు చెప్పారు. అవార్డులు ఇవ్వడం సంతోషంగా ఉందంటూ సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

**చిత్రాల విభాగంలో అవార్డులు**

మొదటి ఉత్తమ మొదటి చిత్రం: కల్కి

రేండో ఉత్తమ చిత్రం: పొట్టేల్

ఉత్తమ మూడవ చిత్రం: లక్కీ భాస్కర్
జాతీయ సమైక్యత, మత సామరస్యం, అణగారిన వర్గాల అభ్యున్నతిపై బెస్ట్ ఫీచర్ ఫిల్మ్: కమిటీ కుర్రోళ్లు
ఉత్తమ బాలల చిత్రం: 35 చిన్న కథ కాదు
ఉత్తమ తొలి చిత్ర దర్శకుడు: యదువంశీ (కమిటీ కుర్రోళ్లు)
ఉత్తమ వినోదాత్మక చిత్రం: ఆయ్
చారిత్రక విభాగంలో ఫీచర్ హెరిటేజ్ చిత్రం: రజాకార్
వ్యక్తిగత విభాగంలో అవార్డులు
ఉత్తమ నటుడు: అల్లు అర్జున్ (పుష్ప 2)
ఉత్తమ నటి: నివేదా థామస్ (35 చిన్న కథ కాదు)
ఉత్తమ దర్శకుడు: నాగ్ అశ్విన్ (కల్కి)
ఉత్తమ సహాయ నటుడు: ఎస్‌జే సూర్య (సరిపోదా శనివారం)
ఉత్తమ సహాయ నటి: శరణ్యా ప్రదీప్ (అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్)
ఉత్తమ సంగీత దర్శకుడు: భీమ్స్ (రజాకార్)
ఉత్తమ నేపథ్య గాయకుడు: సిద్ శ్రీరామ్ (ఊరి పేరు భైరవకోన? నిజమే నే చెబుతున్నా..)
ఉత్తమ నేపథ్య గాయని: శ్రేయా ఘోషల్ (పుష్ప 2? సూసేటి అగ్గిరవ్వ)
ఉత్తమ హాస్యనటులు: సత్య, వెన్నెల కిశోర్ (మత్తు వదలరా? 2)
ఉత్తమ బాలనటులు: మాస్టర్ అరుణ్ దేవ్ పోతుల (35 ఇది చిన్న కథ కాదు), బేబీ హారిక (మెర్సీ కిల్లింగ్)
ఉత్తమ కథా రచయిత: శివ పాలడుగు (మ్యూజిక్ షాప్ మూర్తి)
ఉత్తమ స్క్రీన్ ప్లే రచయిత: వెంకి అట్లూరి (లక్కీ భాస్కర్)
ఉత్తమ గేయ రచయిత: చంద్రబోస్ (రాజు యాదవ్)
ఉత్తమ సినిమాటోగ్రాఫర్: విశ్వనాథ్ రెడ్డి (గామి)
ఉత్తమ ఎడిటర్: నవీన్ నూలి (లక్కీ భాస్కర్)
ఉత్తమ ఆడియోగ్రాఫర్: అరవింద్ మేనన్ (గామి)
ఉత్తమ కొరియోగ్రాఫర్: గణేశ్ ఆచార్య (దేవర)
ఉత్తమ ఆర్ట్ డైరెక్టర్: నితిన్ జిహానీ చౌదరీ (కల్కి)
ఉత్తమ యాక్షన్ కొరియోగ్రాఫర్: కె. చంద్రశేఖర్ రాథోడ్ (గ్యాంగ్‌స్టర్)
ఉత్తమ మేకప్ ఆర్టిస్ట్: నల్ల శ్రీను (రజాకార్)
ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్: అర్చనా రావు, అజయ్ కుమార్ (కల్కి)

**స్పెషల్ జ్యూరీ అవార్డులు**
దుల్కర్ సల్మాన్ (లక్కీ భాస్కర్)
అనన్య నాగళ్ల (పొట్టేల్)
సుజిత్, సందీప్ (కేఏ)
ప్రశాంత్‌రెడ్డి, రాజేశ్ (రాజు యాదవ్)
స్పెషల్ మెన్షన్: ఫరియా అబ్దుల్లా (మత్తు వదలరా? 2)
తెలుగు సినిమాలపై ఉత్తమ పుస్తకం: మన సినిమా ఫస్ట్ రీల్ (రెంటాల జయదేవ్)



**అవార్డులకు ఎంపికైన వారి జాబితా మీడియాకు చూపుతున్న కమిటీ**











FIELD VISIT



COMPUTER LAB



FOOD SCIENCE LAB



CHEMISTRY LAB



PROJECT WORK



DINING HALL



STUDY HOURS



ZOOLOGY LAB



FESTIVAL CELEBRATION



CULTURAL ACTIVITY



TASK CLASS



MOTIVATIONAL CLASS




ANNUAL DAY CELEBRATIONS



COMPETITIVE COACHING



PLACEMENT CELL



STATE LEVEL GOLD MEDAL WINNER



UNIVERSITY LEVEL SPORTS



FLASH MOB



INTERNSHIP PROGRAMME



WOMEN'S DAY



జాగృతి కళాశాలలో పథకాల పంట




Owner, Publisher & Editor: Eldi Ravinder, Published from: 9-10/7, Krishna Nagar, Vil: Bommakal, Mdl& Dist: Karimnagar-505001, Telangana. Printed By: Gandal Srinivas, 8-82/11/1, Auto Nagar, Vil: Bommakal, Mdl & Dist: Karimnagar-505001, Telangana. RNI No. TELTEL/2013/51365